# భారత్ శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 163 | హైదరాబాద్ | గురువారం 18-12-2025 | పేజీలు : 12 | వెల : 1.00



11లో

షర్మిలకు శుభాకాంక్షలు తెలిపిన చంద్రబాబు, పవన్ కల్యాణ్

## హైదరాబాద్‌కు చేరుకున్న
# రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



- ప్రత్యేక విమానంలో హకీంపేటకు చేరుకున్న రాష్ట్రపతి
- స్వాగతం పలికిన గవర్నర్, మంత్రులు
- ఈ నెల 22 వరకు హైదరాబాద్‌లో ఉండనున్న రాష్ట్రపతి

11లో



## మూడు దేశాల పర్యటన..
# ఒమన్ చేరుకున్న ప్రధాని

- మస్కట్ విమానాశ్రయంలో ప్రధానికి సైనిక వందనంతో స్వాగతం
- ఒమన్ సుల్తాన్‌తో వాణిజ్యం, రక్షణ, ఇంధన రంగాలపై చర్చలు
- భారత్-ఒమన్ దౌత్య సంబంధాలకు 70 ఏళ్లు పూర్తి
- ఇథియోపియా పర్యటన ముగించుకుని ఒమన్‌కు వచ్చిన ప్రధాని

11లో

## తిరుమల శ్రీవారి ఆర్జిత సేవల
# కోటా టికెట్ల విడుదల రేపే..

- మార్చి నెల శ్రీవారి ఆర్జిత సేవల టికెట్లు 18న విడుదల
- ఎలక్ట్రానిక్ డిప్ కోసం 20వ తేదీ వరకు నమోదుకు అవకాశం
- 22న కల్యాణోత్సవం, ఊంజల్ సేవ టికెట్ల జారీ
- ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు 24న అందుబాటులోకి
- అదే రోజున తిరుమల, తిరుపతి గదుల కోటా విడుదల


11లో


11లో


## సంక్రాంతి పండుగకు 16 అదనపు రైళ్లు

## క్రీడా ఆణిముత్యాలను గౌరవించడంలో ఏపీ ఎప్పుడూ ముందుంటుంది


11లో

## 82 వేల ఎకరాలపై
# సీఎం కీలక ఆదేశం..

### పెట్టుబడులకు లైన్ క్లియర్!


11లో


- జిల్లా కలెక్టర్లతో కొనసాగుతున్న సీఎం చంద్రబాబు సమీక్ష
- 22ఏ పరిధిలోని 82 వేల ఎకరాల ఏపీఐఐసీ భూములపై కీలక ఆదేశం
- సాంకేతిక సమస్యలు లేకుంటే కేబినెట్ ముందుకు ప్రతిపాదనలు తేవాలని సూచన
- భూ కేటాయింపుల్లో టూరిజం, ఐటీ రంగాలకు అధిక ప్రాధాన్యం
- 18 నెలల్లో రూ.8.55 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్న సీఎం

## ఢిల్లీలో ప్రపంచ ఆరోగ్య సదస్సులో
# మోగిన ఫైర్ అలారం...

### బయటకు వెళ్లిన ప్రతినిధులు

- సంప్రదాయ ఔషధంపై ఢిల్లీలోని భారత మండపంలో సదస్సు
- ఏం జరిగిందో తెలియక ఆందోళనకు గురైన నిర్వాహకులు, ప్రతినిధులు
- ప్రతినిధులను బయటకు పంపించిన నిర్వాహకులు
- సాంకేతిక లోపం కారణంగా అలారం మోగినట్లు గుర్తింపు

11లో



# భారీగా తగ్గిన నిరుద్యోగరేటు

భారత దేశం యువ జనాభా ఎక్కువగా ఉన్న దేశం. మనకు యువతే బలం. పుష్కలమైన మానవ వనరులు ఉండడం మనకు బలం. అయితే దేశంలో సరిపడా ఉద్యోగాలు లేకపోవడం యువతకు శాపంగా మారుతోంది. దీంతో ప్రభుత్వాలు స్వయం ఉపాధివైపు మళ్లిస్తున్నాయి. మరోవైపు పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తుయి. మరోవైపు కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం భారీగా ఉద్యోగాల భర్తీ చేపడుతోంది. ఈ నేపథ్యంలో దేశంలో నిరుద్యోగ రేటు క్రమంగా తగ్గుతోంది. 4.7 శాతంగా నమోదైంది. పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్ఎఫ్) తాజా డేటా ప్రకారం ఇది 8 నెలల కనిష్ఠ స్థాయికి తగ్గింది.అక్టోబర్లో 5.2 శాతం ఉన్న రేటు నుంచి గణనీయ తగ్గుదల సంభవించింది. గ్రామీణ మొత్తంలో 3.9 శాతానికి, పట్టణాల్లో 6.5 శాతానికి పడిపోయింది. గ్రామీణ ప్రాంతాల్లో ఈ మార్పు ఎక్కువగా కనిపిస్తోంది, ఇది వ్యవసాయం, చిన్న తరహా పరిశ్రమల పునరుద్ధరణకు సంబంధించినది.అధికారుల ప్రకారం, గ్రామీణ ప్రాంతాల్లో కొత్త ఉపాధి అవకాశాలు పెరగడం ప్రధాన కారణం. మహిళల పని భాగస్వామ్యం గణనీయంగా పెరిగి, కుటుంబ ఆదాయాలను బలోపేతం చేస్తోంది. ప్రభుత్వ పథకాలు, స్థానిక వ్యాపారాల పునర్జననం ఈ మార్పుకు దోహదపడ్డాయి. పట్టణాల్లో సేవా రంగం, రిటైల్ విస్తరణ కూడా ఉపయోగపడ్డాయి. 15 సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ వయస్సు కలిగిన వ్యక్తుల సాధారణ స్థితి నిరుద్యోగిత రేటు 2017?18లో 6%గా ఉండగా, 2023?24కు అది 3.2%కి పడిపోయింది. ఈ మార్పు ఉద్యోగావకాశాలు పెరుగుతున్నాయనే సంకేతం మాత్రమే కాదు, ఉద్యోగ భద్రతపై ప్రజల నమ్మకం కూడా పెరుగుతోందని సూచిస్తుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో స్వయం ఉపాధి మరియు చిన్న వ్యాపారాలు పెరగడం కూడా నిరుద్యోగం తగ్గడానికి కారణమయ్యాయి.గణాంకాలు మరియు కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ పద్ధతిని 2025 జనవరి నుండి మరింత ఆధునికీకరించింది. ప్రస్తుత వారపు స్థితి ఆధారంగా ప్రతి నెల నిరుద్యోగిత అంచనాలను విడుదల చేసే విధానాన్ని అమలు చేసింది. దీనివల్ల ఉద్యోగ మార్కెట్లో చోటుచేసుకునే చిన్నచిన్న మార్పులను కూడా ప్రభుత్వం సమయానికి గుర్తించి చర్యలు తీసుకునే అవకాశం లభిస్తోంది.కొత్త డేటా ప్రకారం.. 15 ఏళ్లకు పైబడిన జనాభాలో నిరుద్యోగం ఆగస్టు 2025లో 5.1%గా ఉండగా, సెప్టెంబర్ 2025లో కొద్దిగా పెరిగి 5.2%గా నమోదైంది. గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగిత రేటు వరుసగా 4.3% మరియు 4.6%గా ఉండగా, పట్టణ ప్రాంతాల్లో ఇది అధికంగా 6.7% మరియు 6.8%గా ఉంది. పట్టణ ప్రాంతాల్లో పోటీ అధికం కావడం, నైపుణ్యాల మధ్య వ్యత్యాసాలు, వలస కారణాలు వంటి అంశాలు ఈ వ్యత్యాసానికి కారణమవుతున్నాయి. అయితే, కార్మిక మంత్రిత్వ శాఖ చెబుతున్నట్లు, నెలవారీ సంఖ్యలు తరచూ మారుతాయి కనుక వీటిని దీర్ఘకాలిక ధోరణిగా భావించడం తగదు.దేశంలోని ప్రధాన పారిశ్రామిక రాష్ట్రాల్లో ఒకటైన మహారాష్ట్రలో కూడా గత ఆరు సంవత్సరాల్లో నిరుద్యోగం గణనీయంగా తగ్గింది. సాధారణ స్థితిలో నిరుద్యోగిత రేటు 2017?18లో 4.8% ఉండగా, 2023?24లో అది 3.3%కు తగ్గింది. గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగిత 3.2% నుండి 2.1%కు పడిపోగా, పట్టణ ప్రాంతాల్లో 7.4% నుండి 5.2%కు తగ్గింది. ఇది రాష్ట్రంలో పెట్టుబడులు పెరగడం, పరిశ్రమల విస్తరణ, మహిళల ఉపాధి పెంపు కార్యక్రమాలు వంటి అంశాలు కలిసి సాధించిన ఫలితం.ఉపాధి అవకాశాలను సృష్టించడం, నైపుణ్యాలను పెంచడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలలో ఒకటి. అందుకే కేంద్ర ప్రభుత్వం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మహిళలు సహా ప్రతి వర్గానికి ఉపాధి అందేలా అనేక పథకాలను అమలు చేస్తోంది. ముఖ్య పథకాలలో స్టార్ట్-అప్ ఇండియా, స్టాండ్-అప్ ఇండియా వంటి కార్యక్రమాలు ఉన్నాయి. ఈ పథకాల ద్వారా లక్షల మందికి స్వయం ఉపాధి, శిక్షణ మరియు ఆర్థిక సహాయం అందుతోంది.ఎ మరియు ఎలక్ట్రానిక్స్ రంగంలో ఉద్యోగాలు పెరగడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. ఎలక్ట్రానిక్స్ మరియు మంత్రిత్వ శాఖ కార్యక్రమం ద్వారా ంఎ, క్లౌడ్, డేటా అనలిటిక్స్ వంటి ఆధునిక సాంకేతికాల్లో నిపుణులను తయారు చేస్తోంది. మహిళలు ఎ రంగంలో ఎక్కువగా చేరేందుకు స్కాలర్షిప్లు, ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు, కెరీర్-ఓరియెంటెడ్ చొరవలు అమలు చేయబడుతున్నాయి.మహిళల ఉపాధిని మెరుగుపరచేందుకు మహిళా పారిశ్రామిక శిక్షణా సంస్థలు వృత్తి శిక్షణ ఇస్తుండగా, సరస్వతి స్కాలర్షిప్లను అందిస్తోంది. నైపుణ్య మంత్రిత్వ శాఖ ప్రారంభించిన కార్యక్రమం మహిళలకు టెక్నాలజీ రంగంలో ఉద్యోగాలు పొందేందుకు పెద్ద అవకాశాన్ని ఇస్తోంది. అదనంగా, మిషన్ శక్తి కింద అంగన్వాడీ-కమ్-క్రీచ్ కేంద్రాలను విస్తరించి తల్లి పనిచేసే మహిళలకు పిల్లల సంరక్షణ సదుపాయం కల్పిస్తున్నారు. 16?18 ఏళ్ల బాలికలకు నవ్య పథకం ద్వారా నైపుణ్య శిక్షణ అందిస్తున్నారు.ప్రధాన మంత్రి వీక్షిత్ భారత్ రోజ్గార్ యోజన ద్వారా రెండు సంవత్సరాల్లో 3.5 కోట్ల ఉద్యోగాలను సృష్టించడం లక్ష్యంగా ఇఓఎ పథకాన్ని అమలు చేశారు. దీని కోసం రూ. 99,446 కోట్ల భారీ ఆర్థిక వ్యవయం. ఉద్యోగార్థులకు ఉద్యోగ సమాచారం, కౌన్సెలింగ్, నైపుణ్య కోర్సుల వివరాలను అందించేందుకు పోర్టల్ ఒకే-చోటు వేదికగా పనిచేస్తోంది.25 ప్రత్యేక ఔఆూ కేంద్రాల ద్వారా ఉద్యోగార్థులకు ప్రీ-రిక్రూట్మెంట్ శిక్షణ, కౌన్సెలింగ్, కంప్యూటర్ నైపుణ్యాలు అందిస్తున్నారు. అదనంగా దక్ష పథకం ద్వారా ఎస్సీ, ఓబీసీలు, లు మరియు వ్యర్థాలను తీసేవారికి మార్కెట్కు అవసరమైన నైపుణ్యాల శిక్షణ అందిస్తున్నారు. సామాజిక భద్రతా కోడ్ 2020లో మహిళా ఉద్యోగుల కోసం 26 వారాల చెల్లింపు ప్రసూతి సెలవు, 50 మందికి పైగా ఉద్యోగులు ఉన్న సంస్థల్లో క్రెచ్ సౌకర్యం వంటి ముఖ్య నిబంధనలు ఉన్నాయి. అలాగే ాూఊ కోడ్ ప్రకారం మహిళలు ఏ పనులకైనా నియమించబడొచ్చు. అయితే రాత్రిపూట పనిచేయాల్సి వచ్చినప్పుడు భద్రతా చర్యలు, ప్రయాణ సదుపాయాలు, వారి సమ్మతి తప్పనిసరి. కేంద్ర బడ్జెట్ 2024?25లో పరిశ్రమల దగ్గర మహిళా హాస్టళ్లను ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. పలు రంగాల్లో పనిచేసే మహిళలకు క్రెచ్లు ఏర్పాటు చేయడం ద్వారా వారి పని-జీవితం సంతులనం సులభం అవుతుంది.

# పనికావాలంటే పైసలు ఇవ్వాల్సిందే

## అనంతలో ఎంపీకి ఎమ్మెల్యే బేరం

అనంతపురం, డిసెంబర్ 17, భారత శక్తి ప్రతినిధి

ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చి 18 నెలలు అవుతోంది. ప్రభుత్వ పెద్దలు రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. పెద్ద ఎత్తున పెట్టుబడులు తీసుకొస్తున్నారు. అభివృద్ధి పనులు జరిపిస్తున్నారు. కానీ అదే సమయంలో కొందరు ఎమ్మెల్యేల తీరు మాత్రం విమర్శలకు గురిచేస్తోంది. పనితీరు మార్చుకోవాలని ఎప్పటికప్పుడు నాయకత్వం హెచ్చరికలు జారీచేస్తోంది. కానీ కొందరి వైఖరిలో మార్పు రావడం లేదు. కొత్తగా ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారి నుంచి ఈ తరహా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తాజాగా అనంతపురం జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే తీరుపై సోషల్ మీడియాలో విపరీతమైన ప్రచారం నడుస్తోంది. కాంట్రాక్టు పనుల్లో కమిషన్ నిమిత్తం.. సొంత పార్టీ ఎంపీ పైనే ఎమ్మెల్యే ఒకరు గట్టిగానే డిమాండ్ చేసినట్లు ప్రచారం సాగుతోంది. పెద్ద ఎత్తున బెదిరింపులకు దిగుతున్నట్లు తెలుస్తోంది. అయితే కేవలం సోషల్ మీడియాలోనే కాదు ఏకంగా ప్రభుత్వ అనుకూల మీడియాలో కథనం రావడం విశేషం.ఉమ్మడి అనంతపురం జిల్లాలో టిడిపి ఎంపీ బంధువు ఏడు కోట్ల రూపాయల విలువైన పైపులైన్ పనుల టెండర్ను దక్కించుకున్నారు. అయితే ఆ పనులను తమకు అప్పగించాలని స్థానిక ఎమ్మెల్యే సదరు కాంట్రాక్టర్కు ఫోన్ చేసి బెదిరించినట్లు తెలుస్తోంది. లేదంటే 10 శాతం కమిషన్లు ఇచ్చుకోవాల్సిందేనని షరతు పెట్టినట్లు సమాచారం. అయితే ఈ విషయంలో ఎంపీ తోనే మాట్లాడుకోవాలని సదరు కాంట్రాక్టర్ సూచించినట్లు తెలుస్తోంది. దీంతో సదరు ఎమ్మెల్యే తమ్ముడు రంగంలోకి దిగారు. నేరుగా ఎంపీ తో మాట్లాడారు. తమ నియోజకవర్గంలో ఎవరు పనులు చేసినా 10 శాతం కమిషన్ ఇవ్వాల్సిందేనని తేల్చి చెప్పినట్లు ప్రచారం జరుగుతోంది. తెలుగుదేశం పార్టీ ఎంపీ అయినందునే ధైర్యంతో ఈ పనులు చేయిస్తున్నానని చెప్పినా ఎమ్మెల్యే తమ్ముడు వినలేదు. ఎంపీ అయినా విడిచిపెట్టొద్దని తన సోదరుడు చెప్పాడని తిరిగి గట్టిగానే మాట్లాడాడట.అయితే ఈ పరిణామంతో ఎంపీ తీవ్ర కలత చెందారు. అధికార పార్టీగా ఉన్న తన విషయంలోనే అలా వ్యవహరిస్తారా? అంటూ నేరుగా హై కమాండ్ కు ఫిర్యాదు చేశారు. దీంతో టీడీపీ పెద్దలు సదరు ఎమ్మెల్యే కు ఫోన్ చేసి తలంటారు. అయినా సరే సదరు ఎమ్మెల్యే విడిచిపెట్టలేదట ఎంపీని. మరోసారి తమ్ముడు తో నేరుగా ఫోన్లో బెదిరింపులకు దిగారట. అయితే అధికార ఎంపీ, ఎమ్మెల్యేల పేరు లేకుండానే ఈ కథనం వచ్చింది. దీనిపై మంత్రి లోకేష్ కార్యాలయం సీరియస్ గా ఆరా తీస్తున్నట్లు ప్రచారం నడుస్తోంది. ఒకవైపు అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వ పెద్దలు కష్టపడుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో ఇలా ఎమ్మెల్యేలు వీధిన పడుతున్నారు. దీనిపై హై కమాండ్ దృష్టి పెట్టకపోతే ముమ్ముందు ఈ పరిణామాలు మరింత కృంగదీసే అవకాశం ఉంది.

# కోనసీమలో మొసళ్ల భయం

అమలాపురం, డిసెంబర్ 17, భారత శక్తి ప్రతినిధి




కోనసీమ లంక భూముల్లో మొసలి భయం తీవ్ర కలవరానికి గురిచేస్తోంది. గోదావరి వరదల్లో కొట్టుకువచ్చిన మొసలి లంక భూముల్లోని నీటి మడుగుల్లో ఉండడంతో ఇప్పుడు లంక రైతులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. గతంలో కోనసీమ ప్రాంతంలో పంటకాలువల్లోకి కనిపించిన మొసలి సుమారు నెల రోజుల పాటు తీవ్ర భయాన్ని అయితే కలిగించింది. ఎట్టకేలకు బంధించిన అధికారులు రంపచోడవరం అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. ఇప్పుడు అయినవిల్లి లంక ప్రాంతంలో మొసలి తీవ్ర భయాందోళనలు సృష్టిస్తోంది..ఈ ఏడాది ఆరుసార్లకుపైగా గోదావరికి వరదలు పోటెత్తాయి.. సాధారణంగా వరదలకు పాములు, కొండచిలువలు, జింకలు ఇతరాత్ర జంతువులు వరద ప్రవాహానికి కొట్టుకువచ్చిన సందర్భాలు చాలానే ఉంటుంటాయి. అయితే ఇప్పుడు గోదావరి వరదలకు ఎక్కడి నుంచి కొట్టుకు వచ్చిందో తెలియదు కానీ ఓ మొసలి లంక నీటి మడుగుల్లో తిష్టవేసి భయపెడుతోంది. మూడు రోజుల క్రితం మొసలి జాడ లభ్యమైన నాటి నుంచి లంక భూముల్లో వ్యవసాయ పనులు చేసుకునే రైతులు తీవ్ర భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం కె.గంగవరం మండలాల సరిహద్దు ప్రాంతాల్లోని లంక భూముల్లో ఉన్న నీటి మడుగుల్లో మొసలి ఉందన్న వార్త స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఈ ప్రాంతంలో పశువులను మేపుకునేందుకు తరచూ రైతులు వస్తుంటారు. మరోపక్క ఉద్యాన పంటలు అయిన మొక్కజొన్న, కాయగూరల పంటలు పండిస్తుంటారు. ఈ నీటి మడుగుల్లో ఉన్న నీటిలో మొసలి సంచరిస్తుందని నిర్ధారణ అవ్వడమంతో అటవీశాఖ అధికారులు అప్రమత్తం అయ్యారు. అటు పోలీస్, రెవెన్యూ శాఖ అధికారులు కూడా ఈ ప్రాంతంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఫారెస్ట్ డీఎఫ్వో ప్రసాదరావు ఆధ్వర్యంలో మొసలిని బందించేందుకు సుమారు 10 ఎకరాలకుపైబడి ఉన్న నీటి మడుగుల్లో ట్రాప్ బోన్ ఏర్పాటు చేశారు. అయితే సోమవారం కూడా బోన్లో మొసలి చిక్కలేదు. మరోపక్క పి.గన్నవరం సీఐ ఆర్ భీమరాజు స్థానిక ఎస్సైతో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించి ప్రజలను అప్రమత్తం చేశారు. అయితే మొసలిని చూసేందుకు సమీప ప్రాంతాల నుంచి లంకలోకి చాలా మంది తరలివస్తుండడంతో వారిని నియంత్రించి అప్రమత్తంగా ఉండాలని పోలీసులు, అటవీశాఖ అధికారులు హెచ్చరించారు. లంక భూముల్లో ఇటుక బట్టీల కోసం తవ్విన గుంతలే ఇప్పుడు నీటి మడుగులుగా మారాయి. ఇవి చాలా లోతులో నీటితో నిండి ఉండడం కనిపిస్తోంది. అయితే వారం రోజుల క్రితం అయినవిల్లి లంక ప్రాంతంలో ఓ మొసలి స్థానిక మత్స్యకారులకు కనిపించింది. తీవ్ర భయాందోళనలకు గురైన మత్స్యకారులు ఈ సమాచారాన్ని స్థానిక రైతులకు చేరవేశారు. రైతులు, కొంత మంది యువకులు కలిసి మొసలిని నిర్ధారించేందుకు గస్తీ కాశారు. నీటి మడుగు ఉన్న ప్రాంతంలో గట్టుమీద కొంత మంది యువకులకు కనిపించడంతో భయాందోళనలతో అటవీశాఖ అధికారులకు ఈసమాచారాన్ని తెలిపారు. అటవీశాఖ అధికారులు రంగ ప్రవేశం చేసి చెరువులో మొసలి ఉందన్న విషయాన్ని దృవీకరించారు. నీటి మడుగుల్లో ఉన్నమొసలి ఒకటా లేక రెండా అన్న మీమాంస స్థానిక ప్రజలనుంచి వ్యక్తం అవుతోంది.. చాలా మంది ఈ నీటి మడుగుల్లో మరో మొసలి ఉందని స్థానిక యువకులు చెబుతున్నారు. అయితే దీనిని అటవీశాఖ అధికారులు మాత్రం ధృవీకరించలేదు..

# ఏపీలో టీడీపీ కొత్త అధ్యక్షులు వీరే...

విజయవాడ, డిసెంబర్ 17, భారత శక్తి ప్రతినిధి

పార్టీ సంస్థాగత నిర్మాణంపై టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు దృష్టి సారించారు. అందులో భాగంగా చాలా రోజుల నుంచి ఆలస్యమవుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుల ఎంపికపై ఫోకస్ పెట్టారు. ఇందులో భాగంగా ఇప్పటికే కొంతమందిని టీడీపీ జిల్లా అధ్యక్షులుగా ఎంపిక చేసినట్లు సమాచారం. ఈ అంశం మీద వారికి సమాచారం అందించినట్లు తెలిసింది. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన విడుదల చేయనున్నట్లు సమాచారం.ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అప్పుడే ఎన్నికల మూడ్లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. 2024





ఎన్నికల్లో గ్రాండ్ విక్టరీ అనంతరం.. సీఎంగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టి 18 నెలలు పూర్తౌంది. ఒకటిన్నర సంవత్సరం పదవీకాలం పూర్తికాగా.. మరో మూడు సంవత్సరాలల్లో ఎన్నికలు జరగనున్నాయి. అయితే ఎన్నికలకు ఇంకా మూడేళ్లు ఉన్నప్పటికీ.. 2024 సీన్ మరోసారి రిపీట్ చేయాలని చంద్రబాబు భావిస్తున్నట్లు సమాచారం. అందుకు అనుగుణంగానేటీడీపీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. అలాగే పార్టీని ఇప్పటి నుంచే లైన్లో పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే గ్రామ, వార్డు, నగరం, మండల, పట్టణ కార్యవర్గాల ఎంపిక పూర్తికాగా.. టీడీపీ జిల్లా అధ్యక్షుల నియామకం మాత్రం ఆలస్యమవుతూ వస్తోంది.టీడీపీ జిల్లా అధ్యక్షుల నియామకం కోసం త్రీమెన్ కమిటీలను ఏర్పాటు చేసిన చంద్రబాబు.. త్రీమెన్ కమిటీల క్షేత్రస్థాయి పర్యటనల అనంతరం కమిటీలు నివేదించిన రిపోర్టులను పరిశీలించినట్లు సమాచారం. అలాగే తన సొంత సర్వే రిపోర్టుల ఆధారంగా జిల్లా అధ్యక్షుల ఎంపికపై చంద్రబాబు ఓ క్లారిటీకి వచ్చినట్లు సమాచారం. మొత్తంగా టీడీపీ జిల్లా అధ్యక్షుల ఎంపిక దాదాపుగా పూర్తౌందని సమాచారం. ఒకట్రెండు రోజుల్లో అధికారికంగా ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే తాజాగా టీడీపీ జిల్లా అధ్యక్షులుగా కొంతమంది పేర్లు దాదాపుగా ఖరారైనట్లు ఓ జాబితా బయటకు వచ్చింది. ఈ మేరకు టీడీపీ అధిష్టానం నుంచి వారికి సమాచారం అందినట్లు తెలిసింది. త్వరలో పార్టీ దీనిపై అధికారిక ప్రకటన విడుదల చేయనున్నట్లు సమాచారం.బాపట్ల జిల్లాకు సలగల రాజశేఖర్, పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా కొమ్మాలపాటి శ్రీధర్, నెల్లూరు జిల్లా అధ్యక్షుడిగా రేచర్ల వెంకటేశ్వరరావు, నంద్యాలకు సుబ్బారెడ్డి, అనంతపురం కాలవ శ్రీనివాసులు, హిందూపురం ఎంఎస్ రాజు, తిరుపతి జిల్లా పనబాక లక్ష్మి, చిత్తూరు జిల్లా షణ్ముగం, ప్రకాశం ఉగ్రనరసింహారెడ్డి, విజయనగరం కిమిడి నాగార్జున, రాజంపేటకు సుగవాసి ప్రసాద్ పేర్లను దాదాపుగా ఖరారు చేసినట్లు సమాచారం.కాకినాడ జిల్లా అధ్యక్షుడిగా జ్యోతుల నవీన్, ఏలూరు జిల్లా బడేటి చందు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలిగా గద్దె అనురాధకు అవకాశం ఇచ్చినట్లు తెలిసింది. పార్లమెంటరీ నియోజకవర్గాల వారీగా జిల్లా అధ్యక్షులను నియమిస్తోంది టీడీపీ అధిష్టానం. వీరి ఎంపికపై త్వరలోనే అధికారికంగా ప్రకటించే అవకాశాలు ఉన్నాయని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి.

==================

# లగ్జరీ హోటల్ గా రుషికొండప్యాలెస్

విశాఖపట్టణం, డిసెంబర్ 17,భారత శక్తి ప్రతినిధి



విశాఖపట్నం రుషికొండపై నిర్మించిన వివాదాస్పద భవనాలను లగ్జరీ హోటల్గా మార్చేందుకు ప్రముఖ హాస్పిటాలిటీ సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి. టాటా గ్రూప్కు చెందిన ఇండియన్ హోటల్స్ కంపెనీ లిమిటెడ్ ఎఊఅఒ-తాజ్ గ్రూప్) , లీలా ప్యాలెస్ హోటల్స్ సహా లెమన్ ట్రీ, మహీంద్రా, మారియట్ వంటి సంస్థలు ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేయడానికి ముందుకు వచ్చాయి. అయితే హోటల్ గా ఉపయోగించడానికి సాధ్యమా కాదా అన్నదానిపై కొన్ని అనుమానాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు చర్చలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రుల బృందం వివిధ ఆప్షన్లను ఖరారు చేసిన తర్వాత తమ సిఫారసులను ఆంధ్రప్రదేశ్ కేబినెట్ ముందు ఉంచనుంది. ఈ భవనాలను పర్యాటక రంగంలో ఆదాయ వనరుగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అధికార వర్గాలు తెలిపాయి. మంగళవారం సమావేశం అయిన మంత్రుల బృందం .. మరోసారి సమావేశం తర్వాత సిఫారసులు సమర్పించే అవకాశం ఉంది.రుషికొండ భవనాలను లగ్జరీ హోటల్గా అభివృద్ధి చేయాలని పలు ప్రముఖ హోటల్ చైన్లు ప్రతిపాదనలు సమర్పించాయి. టాటా గ్రూప్ , లీలా ప్యాలెస్, లెమన్ ట్రీ, మహీంద్రా హాలిడేస్, మారియట్ వంటి సంస్థలు ఈ ప్రాజెక్టును చేపట్టడానికి ఆసక్తి వ్యక్తం చేశాయి. అయితే, ప్రాజెక్టు వాణిజ్య సాధ్యత, పర్యావరణ అనుమతులు, నిర్మాణ ఖర్చులు, మార్కెట్ డిమాండ్ వంటి అంశాలపై కొన్ని సంస్థలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ఈ అంశాలపై ప్రభుత్వంతో చర్చలు జరుగుతున్నాయి. కొన్ని సంస్థలు పూర్తి స్థాయి లగ్జరీ రిసార్ట్గా మార్చాలని, మరికొన్ని మైస్ అంటే మీటింగ్స్, ఇన్సెంటివ్స్, కాన్ఫరెన్సెస్, ఎగ్జిబిషన్స్ హబ్గా అభివృద్ధి చేయాలని సూచిస్తున్నాయి వైఎస్ఆర్సీపీ ప్రభుత్వ హయాంలో రుషికొండపై సుమారు రూ.450 కోట్లతో ఈ భవనాలు నిర్మించారు. పర్యాటక అభివృద్ధి పేరుతో నిర్మాణం జరిగినా, పర్యావరణ ఉల్లంఘనలు, ధన దుర్వినియోగం ఆరోపణలతో వివాదాస్పదమయ్యాయి. 2024 ఎన్నికల తర్వాత అధికారంలోకి వచ్చిన టీడీపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఈ భవనాల భవిష్యత్తుపై నిర్ణయం తీసుకోవడానికి ఆగస్టు 2025లో మంత్రుల బృందం ను ఏర్పాటు చేసింది. అక్టోబర్ 2025లో ప్రజల నుంచి, సంస్థల నుంచి సూచనలు కోరగా పలు ప్రతిపాదనలు వచ్చాయి. అందులో అంతర్జాతీయ కాన్సులేట్లు, పర్యాటక హబ్, వెడ్డింగ్ డెస్టినేషన్ వంటి ఐడియాలు ఇచ్చారు. ప్రస్తుతం భవనాలు ఏపీ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధీనంలో ఉన్నాయి. వీటి కోసం భారీగా ఖర్చు పెట్టినందున దానికి తగ్గ ఆదాయం వచ్చేలా చూడాలని .. టూరిజంకు ఆర్థిక లాభం ఉండాలని మంత్రుల బృందం ప్రయత్నిస్తోంది.

# పవన్ కళ్యాణ్ కొత్త స్ట్రాటజీ..

## తమిళనాడు, కేరళలో ట్రైనింగ్..



విజయవాడ, డిసెంబర్ 17, భారత శక్తి ప్రతినిధి

ఉప్పాడ మత్స్యకారుల జీవనోపాధి పెంచేందుకు ఏపీ డిప్యూటీ సీఎం ప్రత్యేక కార్యాచరణ ప్రకటించిన సంగతి తెలిసిందే. వంద రోజుల ప్రణాళికను ప్రకటించిన పవన్ కళ్యాణ్.. అందుకు అనుగుణంగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అందులో భాగంగా ఉప్పాడ మత్స్యకారులకు కేరళ, తమిళనాడుల్లో శిక్షణ ఇప్పించారు. తమిళనాడు వెళ్లిన బృందానికి కేజ్ కల్చర్, రిఫ్ కల్చర్, ఆధునిక మార్కెటింగ్ వ్యవస్థలపై శిక్షణ అందించారు. అలాగే కేరళలో మోడల్ ఫిషింగ్ హార్బర్, అత్యాధునిక వలల తయారీపై ట్రైనింగ్ ఇచ్చారు. ఉప్పాడ తీర ప్రాంత సమస్యపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ఉప్పాడ తీర ప్రాంతంలోని మత్స్యకారుల జీవనోపాధిని మెరుగుపర్చేలా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఓ సరికొత్త ఆలోచన చేశారు. ఇందుకోసం 100 రోజులు ప్రణాళిక ప్రకటించారు. ఈ ప్రణాళిక ప్రకారం ఉప్పాడ తీర ప్రాంత మత్స్యకారులకు అధ్యయనం, అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా.. ఉప్పాడ మత్స్యకారులకు తమిళనాడు. కేరళ రాష్ట్రాలలో ట్రైనింగ్ అందించారు. తమిళనాడు, కేరళ రాష్ట్రాలు అనుసరిస్తున్న టెక్నాలజీ సాయంతో.. ఉప్పాడ, కాకినాడ తీర ప్రాంత మత్స్యకారులకు వసతులు కల్పించేందుకు ఎలాంటి అవకాశాలు ఉన్నాయనే దానిపై మత్స్యశాఖ అధికారులు అధ్యయనం జరుపుతున్నారు. అందులో భాగంగా మత్స్య సంపదతో ఆర్థికాభివృద్ధి సాధించేందుకు అవసరమైన అధునాతన పద్ధతులపై అధ్యయనం చేసేందుకు ఉప్పాడ మత్స్యకారులను తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు పంపించారు. డిసెంబర్ నెల 8వ తేదీన 60 మంది మత్స్యకారులు.. రెండు బృందాలుగా అక్కడకు వెళ్లారు. స్థిరమైన ఆర్థికాభివృద్ధి సాధించడం ఎలా అనే అంశం మీద రెండు రాష్ట్రాల్లో మూడు రోజుల పాటు ట్రైనింగ్ తీసుకున్నారు. అధునాతన కేజ్ కల్చర్, రిఫ్ కల్చర్, మార్కెటింగ్ వ్యవస్థల ఏర్పాటుపై శిక్షణ తీసుకున్నారు. అలాగే హార్బర్ల సందర్శన, హ్యాచరీల్లో చేపల గుడ్లు పొదిగించడం, వలల తయారీ తదితర అంశాల్లో వీరికి ట్రైనింగ్ ఇప్పించారు. తమిళనాడుకు వెళ్లిన మత్స్యకారులకు.. చెన్నైలోని మండపం వద్ద ఉన్న సి.ఎస్.ఎం.సి.ఆర్.ఐలో కృత్రిమ, సహజ పద్ధతుల్లో సాగు చేస్తున్న కేజ్ కల్చర్, రిఫ్ కల్చర్ గురించి శిక్షణ తరగతులు నిర్వహించారు. సముద్ర వనరుల దీర్ఘకాలిక సంరక్షణకు అనుసరించాల్సిన శాస్త్రీయ విధానాలను తెలియజేశారు. చేపల అమ్మకం, కోల్డ్ స్టోరేజ్ వ్యవస్థ, మత్స్య సంపద గ్రేడింగ్, వేలం నిర్వహణ, వ్యర్థాల నిర్వహణ, సప్లై చైన్ వంటి అత్యాధునిక సదుపాయాలపై అవగాహన కల్పించారు. ఇక కేరళ వెళ్లిన బృందానికి చేపలవేటలో సాంకేతిక మేళవింపు, స్థిరమైన ఆదాయార్జన, లాభదాయక విధానాలు అనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ పర్యటనల ద్వారా మత్స్యకారుల జీవన ప్రమాణాలు మెరుగుపర్చేందుకు అమలు చేస్తున్న అధునాతన

# చంద్రబాబు మారినట్టేనా ఏమైంది..

## ఆ నాటి దూకుడు

విజయవాడ, డిసెంబర్ 17, భారత శక్తి ప్రతినిధి

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 1995 నాటి నుంచి 2025 వరకూ ఏ మాత్రం రాజకీయంగా మారలేదు. ఆయన రాజకీయ నిర్ణయాలను వేగంగా తీసుకోలేకపోతున్నారని సొంత పార్టీ నేతలే అంటుంటారు. వేగంగా నిర్ణయాలు తీసుకోకపోవడం ఒకరకంగా చంద్రబాబు నాలుగు సార్లు ముఖ్యమంత్రి అయ్యారు. అలాగే అనేక సార్లు టీడీపీ ఓటమి పాలయింది. అయినా సరే చంద్రబాబు




నాయుడు వ్యవహారశైలిలో మార్పు రాలేదు. గతంలో తక్కువ నియోజకవర్గాలు ఉన్నప్పుడు అదే తీరు. ఇప్పుడు 98 శాతం స్ట్రయిక్ రేట్ ఇచ్చినప్పటికీ అదే రకంగా వ్యవహరిస్తుండటం పార్టీలో చర్చనీయాంశమైంది. చంద్రబాబు నాయుడు స్వతహాగా పార్టీ పరంగా క్విక్ డెసిషన్ తీసుకోలేరు. ఇందుకు ఉదాహరణ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు వర్సెస్ ఎంపీ కేశినేని చిన్ని వర్గం మధ్య చిచ్చు చల్లారలేదు. ఎన్ని సార్లు వార్నింగ్ లు ఇచ్చినా తిరువూరు పంచాయతీకి తెరపడలేదు. తాజాగా వరుస పోస్టులతో ఎంపీ వర్గానికి ఎమ్మెల్యే కొలికపూడి నిద్రలేకుండా చేస్తున్నారు. ఇటీవల కొలికపూడి ఓ మహిళతో ఉన్న ఫోటోను టిడిపి నేతలు విడుదల చేయడం టిడిపి సోషల్ మీడియా గ్రూపుల్లో చక్కర్లు కొట్టింది. కౌంటర్ గా ఇద్దరు నేతల ఫోటోలను ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పోస్టు చేశారరు. తిరువూరుకు చెందిన బుడ్డయ్య , చెరుకూరి రాజేశ్వరరావులు మహిళలతో ఉన్న ఫోటోలను విడుదల చేసిన కొలికపూడి రాజేశ్వరరావు ఇల్లు కూడా చూస్తారా...? అంటూ పోస్టులు పెట్టారు. దీంతో కొలికపూడి పై ఎంపీ చిన్ని వర్గం రగిలిపోతుంది. ఏఐ ఫోటోలు విడుదల చేశారంటూ ఎంపీ కేశినేని చిన్ని వర్గం మండిపడుతుంది. మరొకవైపు నెల్లూరుతో పాటు మిగిలిన ప్రాంతాల్లో వైసీపీ నేతలను పార్టీలో చేర్చుకోవడంపై కూడా అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఏడాది కాలం కూడా లేని పదవుల కోసం ఇతర పార్టీల నుంచి నేతలను తీసుకు వచ్చి అప్పటి వరకూ పనిచేసిన వారికి ఇబ్బందులు పెడతారా? అన్న ప్రశ్న క్యాడర్ నుంచి వస్తుంది. గతంలో వైఎస్ జగన్ కూడా ఇలాగే చేసి సొంత పార్టీ క్యాడర్ నుంచి అసంతృప్తిని ఎదుర్కొన్నారు. ఆ విషయాన్ని గుర్తు చేస్తూ కొందరు టీడీపీ అభిమానులు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు మరో మూడు నెలలు మాత్రమే గడువు ఉంది. ఈ సమయంలో వైసీపీ నుంచి నేతలను అరువు తెచ్చుకుని తమపై రుద్దుతారా? అని నెట్టింట తెలుగు తమ్ముళ్లు ప్రశ్నిస్తున్నారు. మొత్తం మీద నాటికి.. నేటికి చంద్రబాబు రాజకీయ నిర్ణయాల్లో మాత్రం మార్పు లేదన్నది పార్టీ నేతల నుంచి వినిపిస్తున్న మాట.

## మీ చేతిలోనే గ్రామాల సమాచారం, నిధులు.. వివరాలు

నెల్లూరు, డిసెంబర్ 17 భారత శక్తి ప్రతినిధి

గ్రామాలు, పల్లెల అభివృద్ధికి ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు, చర్యలు చేపడుతుంటాయి. వివిధ పథకాల కింద నిధులు మంజూరు చేస్తుంటాయి. రోడ్లు, కరెంట్, తాగునీరు వంటి మౌలిక సదుపాయాల దగ్గర నుంచి స్కూళ్లు, ఆస్పత్రులు వంటి నిర్మాణాల వరకూ గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు అనేక చర్యలు తీసుకుంటూ ఉంటాయి. అయితే మీ ఊరికోసం ప్రభుత్వం ఎన్ని నిధులు కేటాయించింది.. ఏయే పనులు చేపట్టారనే సంగతి మీకు తెలుసా.. అలాగే కేటాయించిన నిధులలో ఏయే పనుల కోసం ఎంతెంత ఖర్చు చేశారనే దానిపై మీకు అవగాహన ఉందా.. ఇలాంటివాటి వివరాలు అందించేందుకు ప్రభుత్వం ఓ యాప్ అందుబాటులోకి తెచ్చింది. ఈ మొబైల్ యాప్ సాయంతో మీ ఊరికి ప్రభుత్వం ఎన్ని నిధులు కేటాయించింది.. అందులో ఎంత ఖర్చు చేశారు.. ఏయే పనులు చేపట్టారనే సంగతి తెలుస్తుంది. ప్రజలకు ఈ వివరాలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం 2020లో గ్రామ స్వరాజ్య పేరుతో ప్రత్యేకంగా మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్ ప్లే స్టోర్‌లో అందుబాటులో ఉంది. మీ ఊరికి ప్రభుత్వం ఎన్ని నిధులు కేటాయించిందనే విషయాలు తెలుసుకునేందుకు ఈ యాప్ ప్లేస్టోర్ నుంచి డౌన్ లోడ్ చేసుకోవాలి. ఆ తర్వాత యాప్‌లోకి వెళ్లి రాష్ట్రం, జిల్లా, మండలం, గ్రామ పంచాయతీ వివరాలను ఎంచుకోవాలిఆ తర్వాత సబ్మిట్ చేస్తే.. ఈఆర్ డిటైల్స్, అప్రూవ్డ్ యాక్టివిటీస్, ఫైనాన్షియల్ ప్రోగ్రెస్ అనే మూడు ఆప్షన్లు ఉంటాయి. అందులో అప్రూవ్డ్ యాక్టివిటీస్ ఆప్షన్ మీద క్లిక్ చేసిన వెంటనే.. ఏయే పనులకు ఎంత నిధులు ఖర్చు చేశారో తెలుసుకోవచ్చు. అలాగే ఫైనాన్షియల్ ప్రోగ్రెస్ మీద క్లిక్ చేస్తే.. ఏ ఆర్థిక సంవత్సరంలో ఎన్ని నిధులు వచ్చాయనేదీ తెలుస్తుంది. మరోవైపు పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జనాభా ప్రాతిపదికన నిధులు విడుదల చేస్తుంటాయి. ఏటా విడుదల చేసే ఈ నిధుల సాయంతో ఆయా పంచాయతీల పరిధిలో పారిశుద్ధ్యం, వీధిలైట్లు, తాగునీరు, రోడ్లు వంటి మౌలిక వసతులకు ఖర్చు చేస్తుంటారు. అలాగే ఆర్థిక సంఘం నిధులు, వెనుకబడిన జిల్లాలకు నిధుల కింద కూడా పంచాయతీలకు నిధులు కేటాయిస్తుంటారు. పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల సహకారం, ఆమోదంతో ఈ నిధులను ప్రజా ప్రయోజనాల కోసం ఖర్చు చేయాల్సి ఉంటుంది.

# సమరానికి సై..



ఏలూరు, డిసెంబర్ 17, భారత శక్తి ప్రతినిధి

గోదావరి జిల్లాల్లో సంక్రాతి పండుగ సందడి అప్పుడే మొదలైంది. పందెం రాయుళ్లు కోడి పందాలకు సిద్ధం అవుతున్నారు. ఈ సారి కోట్లలో పందాలు జరగడం ఖాయం అనే వాదన బలంగా వినిపిస్తుంది. ఎక్కడ ఎలా బరులు ఏర్పాటు చెయ్యాలి. ఎవరు ఎవరు సిండికేట్ గా ఉండాలి, వీఐపీలు, పందెం కాసే వారికి ఎలాంటి మర్యాదలు చెయ్యాలి, పందాలు నిర్వహణ ఎలా జరపాలనే అంశాలపై పక్కా ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నారు. పందెం రాయుళ్లను ఆకట్టుకునేందుకు వినూత్న ప్రయోగాలు, బహుమతులు ఏర్పాటు చేస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో జరిగే కోడిపందాలుకు తెలంగాణ, తమిళనాడు, కర్నాటక, రాయలసీమ, తో పాటు కొంతమంది ఇతర దేశాల నుండి అధిక సంఖ్యలో వస్తుంటారు. ఈ సంవత్సరం సంక్రాంతి పండుగ ఫుల్ జోష్ మీద ఉంటాదని అంచనా వేస్తున్నారు. పందాలు కోసం కోడి పుంజులను రెడీ చేస్తున్నారు. సంవత్సరం నుండి మకాంలలో పందెం పుంజులను బలిష్టంగా తయారుచేస్తున్నారు. బాదం, జీడిపప్పు, కోడిగుడ్డు, వేట మాంసం, ఆకుకూరలు వేసి బలంగా మేపుతున్నారు. ఉదయం, సాయంత్రం వ్యాయామం చేయిస్తున్నారు. పందెం సమయంలో కోడి పుంజులకు గస రాకుండా ఉండేందుకు నీటి తొట్టెలో ఈత కొట్టిస్తున్నారు. కోళ్ళను పెంచలేని పందెం రాయుళు మంచి జాతి పుంజులను మకాం దగ్గరకు వెళ్ళి పోటీ పడి మరీ కొంటున్నారు. గట్టిగా పోరాడే పుంజుల రేట్లు మామూలుగా లేవు. జాతి పుంజులు ఒక్కొక్కటి యాభై వేల నుండి రెండు లక్షలు వరకూ అమ్ముడుపోతున్నాయి. గత సంవత్సరం వైరెస్ , వ్యాధులతో కోళ్ళు మృత్యువాత పడ్డాయి. అందువల్ల ఈ సంవత్సరం వీటి డిమాండ్ బాగా పెరిగింది. భీమవరం, ఉండి, కాళ్ళ, వీరవాసరం, పాలకొల్లు, నర్సాపురం, తణుకు, తాడేపల్లిగూడెం, ఆచంట ప్రాంతాల్లో కోడి పందాలు జోరుగా సాగుతాయి. ఇప్పటికే ఈ ప్రాంతాల్లోని హోటల్ అన్ని పండగ పేరు చెప్పి అడ్వాన్స్ బుకింగ్ అయిపోయాయి. ఈ సంక్రాంతికి కోట్లలో పందాలు జరగడం ఖాయం. రూ .10, 25, 50 లక్షలు, కోటి రూపాయలు పందాలు వేసేందుకు సిద్ధం అవుతున్నారనే ప్రచారం పందెం రాయుళ్లు నుంచి వినిపిస్తుంది. ఏ సమయంలో ఏ పందెం వెయ్యాలి. ఉదయం, మధ్యాహ్నం, రాత్రి సమయంలో ఎలాంటి పుంజులను వదలాలి అనేది కొత్తగా ప్లాన్ చేస్తున్నారు. మామూలుగా కోళ్ళు రంగులు, జాతిని బట్టి పందాలు వేస్తారు. ఇప్పటికే కొంతమంది పందెం రాయుళ్లు కుక్కుటశాస్త్రాన్ని పాటించడం మొదలుపెట్టారు. గోదావరి జిల్లాల్లో పందెం రాయుళు జోష్ తో ఈ సారి సంక్రాంతి మరింత సందడిగా మారనుంది.

# అమరావతి వర్సెస్ ఫ్యూచర్ సిటీ

హైదరాబాద్, విజయవాడ, డిసెంబర్ 17

ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాలు చెరో క్రొత్త నగరాన్ని నిర్మించే పనిలో ఉన్నాయి. ఏపీ ముఖ్యమంత్రి రాష్ట్ర రాజధానిగా అమరావతిని నిర్మించే ప్రయత్నం గత ఆరేళ్లు గా చేస్తూనే ఉన్నారు. మరోవైపు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫ్యూచర్ సిటీ పేరుతో హైదరాబాదును అనుకునే మరో నగరాన్ని సృష్టించడం కోసం చాలా కష్టపడుతున్నారు. ఒకప్పుడు ఒకే పార్టీలో ఉన్న ఈ ఇద్దరు ముఖ్యమంత్రులు తమ తమ డ్రీం ప్రాజెక్టులను సాకరం చేసే పనిలో పడ్డారు. రాజకీయంగా తెలంగాణ సీయం



రేవంత్ రెడ్డిని ఆయన ప్రత్యర్థులు పదేపదే తెలంగాణ మూవ్‌మెంట్ సమయంలో ఆయన పాత్ర పై ప్రశ్నలు సంధిస్తూ ఉంటారు. వాటికి చెక్ పెట్టేందుకు తనదైన బ్రాండ్ ను ప్రమోట్ చేసేందుకు ఫ్యూచర్ సిటీ పేరుతో మరో కొత్త నగరాన్ని సృష్టించే పనిలో రేవంత్ పడ్డారు. హైదరాబాదును ఆడుకుహైదరాబాదును ఆనుకుని నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీ ప్రమోషన్స్ కోసం ఇటీవల ఆయన ఏర్పాటు చేసిన తెలంగాణ రైజింగ్ సమిట్ టాక్ అఫ్ ది స్టేట్ అయింది. ముందుగా ఫ్యూచర్ సిటీ కోసం 30 వేల ఎకరాల్లో దీన్ని నిర్మిస్తుండగా భవిష్యత్ లో దాదాపు లక్షా ఎనభై వేలకు పైగా ఎకరాల్లో విస్తరించే ఆలోచనలో ఉన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీ పేరుతో నిర్మిస్తున్న ఈ నగరం ఔటర్ రింగ్ రోడ్, శ్రీశైలం రోడ్డు, నాగర్జున సాగర్ రోడ్ ల మధ్య శంషాబాద్ ఎయిర్ పోర్ట్ కు ఒక 30 కిమీ దూరం లో రానుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రుల్లో చంద్రబాబు కు సైబర్ సిటీ, వైఎస్ ఆర్ కు ఔటర్ రింగ్ రోడ్ నిర్మాతలుగా పేరు ఉంది. ఇప్పుడు ఫ్యూచర్ సిటీ నిర్మాత గా గా తన పేరు ఉండాలని తెలంగాణ ప్రస్తుత సీయం రేవంత్ రెడ్డి ట్రై చేస్తున్నారు. ఈ సిటీ లో ఫార్మా, ఎఐ, ఎంటర్టైన్మెంట్, స్పోర్ట్స్, ఎడ్యుకేషన్, హెల్త్ రంగాలను ప్రోత్సహించేలా 6 థీమ్ సిటీలను నిర్మించే ప్లాన్ చేశారు రేవంత్. ఇప్పటికే ఆ దిశగా పెట్టుబడులను ఆకర్షించే పనిలో పడింది తెలంగాణ ప్రభుత్వం. కనీసం 10 లక్షల మంది నివసించేలా ఫ్యూచర్ సిటీ నిర్మాణం జరుగుతోంది. తెలంగాణ ప్రభుత్వానికి పెట్టుబడుల ఆకర్షణ పెద్ద కష్టం కాదు. హైదరాబాద్ పేరుతో ఆల్రెడీ ఎస్టాబ్లిష్ అయిన ప్రపంచ స్థాయి సిటీ వారికీ అండగా ఉంది. కేంద్రంపై మరీ ఎక్కువ గా ఆధార పడాల్సిన అవసరం రేవంత్ కు లేదు. ఈ క్రొత్త సిటీ నిర్మాణ పర్యవేక్షణ కు ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ ఆథారిటీని కూడా ఏర్పాటు చేశారు. ఈ ఫ్యూచర్ సిటీ ని తెలంగాణ లోని అన్ని ప్రాంతాలతో డైరెక్ట్ గా కనెక్ట్ చేసే రోడ్లు రెడీ చేస్తున్నారు. అలాగే ఫ్యూచర్ సిటీ ని అమరావతి మీదుగా మచిలీపట్నం పోర్ట్ తో లింక్ చేసే గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం కు కూడా ప్రయత్నాలు కొలిక్కి వస్తున్నాయి. 2028 ఎన్నికల టార్గెట్ గా ఫ్యూచర్ సిటీ తొలి దశ పూర్తి చేసే పనుల్లో సీయం రేవంత్ రెడ్డి కష్టపడుతున్నారు. ఏపీ రాజధాని నిర్మాత గా తనపేరు నిలబడి పోవాలని సీఎం చంద్రబాబు నాయుడు చేస్తున్న ప్రయత్నం అమరావతి. మధ్యలో జగన్ ప్రభుత్వం ఉన్న 5ఏళ్ళు తీసేస్తే ఇప్పటికి అమరావతి పనులు మొదలై 6ఏళ్ళు అయింది. ప్రజల నుండి సేకరించిన 33వేల ఎకరాలకు తోడు మరో 23 వేల ఎకరాల వరకూ (ప్రస్తుతానికి) భూమి ల్యాండ్ పూలింగ్ లో తీసుకుని అక్కడ ప్రపంచ స్థాయి రాజధాని ని 9విభాగాలుగా (నవ నగరాలు ) కట్టాలని చంద్రబాబు ప్రయత్నం చేస్తున్నారు. ప్రస్తుతానికి అఖీఅం బిల్డింగ్, అసెంబ్లీ, హై కోర్ట్, సచివాలయం (తాత్కాలికం ) మినహామిగిలిన బిల్డింగ్స్ ఏవీ రెడీ కాలేదు. క్వాంటం వ్యాలీ వస్తుంది అని చెబుతున్నా దాని స్వరూపం పై స్పష్టత రావాల్సి ఉంది. సమస్య ఏమిటంటే ప్రవేట్ పెట్టుబడులు అమరావతిలో ఇంకా పూర్తిగా కార్యరూరం దాల్చలేదు. కేంద్రం నుండి కూడా పూర్తి స్థాయిలో అమరావతి కి సాయం అందుతుందా అంటే లేదనే చెప్పాలి. ఇచ్చేదంతా అప్పుగానే ఇస్తున్నారు. పైగా ఏపీ కి రెవెన్యూ పరం గా అండగా నిలబడే హైదరాబాద్ లాంటి నగరం లేదు. అయినప్పటికీ చంద్రబాబు మొండిగా అమరావతి కోసం పోరాడుతున్నారు. ఏదేమైనా 2029 ఎన్నికలకు ముందుగానే అమరావతి కి ఒక రూపం తేవాల్సిన అవసరం పొలిటికల్ గా చంద్రబాబు పై ఉంది. ప్రస్తుతానికి అయితే ఒక మేర రేవంత్ ఫ్యూచర్ సిటీ పనులు కాస్త స్పీడ్ గా జరుగుతున్నట్టు కనిపిస్తున్నా చంద్రబాబు కూడా ప్రతికూల పరిస్థితుల్లోనూ తాను అనుకున్నది సాధించి తీరతారని ఆయన అభిమానులు కూటమి నేతలు అంటున్నారు

# విడదల అటు... రోజా ఎటూ





తిరుపతి, డిసెంబర్ 17 భారత శక్తి ప్రతినిధి

ఏదైనా అధికారంలో ఉన్నప్పుడు ఏది చేసినా చెల్లుబాటు అవుతుంది. అధినేతకు ధిక్కారం ఉండదు. ఎదిరించేవారు అస్సలు ఉండరు. కానీ అది అధికారంలో ఉన్నప్పుడు మాత్రమే. అధికారం కోల్పోయిన తరువాత విధేయత అనేది పక్కకు వెళ్ళిపోతుంది. రాజకీయం అంటే కేవలం అవసరం అన్నట్టు పరిస్థితి మారిపోతుంది. ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి విషయంలో అదే జరిగింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిన తర్వాత ఒక్కోనేత ఆ పార్టీకి గుడ్ బై చెబుతున్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి అడుగులు వేసిన నేతలు సైతం జగన్మోహన్ రెడ్డిని విడిచిపెట్టి వెళ్ళిపోతున్నారు. ఆ పరిస్థితిని చూస్తున్న అధినేత జగన్మోహన్ రెడ్డి సైతం ఆశ్చర్యపోతున్నారు. గత కొద్దిరోజులుగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరు మహిళ నేతలు అసలు తాడేపల్లి కి రావడం మానేశారట. దీంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఒక రకమైన చర్చ అయితే జరుగుతోందిమాజీ మంత్రి ఆర్కే రోజా గురించి చెప్పనవసరం లేదు. సినిమాల ద్వారా ఆమె అందరికీ సుపరిచితురాలు. రాజకీయాల్లోకి వచ్చాక నిత్యం వార్తల్లో నిలిచేవారు. గట్టిగా ఉంటూనే తెలుగుదేశం పార్టీలో ప్రవేశించారు. కానీ అక్కడ సరిగ్గా రాణించలేకపోయారు. రెండుసార్లు టిడిపి తరపున పోటీ చేసి ఓడిపోయారు. అయితే రాజశేఖర్ రెడ్డి ద్వారా కాంగ్రెస్ పార్టీలో చేరాలనుకున్నారు. ముఖ్యమంత్రిగా ఉండగా ఆయనను కలిశారు. అయితే కొద్ది కాలానికి రాజశేఖర్ రెడ్డి ప్రమాదంలో చనిపోయారు. దీంతో కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లకుండా జగన్ స్థాపించిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2014 ఎన్నికల్లో తన చిరకాల వాంఛ అయినా ఎమ్మెల్యేగా ఎన్నికై అసెంబ్లీలో అడుగుపెట్టారు. 2019లో రెండోసారి గెలిచి మంత్రి కూడా అయ్యారు. 2024 ఎన్నికల్లో ఓడిపోయారు. అయితే ఇప్పుడు సొంత పార్టీ నేతలు నగిరి నియోజకవర్గంలో తనను ఇబ్బంది పెడుతున్నారని అధినేత జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కానీ జగన్ పట్టించుకోకపోవడంతో ఇప్పుడు తాడేపల్లి కార్యాలయం వైపు కూడా రావడం మానేశారు.రాజకీయంగా అదృష్టం అంటే మాజీమంత్రి విడదల రజనీది ఎందుకంటే పోటీ చేసిన తొలిసారి ఎమ్మెల్యే అయ్యారు. ఎమ్మెల్యే అయిన తొలిసారి మంత్రి పదవి కూడా చేపట్టారు. దీనికి ముమ్మాటికీ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన స్వేచ్ఛ, అవకాశం కారణం. అప్పటి మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అనుచరురాలుగా, ద్వితీయ శ్రేణి నాయకురాలిగా ఉండేవారు రజని. కానీ ఏకంగా జగన్మోహన్ రెడ్డి ఆమెను పార్టీలోకి ఆహ్వానించి టికెట్ ఇచ్చారు. మంత్రి పదవి కూడా కల్పించారు. ఆమెపై వ్యతిరేకత ఉందన్న కోణంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గం పంపించి టికెట్ కేటాయించారు. అయినా సరే ఓటమి ఎదురయ్యింది. అయితే రేపల్లె వెళ్ళమని కోరగా ఆమె ససే మిరా అంటున్నారు. అయితే ఇప్పుడు అధినేత పై ఆగ్రహంతో తాడేపల్లి వైపు రావడం మానేశారు.అయితే ఒకటి మాత్రం నిజం మాజీ మంత్రులుగా ఉన్న ఈ మహిళా నేతలు ఇద్దరు వేరే పార్టీలో చేరుతామంటే చాన్స్ లేదు. రోజా కంటే రజనీ నయం. ఎందుకంటే రోజా మాదిరిగా అడ్డగోలుగా ఆమె మాట్లాడలేదు. అందుకే రజనీ విషయంలో సాఫ్ట్ కార్నర్ ఉంది. అది కూడా జనసేన నుంచి సానుకూలత వ్యక్తం అయ్యే అవకాశం ఉంది. ఎందుకంటే అక్కడ మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు. రాజకీయంగా ఆయనతో రజనీకి సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. అందుకే త్వరలో ఆమె జనసేనలో చేరడం ఖాయమని ప్రచారం నడుస్తోంది. కానీ రోజా ఉంటే వైసిపి లోనే ఉండాలి.. లేకుంటే సినిమాల్లోకి వెళ్ళాలి. అది కూడా తమిళ సినిమా, బుల్లితెరలోనే ఆమెకు అవకాశాలు అని తెలుస్తోంది.

# పంచాయతీ ఎన్నికలతో

# గులాబీ జోష్

హైదరాబాద్, డిసెంబర్ 17 భారత శక్తి ప్రతినిధి

తెలంగాణలో పంచాయతీ ఎన్నికలు ముగింపు దశకు వచ్చాయి. ఇందులో కాంగ్రెస్ పార్టీ పైచేయి సాధించింది. బీఆర్ఎస్ పార్టీ కూడా మంచి పోటీ ఇచ్చింది. గ్రామాల్లో పట్టు కోల్పోలేదని రుజువైంది. బీజేపీ ప్రత్యామ్నాయం కాదని స్పష్టం చేసింది. ఇప్పుడు ఇదే జోష్‌ను జెడ్పీటీసీ ఎంపీటీసీ, జీహెచ్ఎంసీ ఎన్నికల వరకు తీసుకెళ్లేందుకు వ్యూహాలు రచించే పనిలో ఉన్నారు గులాబీ అధినేత. అందుకే పార్టీ ఎల్పీతోపాటు పార్టీ విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేస్తున్నారు.



డిసెంబర్ 21న తెలంగాణ భవన్‌లో మధ్యాహ్నం భేటీ జరగనుంది. ఇందులో కీలకమైన నిర్ణయాలు తీసుకుంటారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.2023 ఎన్నికల్లో పార్టీ మూడోసారి అధికారంలోకి వస్తుందని గులాబీ దళం చాలా గట్టిగా ఆశలు పెట్టుకుంది. కానీ ప్రజలు మాత్రం కాంగ్రెస్‌వైపు మొగ్గు చూపారు. దీంతో బీఆర్ఎస్ వర్గాలు ఒక్కసారిగా ఢీలాపడిపోయాయి. దీనికి తోడు అప్పటి నుంచి కేసీఆర్ ఒకట్రెండు పార్టీ కార్యక్రమాల్లో కనిపిస్తున్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఒక్క భారీ రాజకీయ నిర్ణయాలు తీసుకోలేదు. అప్పుడప్పుడు నిరసనలకు పిలుపునిచ్చినా అవి అంతగా ప్రభావం చూపలేదు. కవిత తిరుగుబాటుతో పార్టీ మరింత పలుచనైంది. కేటీఆర్, హరీష్ ఇద్దరే పార్టీ కొందరు సీనియర్స్‌తో కలిసి వచ్చిన ఎన్నికలను ఎదుర్కొంటున్నారు. పంచాయతీ ఎన్నికలు మినహా ఏ ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్ తమ స్థాయిలో రాణించలేకపోయింది. బీఆర్ఎస్ పరిస్థితి చూసిన వారంతా బీజేపీ ప్రత్యామ్నాయంగా ఎదుగుతుందని చూశారు. కానీ ఆ పార్టీ కూడా అంతర్గత కుమ్ములాటలతో రెండు అడుగులు ముందుకు ఆరు అడుగులు వెనక్కి వెళ్తోంది. దీంతో ప్రజల మనను మారినట్టు కనిపిస్తోంది. అందుకే పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ తర్వాత స్థానం బీఆర్ఎస్‌కు కట్టబెట్టారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత వరుస దెబ్బలతో చతికిలబడిన పార్టీకి ఈ ఫలితాలు కాస్త ఊరట ఇచ్చాయి. దీన్ని మరింత దూకుడుగా తీసుకెళ్లాలని పార్టీ అధినాయకత్వం వ్యూహాలు రచిస్తోంది.బీఆర్ఎస్ అంటే దూకుడు, పోరాట స్వభావం ఉన్న పార్టీ. అలాంటి పార్టీ ఇప్పుడు ఉన్న స్థితిని ఆ పార్టీ నాయకులు ఎవరూ జీర్ణించులేకపోతున్నారు. అందుకే దీన్ని మార్చాలని కేసీఆర్ యోచిస్తున్నారు. ఇందులో భాగంగా డిసెంబర్ 19 కీలక సమావేశం పెడుతున్నారు. ఇందులో పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీ సీనియర్ నాయకులను ఆహ్వానిస్తున్నారు. పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు నమ్మకం ఉంచి గెలిపించారని దాన్ని ముందుకు కొనసాగించాలని సూచించనున్నారు. తెలంగాణ భవన్‌లో ఈ సమావేశం జరగనుంది. ఇందులో భవిష్యత్‌లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలతోపాటు పోరాటాలపై కూడా ఫోకస్ చేయనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేపట్టేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించనున్నారు. ముఖ్యంగా తెలంగాణకు అన్యాయం చేసేలా పొరుగు రాష్ట్రాలు నీటిని తరలించుకుపోతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ఇదే అంశంపై పోరాటాలు చేసేందుకు సిద్ధమవుతోంది. నీటి విషయంలో జరుగుతున్న అన్యాయం సహా కాంగ్రెస్ హామీలు ఇచ్చి ఎగ్గొట్టిన వాటిపై ఎక్కువ దృష్టి పెట్టనున్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ, జీహెచ్ఎంసీ ఎన్నికలతోపాటు పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడుతుందని ఆ ఎన్నికలకు కూడా సిద్ధపడాలని దిశానిర్దేశం చేయనున్నారు. గులాబీ నేతలకు దిశానిర్దేశం చేయడమే కాకుండా తాను కూడా కొన్ని పోరాటాల్లో పాల్గొంటానని నేతలకు కేసీఆర్ చెప్పనున్నారు. ఇన్ని రోజులు కాంగ్రెస్ ప్రభుత్వానికి టైం ఇచ్చామని ఇప్పుడు తెలంగాణ ప్రజలను నిలువునా మోసం చేస్తున్న ప్రభుత్వానికి బుద్ధి చెప్పాల్సిన టైం వచ్చిందని అందుకే తానే క్షేత్రస్థాయిలోకి దిగబోతున్నట్టు కేసీఆర్ చెప్పనున్నారని తెలుస్తోంది

# ఓయాసిస్ జనని యాత్ర వరంగల్

వరంగల్, డిసెంబర్ 17 (న్యూస్ పల్స్)

భారతదేశంలో అత్యంత విశ్వసనీయ రీప్రొడక్టివ్ మెడిసిన్ సంస్థల్లో ఒకటైన ఓయాసిస్ ఫెర్టిలిటీ, దేశవ్యాప్తంగా ఫెర్టిలిటీ




అవగాహన పెంచే లక్ష్యంతో చేపట్టిన ఓయాసిస్ జనని యాత్ర వరంగల్ చేరింది. టైర్ ఎ, ఈ, ఎఎ ప్రాంతాల్లో ఫెర్టిలిటీ అవగాహన, నిపుణుల మార్గదర్శకం, ఫెర్టిలిటీ స్క్రీనింగ్ సేవలను నేరుగా ప్రజలకు అందించడం ఈ కార్యక్రమం లక్ష్యం. జీవనశైలి మార్పులు, ఆలస్య వివాహాలు, శాస్త్రీయ అవగాహన లోపం వంటి కారణాలతో ఫెర్టిలిటీ సమస్యలు పెరుగుతున్న వేళ ఓయాసిస్ జనని యాత్ర బస్సు దంపతులకు ఉచిత ఫెర్టిలిటీ సలహాలు, ఉచిత ఎ ఎం హెచ్ పరీక్ష, వీర్య పరీక్ష, హీమోగ్లోబిన్ పరీక్షలు వంటి సేవలను అందిస్తోంది. శుభ్రమైన, సురక్షితమైన నమూనా సేకరణ ప్రాంతాలతో ఈ సేవలు మరింత సౌకర్యవంతంగా అందిస్తున్నారు. ఫోర్ట్ వరంగల్ తర్వాత ఈ జనని యాత్ర, తెలంగాణ రాష్ట్రంలో భూపాలపల్లి, జమ్మికుంట, మహబూబాబాద్ ప్రాంతాలకు వెళ్లి మరింత మంది ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. డా. దుర్గా జి.రావు, మెడికల్ డైరెక్టర్ & కో-ఫౌండర్, ఓయాసిస్ ఫెర్టిలిటీ, "సైన్స్ ఫెర్టిలిటీ రంగాన్ని మారుస్తున్న ఈ సమయంలో, ఓయాసిస్ జనని యాత్ర ఆధునిక, సాక్ష్యాధారిత ఫెర్టిలిటీ గురించిన సమాచారాన్ని సమాజాల మధ్యకు నేరుగా తీసుకెళ్తోంది. ఫెర్టిలిటీ యాత్రను ప్రారంభిస్తున్న దంపతులకు తొందరగా వైద్య మార్గదర్శకాన్ని అందించడం ద్వారా భవిష్యత్తుకు ఆరోగ్యకరమైన మార్గం సృష్టిస్తుంది." అని వ్యక్తపరిచారుపుష్పరాజ్ షెనాయ్, సీఈఓ, ఓయాసిస్ ఫెర్టిలిటీ, "భారతదేశ ఫెర్టిలిటీ రేటు నిరంతరం పడిపోతున్న ఈ సమయంలో, సమయానుకూలమైన, అందుబాటులో ఉన్న ఫెర్టిలిటీ సంరక్షణ మరింత ముఖ్యమైంది. నిపుణుల కన్సల్టేషన్, దయాగ్నస్టిక్స్, అవసరమైన మార్గదర్శకంతో 'గుడ్ హ్యాండ్స్ ఆఫ్ సైన్స్'ను గ్రామీణ స్థాయికి విస్తరించుతున్నాం. ప్రతి జంట సరైన నిర్ణయాలు తీసుకునేలా సకాలంలో సహాయం అందించడం మా ధ్యేయం." అని తెలిపారుడా. కావ్య రావు జలగం, రీజినల్ మెడికల్ హెడ్ & ఫెర్టిలిటీ స్పెషలిస్ట్, "మునుపటి జనని యాత్రకు వచ్చిన అపార స్పందన దంపతులు సరైన మార్గదర్శకాన్ని ఎంత విలువగా తీసుకుంటారో చూపించింది. ఇంకా ఫెర్టిలిటీపై అవగాహన తక్కువగా ఉన్న ఈ ప్రాంతాల్లో సరైన సమాచారం, సానుభూతితో కూడిన సహాయాన్ని అందించడం మా ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం." అని అన్నారు. 2009లో స్థాపించిన ఓయాసిస్ ఫెర్టిలిటీ, భారతదేశవ్యాప్తంగా 34 కేంద్రాలతో అగ్రగామి రీప్రొడక్టివ్ హెల్త్‌కేర్ ప్రొవైడర్. శాస్త్రీయ నైపుణ్యం, నైతిక వైద్యపద్ధతులు, అత్యున్నత ఎంఈ విజయశాతాలతో ప్రసిద్ధి చెందిన ఓయాసిస్, ఇన్నాళ్లుగా అనేక కుటుంబాలకు ఆరోగ్యకరమైన బిడ్డలను అందించిందని చెబుతోంది. పురుషులు, మహిళల కోసం ఐవీఎఫ్, ఐయూఐ, ఎఆయి, ఫెర్టిలిటీ ప్రిజర్వేషన్ వంటి విస్తృత సేవలను ఆధునిక ల్యాబ్ టెక్నాలజీ, వ్యక్తిగత సంరక్షణ, సంపూర్ణ వెల్‌నెస్ సహకారంతో అందిస్తోంది.

# ఏపీ సమస్యలపై తెలంగాణలో ఆందోళన...

హైదరాబాద్, డిసెంబర్ 17

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో కొందరు చేస్తున్న పనులు పార్టీకి చెడ్డ పేరు తీసుకొస్తున్నాయి. చాలామంది నేతలు ఏపీలో రాజకీయాలు చేస్తున్నారు. పార్టీ కార్యక్రమాల నిర్వహణ మాత్రం పక్క రాష్ట్రాల్లో చేస్తున్నారు. అధినేత జగన్మోహన్ రెడ్డి వారంలో మూడు రోజులు పాటు తాడేపల్లి కి వచ్చి పార్టీ కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్నారు. మిగతా నాలుగు రోజులు బెంగళూరుకు పరిమితం అవుతున్నారు. అయితే ఆయనను చూసి ఇప్పుడు కొత్తగా యాంకర్ శ్యామల లాంటి వారు సైతం ఏపీని తొంగి చూడడం లేదు. హైదరాబాదులో ఉంటూ ప్రత్యేక వీడియోలు విడుదల చేస్తున్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై అధికార ప్రతినిధి హోదాలో ఇలా వీడియోలు తీసి మీడియాకు అందిస్తున్నారు. సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. అంతవరకు ఓకే కానీ.. ఏకంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను సైతం హైదరాబాదులోనే.. అది కూడా తాను నివాసం ఉంటున్న కూకట్పల్లి ప్రాంతంలోనే నిర్వహిస్తుండడం మాత్రం కాస్త అతిగా మారుతుంది.సోషల్ మీడియావచ్చాక రాజకీయ పార్టీల తీరు మారింది. ఆ పార్టీ కార్యక్రమాల తీరు కూడా మార్చేశారు. ఎక్కడో విదేశాల్లో ఉంటే సెల్ఫీ వీడియో తీసి సోషల్ మీడియాకు జత చేస్తున్నారు. మెయిన్ మీడియా కూడా అదే వీడియోను ప్రసారం చేసి వారికి ఎనలేని ప్రచారం కల్పిస్తోంది. అయితే పెద్ద నేతలు వరకు ఓకే కానీ అధికార ప్రతినిధి హోదాలో.. పనిచేస్తున్న యాంకర్ శ్యామల లాంటి వారు కూడా ఇలా చేయడం ఏంటి అని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఒక ప్రశ్న వినిపిస్తోంది. పైగా ఆమెకు ఆర్థిక ప్రయోజనం ఉందన్న టాక్ ఉంది. జీతాల రూపంలో సేవలు అందిస్తున్నారు అన్న మాట వినిపిస్తోంది.ఇటీవల పిన్నెల్లి బ్రదర్స్ అరెస్టయ్యారు. అయితే ఆమెకు ఆ విషయం తెలియదు అన్నట్టు ఉంది. వారు రెండు రోజుల క్రితం అరెస్టు అయితే.. ఆమె నిన్నటే కారుమూరి వెంకటరెడ్డి అనే నేత కలిసి కూకట్పల్లిలో ఆందోళన చేశారు. అంతకు ముందు కూడా ఆమె ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ ఒక ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు హైదరాబాదులో. అక్కడే సంతకాల సేకరణ చేపట్టారు. అయితే ఆమె ఏపీ రాజకీయాల గురించి మాట్లాడుతూ హైదరాబాదులో ఉంటున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోసం తన బుల్లితెర కెరీర్ ను వదులుకున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ నుంచి కొంత మొత్తం జీతం అందుకుంటున్నారన్న టాక్ ఉంది. అందుకే కాబోలు హైదరాబాదు నుంచి తన రాజకీయాలను సాగిస్తున్నారు. అయితే తమకు అలాంటి అవకాశం కల్పించాలని ఇప్పుడు వైసీపీ నేతలు పార్టీ హై కమాండ్ ను కోరుతున్నారు. ఎక్కడో వ్యాపారాలు చేసుకుంటూ రాజకీయం చేస్తామని అంటూ సెటైర్లు వేస్తున్న వారు ఉన్నారు.



# ఫిబ్రవరి తర్వాత మూసీ పనులు

కరీంనగర్, డిసెంబర్ 17 భారత శక్తి ప్రతినిధి

తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న మూసీ నది పునరుజ్జీవం తొలి దశ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. వచ్చే ఏడాది ఉగాది నుంచి పనులను స్టార్ట్ చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు వర్గాలు వెల్లడిస్తున్నాయి. తెలుగు సంవత్సరాది రోజున పనులకు శంకుస్థాపన చేసి, మొదటి దశను వీలైనంత త్వరగా పూర్తిచేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకు అవసరమైన భూ సేకరణ, నిధుల సమీకరణ ప్రక్రియలు ఒకేసారి ముందుకు సాగుతున్నాయి.మూసీ పునరుజ్జీవానికి అవసరమైన కీలక నిధుల అంశంలో కూడా స్పష్టత వస్తోంది. ఈ ప్రాజెక్టుకు రుణం అందించేందుకు ఏషియన్ డెవలప్మెంట్ బ్యాంకు (ఏడీబీ) అంగీకారం తెలిపినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. మిగతా ప్రక్రియలు పూర్తయిన వెంటనే పనులు ప్రారంభించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు అధికారులు. మూసీ అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి అంతర్జాతీయంగా అమలులో ఉన్న నమూనాలను అధ్యయనం చేయడానికి రాష్ట్ర అధికారులను కొరియా, జపాన్ వంటి దేశాలకు పంపారు. భవిష్యత్ ప్రణాళికల్లో భాగంగా మూసీ పునరుజ్జీవాన్ని రాష్ట్ర అభివృద్ధి దృష్టికోణంలో కీలకంగా పరిగణిస్తున్నారు. హెచ్ఎండీఏ పరిధిలో మొత్తం 55 కిలోమీటర్ల మేర మూసీ అభివృద్ధి చేపట్టాలని నిర్ణయించగా, తొలి దశలో 9 కిలోమీటర్ల పరిధిలో పనులు చేపట్టనున్నారు. దీనికి సంబంధించిన డీపీఆర్‌ను ఈ నెలాఖరుకల్లా సిద్ధం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. డీపీఆర్ పూర్తయ్యాక ఆయా పనులకు అవసరమైన వ్యయ అంచనాలను అధికారులు రూపొందించి ప్రభుత్వానికి పంపనున్నారు. తొలి దశలో లంగర్‌హౌస్‌లోని బాపూఘాట్ ప్రాంతంలో ప్రత్యేక పనులు చేపట్టనున్నారు. మహాత్మా గాంధీకి సంబంధించిన భారీ విగ్రహం, ఆయన బోధనలను తెలియజేసే మ్యూజియం, వివిధ మతాల ప్రార్థనా మందిరాలు, మూసీ వెంట రవాణా సౌకర్యాలు కల్పించే రహదారి నిర్మాణం వంటి అంశాలు ఈ దశలో ఉన్నాయి. ఇవన్నీ డీపీఆర్‌లో చేర్చనున్నారు.ఈ పనుల కోసం రక్షణ శాఖ పరిధిలోని దాదాపు 250 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వంతో చర్చలు కొనసాగుతున్నట్లు సమాచారం. అలాగే కొన్ని ప్రైవేట భవనాలను స్వాధీనం చేసుకుని, ప్రభావితులకు పునరావాసం కల్పించే అంశాలను ప్రణాళికలో భాగం చేస్తున్నారు. ప్రభుత్వ ఆమోదం లభించిన తర్వాత రుణ సేకరణ ప్రక్రియను అధికారికంగా ప్రారంభించనున్నారు. తొలి దశ పనులకు సుమారు రూ. 4,100 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేస్తున్నారు. ఈ మొత్తాన్ని రుణంగా అందించేందుకు ఏడీబీ సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపిన వెంటనే రుణ మంజూరు ప్రక్రియ పూర్తవుతుందని అధికారులు చెబుతున్నారు.ఫిబ్రవరి చివరి నాటికి రుణ ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉండగా, ఆ తర్వాత టెండర్లను పిలిచే యోచనలో ఉన్నారు. అన్ని ప్రక్రియలు అనుకున్నట్లు సాగితే వచ్చే ఉగాది నాటికల్లా మూసీ పునరుజ్జీవం తొలి దశ పనులు ప్రారంభమవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ పనులను రెండేళ్ల వ్యవధిలో పూర్తి చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

# జనం బాటలో కనిపించని జనం



కరీంనగర్, డిసెంబర్ 17

కల్వకుంట్ల కవిత.. తెలుగు రాష్ట్రాలకు పరిచయం అక్కరలేని పేరు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కూతురుగా, ఢిల్లీ లిక్కర్ స్కాం కేసు తర్వాత దేశమంతటికీ సుపరిచితం అయ్యారు. ఇటీవలే బీఆర్ఎస్ నుంచి సస్పెన్షన్‌కు గురాయ్యరు. పార్టీలో ఉంటూ సొంత పార్టీ నేతలపైనే అవినీతి ఆరోపణలు, విమర్శలు చేయడంతో కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేయారు. ఇప్పుడు తెలంగాణ జాగృతి పేరుతో జనం బాట చేస్తున్నారు. కానీ ఇందులో జనం కనిపించడం లేదు. దీంతో కవిత మరో షర్మిల అవుతుంది అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ తరుణంలో కవిత కీలక ప్రకటన చేశారు. బీఆర్ఎస్‌కు వీడ్కోలు చెప్పిన కెసిఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత 2029 సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తామని ప్రకటించి ఊహాగానాలకు బలం చేకూర్చింది. ఎక్స్ వేదికగా నిర్వహించిన 'ఆస్క్ కవిత' సెషన్‌లో పార్టీ పేరు, లక్ష్యాలు, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాల గురించి మాట్లాడారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో కొత్త రాజకీయ ఉద్యమాన్ని రూపొందిస్తున్నామని తెలిపారు. 'పార్టీ పేరు ప్రజలు సూచించినట్టుగానే పెడతాం' అని కవిత స్పష్టం చేసింది. మహిళలు, యువతకు రాజకీయ అవకాశాలు కల్పించడం ప్రధాన లక్ష్యం. స్కిల్ డెవలప్‌మెంట్, ఉద్యోగ రక్షణలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తామని హామీ. రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కవిత తీవ్రంగా విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌లో వైఫల్యంతో లక్షల మంది విద్యార్థులు చదవుకు దూరమవుతున్నారని పేర్కొన్నారు. రైతుల ఆత్మహత్యలు, ఫార్మాసిటీ భూముల్లో 'ఫ్యూచర్ సిటీ' డ్రామా, సింగరేణి నిర్లక్ష్యం, ఈస్ట్ జోన్ మౌలిక సదుపాయాల లోపాలను ప్రస్తావించారు. జాగృతి సభ్యత్వ కార్యక్రమం త్వరలో ప్రారంభిస్తామని ప్రకటించింది. ఫార్మాసిటీ రైతులకు మద్దతుగా త్వరలోనే పోరాటం చేస్తానని హెచ్చరించింది. సింగరేణి కార్మికుల సమస్యలపై హెచ్‌ఎంఎస్‌తో కలిసి పోరాడతామని స్పష్టం చేశారు. హైదరాబాద్ వెస్ట్‌కు ప్రాధాన్యత ఇచ్చి ఈస్ట్‌ను విస్మరించారని ఆరోపణ. ఈ విమర్శలు కాంగ్రెస్‌లో కొంపవైన ఆందోళన కలిగించాయి. నెటిజన్ల ప్రశ్నలకు సరదాగా అభిమాన హీరో ఎవరు అని అడిగారు. స్పందించిన కవిత మెగాస్టార్ చిరంజీవి అభిమాని అయినప్పటికీ, రామ్ చరణ్ వినయవంతుడు, సూపర్ డాన్సర్ అని ప్రశంసించింది. చిన్నతనంలో ఎర్రమంజిల్‌లో గడిపిన క్షణాలు అత్యంత ఆనందకరమైనవని గుర్తుచేసింది. కవిత ప్రకటన బీఆర్ఎస్‌లో కలవరం రేపింది. 2029 వరకు తెలంగాణ జాగృతి బలపడితే కాంగ్రెస్‌కు సవాల్‌గా మారనుంది. మహిళా?యువత ఫోకస్‌తో కొత్త ఓటు బ్యాంక్ ఏర్పాటవుతుందని విశ్లేషకులు అంచనా.

# గీతంపై సర్కారు కోర్టు తలంటు...

హైదరాబాద్, డిసెంబర్ 17,

హైదరాబాద్‌లోని గీతం డీమ్డ్ యూనివర్సిటీ 2008 నుండి అంటే గత 17 ఏళ్లుగా సుమారు రూ. 118 కోట్ల కరెంట్ బిల్లు బకాయి పడటంపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. విద్యుత్ శాఖ ఇచ్చిన నోటీసులను సవాల్ చేస్తూ వర్సిటీ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ నగేశ్ భీమపాక, అధికారుల తీరును తప్పుపట్టారు. సామాన్యులు వెయ్యి రూపాయలు కట్టకపోతే కనెక్షన్ కట్ చేసే అధికారులు, వర్సిటీకి ఇన్ని ఏళ్లుగా ఎందుకు వెసులుబాటు ఇచ్చారని ప్రశ్నించారు. ఈ భారీ బకాయిలపై పూర్తి వివరాలతో సూపరింటెండింగ్ ఇంజనీర్ వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని న్యాయస్థానం ఆదేశించింది. హైదరాబాద్‌లోని ప్రముఖ విద్యాసంస్థ గీతం డీమ్డ్ యూనివర్సిటీ విద్యుత్ బిల్లుల చెల్లింపు విషయంలో తీవ్ర వివాదంలో చిక్కుకుంది. గత 17 ఏళ్లుగా అంటే 2008 నుండి ఈ విద్యాసంస్థ ఒక్క రూపాయి కూడా విద్యుత్ బిల్లు చెల్లించలేదని వెల్లడి కావడంతో రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం విస్మయం వ్యక్తం చేసింది. సుమారు రూ. 118 కోట్ల విద్యుత్ బకాయిలు పేరుకుపోవడమే కాకుండా.. అధికారులు దీనిపై మెతక వైఖరి ప్రదర్శించడంపై హైకోర్టు తీవ్రంగా మండిపడింది. ఈ కేసును విచారించిన జస్టిస్ నగేశ్ భీమపాక విద్యుత్ శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విచారణ సందర్భంగా కోర్టు చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. సామాన్య పౌరులు కేవలం వెయ్యి రూపాయల బిల్లు చెల్లించకపోయినా.. కనికరం లేకుండా విద్యుత్ కనెక్షన్ కట్ చేస్తున్న అధికారులు.. ఇన్ని కోట్లు బకాయి ఉన్న వర్సిటీపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. గీతం యూనివర్సిటీకి అదనంగా ఏమైనా ప్రత్యేక వెసులుబాటు ఉందా? లేక రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి అధికారులు మిన్నకుండిపోయారా? అని నిలదీశారు. 2008 నుండి అంటే దాదాపు మూడు వేర్వేరు ప్రభుత్వాలు మారినా, ఈ బకాయిల వసూలు ప్రక్రియ జరగకపోవడంపై కోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది. నోటీసులను సవాల్ చేసిన గీతం వర్సిటీ. ఇటీవల టీజీఎస్పీడీసీఎల్ అధికారులు వర్సిటీకి రూ. 118 కోట్లు చెల్లించాలని నోటీసులు జారీ చేయడంతో.. ఆ నోటీసులను సవాల్ చేస్తూ గీతం యాజమాన్యం హైకోర్టును ఆశ్రయించింది. అయితే, సుదీర్ఘకాలంగా బిల్లులు చెల్లించకపోవడాన్ని సమర్థించుకోవడంపై కోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఈ ఉదంతంపై పూర్తి వివరాలతో కూడిన అఫిడవిట్ దాఖలు చేయాలని, సూపరింటెండింగ్ ఇంజనీర్ వ్యక్తిగతంగా కోర్టుకు హాజరై వివరణ ఇవ్వాలని జస్టిస్ ఆదేశించారు. ఈ వ్యవహారంలో విద్యుత్ శాఖ అధికారుల పాత్రపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏటా ఆడిటింగ్ జరిగే క్రమంలో ఇన్ని కోట్ల బకాయిలు అధికారుల కంటపడకపోవడం వెనుక లోతైన లోపాలు ఉన్నట్లు తెలుస్తోంది. విద్యుత్ సంస్థలకు నష్టాలు వస్తున్నాయని ఛార్జీలు పెంచుతున్న తరుణంలో.. ఇలాంటి భారీ సంస్థల నుండి బకాయిలు వసూలు చేయడంలో వైఫల్యం చెందడంపై ప్రజల నుండి కూడా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. హైకోర్టు జోక్యంతోనైనా ఈ భారీ బకాయిలు ప్రభుత్వ ఖజానాకు చేరుతాయో లేదో వేచి చూడాలి.

# కరీంనగర్ లో అధికార ఎమ్మెల్యేలకు షాక్

కరీంనగర్, డిసెంబర్ 17 భారత శక్తి ప్రతినిధి

ఎమ్మెల్యేలు రాజకీయంగా యాక్టివ్‌గానే ఉన్నప్పటికీ రెండు విడతల్లో జరిగిన ఎన్నికల్లో వాళ్ళ సొంత గ్రామాలలోనే ఓటమిని చవిచూశారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు బలపరిన అభ్యర్థులు.. బీఆర్ఎస్, ఇతర పార్టీల అభ్యర్థుల చేతితో ఓటమి పాలయ్యారు. దీంతో ఎమ్మెల్యేలు స్థానిక అభ్యర్థుల ఎంపికపై సరిగ్గా దృష్టి పెట్టలేదని.. ఇప్పటికైనా వైఫల్యం ఎక్కడ జరిగిందో తెలుసుకొని.. సరిదిద్దుకోవాల్సి అవసరం ఉందనే చర్చ జరుగుతుంది. ఇదే అంశంపై అటు అధిష్టానం కూడా సీరియస్ అయినట్టు తెలుస్తోంది. ఇక సొంత నియోజకవర్గంలోనే అభ్యర్థులను గెలిపించుకోలేకపోయిన వారి జాబితా చూసుకుంటే.. ఉమ్మడి పాలమూరు జిల్లా నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికా రెడ్డి.. తన పక్క ఊరు దన్వాడలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకోలేక పోయింది. అక్కడ కాంగ్రెస్ అభ్యర్థిపై బిఆర్ఎస్ అభ్యర్థి విజయం సాధించారు. ఇక దేవరకద్ర ఎమ్మెల్యే జి.ఎం.ఆర్ సొంత ఊరు దమత్నాపూర్‌లోనూ ఇదే పరిస్థితి కనిపించింది. అక్కడ కూడా బిఆర్ఎస్ అభ్యర్థి 120 ఓట్లకు మెజార్టీతో కాంగ్రెస్‌పై గెలిచారు. అటు జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి సొంత గ్రామం రంగారెడ్డిగూడలో సైతం కాంగ్రెస్ అభ్యర్థి ఓడిపోయారు. ఇక ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సైతం ఇదే రకమైన పరిస్థితి ఉంది. మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకి షాక్ ఇచ్చారు సొంతూరు ప్రజలు. ఎమ్మెల్యే సొంతూరు పచ్చు నూరులో ఒక్క ఓటుతో తేడాతో కాంగ్రెస్‌పై బిఆర్ఎస్ మద్దతుదారు సర్పంచ్‌గా గెలిచారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీ నాయక్ సొంతూరులో తన సోదరుడు ఓడిపోయాడు. అక్కడ బిఆర్ఎస్ మద్దతు పలికిన అభ్యర్థి గెలిచారు. ఇక భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు స్వగ్రామం దుమ్ముగూడెం మండలం బండిరేవులో సైతం కాంగ్రెస్ ఓడిపోయింది. అక్కడ బిఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థి గెలిచారు. ఇలా చాలా ప్రాంతాల్లో తమ సొంత గ్రామ ప్రజలు ఇచ్చిన తీర్పు చూసి ఎమ్మెల్యేలు షాక్ అవుతున్నారు. ఇక మూడవ విడతలో అయినా ఇలాంటి పరిస్థితులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యేలకు పీసీసీ ఆదేశాలు జారీ చేసినట్టు తెలుస్తోంది. మొత్తానికి అధికార కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు తమ సొంత గ్రామాల్లో సర్పంచ్ స్థానాలు ఓడిపోవడంతో ప్రజలు విలక్షణ తీర్పు ఇచ్చారని చర్చ జరుగుతోంది

===============

# హడ్కో నుంచి 5 వేల కోట్ల రుణం

హైదరాబాద్, డిసెంబర్ 17

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం పనులను వేగవంతం చేస్తోంది. ఇందుకోసం హడ్కో నుంచి ప్రభుత్వం రూ. 5 వేల కోట్ల రుణాన్ని సమీకరించింది. ఈ నిధులతో నిలిచిపోయిన పాత బిల్లులను త్వరలోనే లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నారు. వచ్చే మార్చి 31 నాటికి రాష్ట్రవ్యాప్తంగా లక్ష ఇళ్లను పూర్తి చేసి గృహప్రవేశాలు చేయించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. వివిధ దశల్లో ఉన్న నిర్మాణాలకు గ్రీన్ చానెల్ ద్వారా ప్రతి సోమవారం లబ్ధిదారుల అకౌంట్లలోకి డబ్బులు నేరుగా వెళ్లనున్నాయి. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఆర్థిక వనరుల కొరత లేకుండా రాష్ట్ర ప్రభుత్వం హడ్కో నుండి రూ. 5 వేల కోట్ల భారీ రుణాన్ని తీసుకుంది. ఈ నిధుల రాకతో ఇళ్ల నిర్మాణ ప్రక్రియ మరింత వేగవంతం కానుంది. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారుల బిల్లులను త్వరలోనే వారి వారి ఖాతాల్లో జమ చేసేందుకు హౌసింగ్ అధికారులు కసరత్తు పూర్తి చేశారు. బేస్మెంట్, స్లాబ్ మరియు ఫినిషింగ్ వంటి వివిధ దశల్లో ఉన్న ఇళ్లకు సంబంధించి ప్రభుత్వం ప్రతీ సోమవారం గ్రీన్ చానెల్ ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా డబ్బులు పంపిణీ చేయనుంది. నిధుల లభ్యత పెరగడంతో.. క్షేత్రస్థాయిలో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి నిధులు విడుదల చేయాలని కలెక్టర్లు , ప్రాజెక్టు డైరెక్టర్లకు ఆదేశాలు అందాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు.. అంటే మార్చి 31 నాటికి లక్ష ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి గృహప్రవేశాలు చేయించాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 1.48 లక్షల ఇళ్ల పనులు కొనసాగుతుండగా.. ఇప్పటికే 60 వేల ఇండ్లు స్లాబ్ దశకు చేరుకున్నాయి. హౌసింగ్ సెక్రటరీ, కార్పొరేషన్ అధికారులు నిత్యం జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్లతో సమావేశాలు నిర్వహిస్తూ పనులను పర్యవేక్షిస్తున్నారు. ప్రభుత్వం ఈ పథకానికి బడ్జెట్‌లో రూ. 12 వేల కోట్లు కేటాయించింది. హడ్కో లోన్ , భూముల వేలం ద్వారా వచ్చిన నిధులతో కలిపి ఈ మార్చి లోపు రికార్డు స్థాయిలో ఇళ్లను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. సొంత ఇంటి కల నెరవేర్చుకోవాలనుకునే పేదలకు ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక సాయం, పెండింగ్ బిల్లుల విడుదల వార్త ఇప్పుడు లబ్ధిదారుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది.

# పీ.పీ.పీ విధానాన్ని రద్దు చేయాలి

## జీఓ నెంబర్ 107,108, రద్దు చేయాలి.

### పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో నెంబర్ 77 ను రద్దు చేయాలి

ఏలూరు జిల్లా డిసెంబర్ 17 భారత శక్తి ప్రతినిధి

రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలు 6,400 కోట్ల రూపాయలు విడుదల చేయాలి. ఏఐఎన్ఎఫ్, ఏలూరు జిల్లా అధ్యక్షులు డి. శివకుమార్ఏఐవైఎఫ్, జిల్లా కన్వీనర్ తోర్లపాటి రాజు డిమాండ్ ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, ఆధ్వర్యంలో చింతలపూడి నగరం లో ఉన్న జూఖీ విగ్రహం ఎదురుగా విద్యార్థులతో కలిసి నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ , జిల్లా అధ్యక్షులు డి. శివ కుమార్ మరియు ఏఐవైఎఫ్, జిల్లా కన్వీనర్ తొర్లపాటి రాజు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నిరుపేద విద్యార్థులు చదువుకోవాల్సిన ప్రభుత్వ మెడికల్ కళాశాలను పీ.పీ.పీ అనే పేరుతో మెడికల్ కళాశాలలను ప్రైవేటు కరణ చేస్తున్నారని, తక్షణమే పీ.పీ.పీ విధానని రద్దు చెయ్యాలని అన్నారు రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న 6400 కోట్ల రూపాయలు ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలను, కూటమి ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు నారా లోకేష్ యువగలం పాదయాత్రలో మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజులలోపే విద్యార్థుల కష్టాలు తీరుస్తామనీ విద్యార్థులకు పెండింగ్లో ఉన్న 6400 కోట్లు రూపాయలు ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలు విడుదల చేస్తామని ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారు, కానీ ఇప్పుడు మాత్రం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 18 నెలలు పూర్తయినప్పటికీ కూడా విద్యార్థులందరూ సమస్యలతో తమ విద్యను మధ్యలో దూరం చేసుకుంటున్నా గానీ నారా లోకేష్ ఏ మాత్రం కూడా పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వం మొదటిలో విద్యార్థులకు అనేక హామీలు ఇచ్చి ఇప్పుడు చేతులు దులిపేసుకుంటున్నారని,మండిపడ్డారు విద్యార్థులకు కావాల్సింది 6400 కోట్ల రూపాయలు అయితే 600 కోట్లు మాత్రమే విడుదల చేసి చేతులు దులుపుకున్నారని పేర్కొన్నారు. బడ్జెట్ సమావేశాలలో ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలకు 2600 కోట్లు కేటాయిస్తున్నట్లు ఆర్థిక శాఖ మంత్రి ప్రకటించి రాష్ట్రవ్యాప్తంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం నాయకులు సంబరాలు జరుపుకున్నారు కానీ నేటికీ 2600 కోట్ల రూపాయల డబ్బులు విద్యార్థుల ఖాతాలలో జమ కాలేదని పేర్కొన్నారు. కేవలం పేపర్ ప్రకటనలకే పరిమితమైనవే తప్ప విద్యార్థులు ఖాతాలల్లో డబ్బులు జమ కాలేదని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ ఇంజనీరింగ్ పీజీ చదువుతున్న విద్యార్థులు తమ కోర్స్ పూర్తిచేసుకుని ఫీజియంబర్స్మెంట్ అందక సర్టిఫికెట్లు కళాశాలలోని ఉండిపోవడం వలన విద్యార్థులకు ఉద్యోగాలు వచ్చినా కూడా వారు ఉద్యోగాలకు వెళ్లలేకపోతున్న పరిస్థితి ఈ రాష్ట్రంలో వచ్చిందని తెలిపారు..విద్యార్థులు కోర్స్ పూర్తి చేసుకున్న కూడా విద్యార్థులకు తమ సర్టిఫికెట్లు అందక ఉన్నత చదువులకు వెళ్లలేక బయట రాపిడో, స్విజ్జి, జొమాటో లాంటి పనులు చేసుకోవాల్సిన పరిస్థితి ఈ రాష్ట్రంలో ఏర్పడిందన్నారు.. పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో నెంబర్ 77 రద్దు చేయాలని డిమాండ్ చేశారు జీవో నెంబర్ 77 వల్ల ఉన్నత చదువులు చదవాలనుకుంటున్న విద్యార్థుల ఆశయాలు ఆవిరవుతున్నాయని పేర్కొన్నారు.

# ఇకపై రాష్ట్రంలో స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ కలెక్టర్లే బ్రాండ్ అంబాసిడర్లు

అమరావతి, డిసెంబర్ 17:

ఆంధ్రప్రదేశ్‌లో ఇక నుంచి స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్సు ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ తరహా విధానాన్నే పరిపాలనలోనూ తెస్తున్నట్టు సీఎం ప్రకటించారు. రాష్ట్ర సచివాలయంలో బుధవారం 5వ జిల్లా కలెక్టర్ల సమావేశంలో వివిధ అంశాలపై కలెక్టర్లకు సీఎం సూచనలు జారీ చేశారు. త్వరితగతిన ఫిర్యాదుల పరిష్కారంతో పాటు... జిల్లా కలెక్టర్లు, అధికారుల పనితీరును స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్సే కొలమానంగా తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."ప్రజల్లో ప్రభుత్వం పట్ల సానుకూలత, సంతృప్తి పెరిగేలా చూడాల్సిన బాధ్యత కలెక్టర్లదే. ఇళ్లు లేని పేదలు, రైతులు, మహిళలు, పిల్లలు, యువత ఇలా అన్ని వర్గాలకు మంచి చేయడం ద్వారా ప్రజల్లో సానుకూలత వస్తుంది. ప్రభుత్వ పాలనకు జిల్లా కలెక్టర్లే బ్రాండ్ అంబాసిడర్లుగా ఉంటారు. దీన్ని గుర్తుపెట్టుకుని కలెక్టర్లు పని చేయాలి. పొలిటికల్ గవర్నెన్స్ అనేది కీలకం. కొన్ని అంశాల్లో ప్రజా ప్రతినిధుల సూచనలు అమలయ్యేలా చూడాలి. అలాగే వారి సేవలను కూడా వినియోగించుకోవాలి. వివిధ జిల్లాల్లో అనుసరించే బెస్ట్ ప్రాక్టీసెస్ ఇతర ప్రాంతాల్లోనూ అమలు చేయాల్సిన అవసరం ఉంది. ప్రజల నుంచి వచ్చిన గ్రీవెన్సులను కూడా వేగంగా పరిష్కరించి పారదర్శకంగా ఆన్ లైన్‌లో ఉంచండి. లిటిగేషన్లపై ప్రజల్లో చైతన్యం పెంచి వాటిని పరిష్కరించుకునేలా అవగాహన పెంచుదాం. చేసిన అభివృద్ధి పనుల్ని ప్రజలకు తెలియచేసేలా సామాజిక మాధ్యమాల్లోనూ ప్రచారం చేయాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన పది సూత్రాలను పటిష్టంగా అమలు చేసి 15 శాతం వృద్ధి రేటు సాధనలో భాగస్వాములు కావాలని కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు.

# ఆగని పైరసీ...

హైదరాబాద్, డిసెంబర్ 17

ఐబొమ్మ రవిపై పోలీసులు 4 రకాల కేసులు నమోదు చేశారు. ఇప్పటికే అతన్ని రెండుసార్లు కస్టడీలోకి తీసుకొని ప్రశ్నించారు. అది ఏమాత్రం చాలలేదని చెబుతూ.. మళ్లీ కస్టడీ కోరారు. దాంతో కోర్టు.. 4 కేసుల్లోనూ కస్టడీకి అనుమతించింది. ఒక్కో కేసుకూ 3 రోజుల చొప్పున.. 12 రోజులు కస్టడీకి అనుమతించింది. అందువల్ల పోలీసులు గురువారం నుంచి మళ్లీ రవిని కస్టడీలోకి తీసుకొని ప్రశ్నించడం మొదలుపెడతారు. ఇదంతా ఓకే.. కానీ అసలు సమస్య సాల్వ్ అవ్వలేదు. రవి అరెస్టు తర్వాత పైరసీ ఎక్కడా ఆగలేదు. కొత్తగా రిలీజ్ అవుతున్న అన్ని సినిమాలూ ఎప్పట్లాగే పైరసీ అవుతున్నాయి. ఒక్క సినిమా కూడా పైరసీ అవ్వకుండా ఆగింది లేదు. మరి రవిని అరెస్టు చేసి పోలీసులు సాధించింది ఏంటి? అనే ప్రశ్న వస్తోంది. అసలు పైరసీ ఎందుకు ఆగట్లేదు అనేది మనం లోతుగా ఆలోచించాల్సిన విషయం. ఎందుకు అంటే.. రవి.. ఏ కొత్త సినిమానూ డైరెక్టుగా పైరసీ చెయ్యలేదు. అంటే.. థియేటర్‌కి వెళ్లి.. రహస్యంగా వీడియో రికార్డులు చెయ్యడం వంటివి రవి చెయ్యలేదు. అతను ఇతర పైరసీ సైట్ల నుంచి పైరసీ సినిమాల్ని తీసుకొని.. ఐబొమ్మ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశాడు. అందువల్ల అసలు పైరసీ సైట్లు అలాగే ఉన్నాయి. వాటిని పోలీసులు బ్రేక్ చెయ్యలేకపోతున్నారు. రవి దొరకగానే.. అతనే పైరసీ కింగ్ అని చెప్పారు. కానీ.. అతను పైరసీ మాఫియాలో చిన్న పార్ట్ మాత్రమే. మనకు ఇంకో డౌట్ రావచ్చు. ఓటీటీలో సినిమాల్ని అతను పైరసీ చేసేవాడు కదా. ఇక ఇప్పుడు ఆ పైరసీ ఆగిపోయినట్లే కదా అని. అంత లేదు. ఆ పైరసీ కూడా ఆగలేదు. రవి ఏం చేసేవాడంటే.. ఆఖీఓ టెక్నాలజీని వాడేవాడు. దీని ద్వారా ఓటీటీ సినిమాలను ప్లే చేస్తూ.. స్క్రీన్ రికార్డ్ చేసేవాడు. అదే సమయంలో.. ఆడియో కూడా రికార్డ్ అయ్యేది. అలా రికార్డ్ అయిన సినిమాల్ని ఐబొమ్మ, బొప్పం వెబ్‌సైట్లలో అప్‌లోడ్ చేశాడు. రవి అరెస్టు అయిన తర్వాత కూడా ఓటీటీ సినిమాలు పైరసీ అవుతూనే ఉన్నాయి. చాలా మంది ఆఖీఓని వాడి.. పైరసీ చేస్తున్నారు. అంటే.. రవి అనే వ్యక్తి.. ఈ పైరసీ మాఫియాలో కింగ్ కాదు. అతని అరెస్టుతో పోలీసులు సాధించేది ఏమీ లేదని తేలిపోతోంది.

# డబ్బులతో గెలిచిన సర్పంచ్ లు సేవ చేస్తారా?

## ఎన్నికలలో గెలవడానికి గ్రామాలలో లక్షల రూపాయలు ఖర్చు..

## సేవా దృక్పథంతో సామాన్య వ్యక్తి పోటీచేయలేని పరిస్థితి..రాజకీయ భవిష్యత్తు ఏమిటి?

చొప్పదండి డిసెంబర్ 17

స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేయడానికి డబ్బులు ఉంటేనే అర్హత ఉన్నట్టు ప్రస్తుతం రాజకీయాలు కనిపిస్తున్నాయి. గ్రామానికి ఏదో ఒక సేవ చేయాలనే సంకల్పం లక్ష్యం ఉన్న డబ్బులు పెట్టే స్తోమత లేని సామాన్య మధ్య తరగతి వ్యక్తులు సర్పంచ్ లుగా, ఎంపిటీసీలుగా, జడ్పీటీసీలుగా, కనీసం వార్డ్ మెంబర్లుగా కూడా పోటీ చేయలేని దుస్థితి ఏర్పడింది. ప్రజా సేవ ముసుగులో వ్యాపారం, పరువు ప్రతిష్టల కోసం లక్షాలాది డబ్బులు ఖర్చు పెట్టి పదవులను దకక్కించుకుంటున్నారు. నిజంగా ఎన్నికల కమిషన్ ఏమి చేస్తుంది అనేది ప్రశ్నార్థకంగా ఉంది.డబ్బులు మధ్యం పంచితే పోటీలో ఉన్న అభ్యర్థులు అర్హత కోల్పోతారని ఎన్నికల కమిషన్ ఎన్నో రకాలుగా హెచ్చరించినప్పటికి అసలు ఎన్నికల కమిషన్ నియమాలను తుంగలో తొక్కుతున్నారు. రాష్ట్రంలో మూడు దఫాలుగ నిర్వహించిన ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థులు ఎంత చిన్న గ్రామమైన 30 నుండి 80 లక్షల రూపాయలు ఖర్చు చేసారు. వార్డ్ మెంబర్ అభ్యర్థులు 50 వేల నుండి లక్ష రూపాయలు ఖర్చు చేసారు. అసలు ఇన్నిలక్షల రూపాయలు ఖర్చుచేస్తే సర్పంచ్ కు ప్రభుత్వం నుండి వచ్చే వేతనం 6,500 రూపాయలు, మరి ఉప సర్పంచ్ వార్డ్ మెంబర్లకు వేతనాలు లేవు.. లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి పదవులు దక్కించుకొని వ్యాపార కోణంలో ఆలోచించి ప్రజల వద్ద నుండి ఏదో రకంగా డబ్బులు గుంజి రెట్టింపు సంపాదించుకోవాడినికే రాజకీయ నాయకులు ఉన్నారు కాని సమాజ సేవ చేయడానికి లేరని పలువురు విధ్యావంతులు ముచ్చట్లు వినిపిస్తున్నాయి. ఎన్నికల సమయంలో ఖర్చు చేసే డబ్బులు మిగత కాలంలో సహాయ కార్యక్రమాలు. లేదా గ్రామంలో అభివృద్ధి పనులకు ఖర్చు పెడితే ప్రజలు వారిని గుర్తించి స్వచ్చందంగా ఓట్లు వేసి పరిస్థితి ఉంటుందికదా... ఇన్ని డబ్బులు ఖర్చు పెట్టి గెలుపు మనస్పూర్తిగా గెలుపు లాగా ఉంటుందా అనేది ఎవరికి వారు గమణించుకోవాలి. ఇలాంటి డబ్బులతో ముడిపడ్డ రాజకీయాలు సామాన్య వ్యక్తులకు అందని ద్రాక్షల మిగులుతున్నాయి. అందుకే మేధావులు, విధ్యావంతులు, సమాజ సేవకులు, స్వచ్ఛంద సేవలందించే మానవతా వాదులు రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. ఈ పరిస్థితి వల్ల భవిష్యత్తు రాజకీయాలు ఎలా ఉంటాయో అనేది ప్రశ్నార్థకంగా మిగిలి ఉంది. ఏది ఏమైనా ప్రజల ఆకాంక్షలను గ్రామంలో ఉన్న సమస్యలు పరిష్కారం చేసేందుకు నూతనంగా గెలిచిన సర్పంచ్ లు, వార్డ్ మెంబర్లు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది..

# లవ్ ఇండియా 2025' ఫ్యాషన్ షో

20నభారతీయ చరిత్ర, సంస్కృతి, ఆధునిక జీవనశైలిని ప్రతిబింబించేలా లఖోటియా కాలేజ్ ఆఫ్ డిజైన్ అధ్వర్యంలో ఈనెల 20న హైదరాబాద్ మొయినాబాద్లోని అమల్దాస్ పోర్ట్లో జాతీయ స్థాయి 'లవ్ ఇండియా 2025' ఫ్యాషన్ షో నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక చైర్మన్ అజహర్ లఖోటియా కాలేజ్ ఆఫ్ డిజైన్లో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ ఎండీ అఫాన్ లఖోటియా, డైరెక్టర్ (ఆపరే షన్స్) రహిల్ లఖోటియా, టయోటా సంస్థ ప్రతినిధి శివతో కలిసి ఫ్యాషన్ షో గోడపత్రికను ఆవిష్కరించారు. 50 మందికి పైగా డిజైనర్లు రూపొందించిన విభిన్న వస్త్రోత్పత్తులను.. ప్రదర్శించనున్నట్లు చెప్పారు. మిస్ ఇండియా తెలంగాణ 2023 ఊర్మిళ చౌహాన్ విద్యార్థినులతో కలిసి ర్యాండ్వాక్ చేసి సందడి చేశారు.

# డబ్బులు పంచేందుకు వచ్చిన కాంగ్రెస్ నేతలను తరిమికొట్టిన గ్రామస్తులు

మంచిర్యాల డిసెంబర్ 17

సర్పంచ్ ఎన్నికల్లో డబ్బులు పంచేందుకు వచ్చిన కాంగ్రెస్ నాయకులను గ్రామస్తులు తరిమికొట్టారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం బాపురావ్ పేట్ గ్రామంలో మూడవ విడత పంచాయతీ ఎన్నికల కోసం ప్రజలకు డబ్బులు పంచేందుకు కాంగ్రెస్ నాయకులు వచ్చారు. గ్రామంలో ఒక్కరికి కూడా ఇందిరమ్మ ఇల్లు రాలేదు, ఒక్కసారి కూడా మమ్మల్ని పట్టించుకోకుండా ఎన్నికల అప్పుడు వచ్చి డబ్బులు ఇస్తారా అంటూ కాంగ్రెస్ నాయకులను గ్రామస్తులు తరిమికొట్టారు.

==============================

# నిలకడ వృద్ధిని నమోదు చేస్తున్న దేశ ఆర్థిక వ్యవస్థ

హైదరాబాద్ డిసెంబర్ 17

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) 7.2-7.3 శాతం మధ్యన ఉండొచ్చని బ్రిక్వర్క్ రేటింగ్ అంచనా వేస్తోంది. గడచిన కొన్ని త్రైమాసికాలుగా దేశీయ ఆర్థిక వ్యవస్థ నిలకడగా వృద్ధిని నమోదు చేస్తూ వస్తోందని, రానున్న కాలంలో అదే జోరును కనబరిచే వీలుందని బ్రిక్వర్క్ రేటింగ్ సీఈఓ మను సెహగల్, చీఫ్ రేటింగ్ ఆఫీసర్ కేహెచ్ పట్నాయక్ తెలిపారు. ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడులు, వినియోగం పెరగటంతో పాటు ఇటీవలి జీఎ?సటీ సంస్కరణలు, వడ్డీ రేట్ల తగ్గింపు వంటి అంశాలు వృద్ధికి చోదక శక్తులుగా నిలవనున్నాయని వారు పేర్కొన్నారు. కాగా 2026-27 ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు 6.5-7 శాతం మధ్యన ఉండే అవకాశం ఉందని పట్నాయక్ తెలిపారు. మరోవైపు తెలంగాణ రాష్ట్రం కూడా వృద్ధి పథంలో పయనిస్తోందని, రానున్న సంవత్సరాల్లో ఏటా 12-13 శాతం వృద్ధితో 2034 నాటికి లక్ష కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అవతరించే వీలుందన్నారు.

==========================

# టోఫెల్ ఐబీటీ లో సంస్కరణలు

హైదరాబాద్ డిసెంబర్ 17

ప్రపంచవ్యాప్తంగా ఇంగ్లిష్ భాషా నైపుణ్యాన్ని న్యాయపరంగా, సులభంగా, తగిన ప్రమాణాలతో పెంపొందించే క్రమంలో టోఫెల్ ఐబీటీ పరీక్షలో దశలవారీగా సంస్కరణలు ప్రవేశపెట్టనున్నట్లు అంతర్జాతీయ ఈటీఎస్ (ఎడ్యుకేషనల్ టెస్టింగ్ సర్వీస్) సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిద్ని రోడ్రిగస్ డిసౌజ వెల్లడించారు. హైదరాబాద్ బేగంపేటలోని విలేకరులతో ఆయన మాట్లాడుతూ... 'తాజాగా టోఫెల్ ఐబీటీ పరీక్ష విధానంలో మార్పులు చేశారు. ఇకపై పరీక్ష ఫలితాలు 72 గంటల్లోనే అందుబాటులోకి రానున్నాయి. ఇంటి నుంచే పరీక్ష రాసే అభ్యర్థులకు మరింత భద్రత, సహకార వాతావరణం కల్పించేలా ఈటీఎస్ ద్వారా శిక్షణ పొందిన ఇన్హౌస్ ప్రాక్టర్లు, ఏఐ ఆధారిత గుర్తింపు నిర్ధారణ విధానాన్ని అమలు చేయనున్నారు. వచ్చే ఏడాది జనవరి నుంచి చదవడం, వినడం వంటి విభాగాల్లో మల్టీస్టేజ్ ఎడాప్టివ్ టెస్టింగ్ విధానాన్ని ప్రవేశపెట్టనున్నారు. అభ్యర్థి ప్రతిభ ఆధారంగా ప్రశ్నల కఠినత మారే విధానం, వాస్తవ అకడమిక్ ఇంగ్లిష్ వినియోగాన్ని తప్పనిసరి చేయనున్నారు. పరీక్ష స్కోర్, రిపోర్టింగ్లోనూ మార్పులు చోటు చేసుకోనున్నాయి. ప్రసుత్తం ఉన్న 0-120 స్కేల్తోపాటు సీఈఎస్ఆర్ ప్రమాణాలకు అనుగుణంగా 1-6 బ్యాండ్ స్కేల్నుకూడా ప్రవేశపెట్టనున్నారు. తద్వారా ప్రపంచవ్యాప్తంగా విద్యాసంస్థలు, విద్యార్థులు, టోఫెల్ స్కోర్లను సులభంగా అర్థం చేసుకోవచ్చు' అని ఆయన తెలిపారు.

# తెలంగాణ తల్లి విగ్రహాన్ని కింద పడేశారు అనేది తప్పుడు ప్రచారం

హైదరాబాద్ డిసెంబర్ 17 తెలంగాణ తల్లి విగ్రహాన్ని కింద పడేశారు అనేది తప్పుడు ప్రచారమని రోడ్లు భవనాలు శాఖ వివరణ ఇచ్చింది. భారత్ ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్ వేదికగా అన్ని జిల్లాల కలెక్టరేట్లో ముఖ్యమంత్రి శ్రీ ఏ.రేవంత్ రెడ్డి గారు వర్చువల్ గా తెలంగాణ తల్లి విగ్రహా ఆవిష్కరణ చేశారు.

# మహిళలకు ఆదాయం, నైపుణ్యం, పర్యావరణ పరిరక్షణ పై శిక్షణ

## ఎంపీ కేశినేని శివనాథ్ ఆధ్వర్యంలో వేప, తేనె ఉత్పత్తులపై 2వ రోజు నైపుణ్య శిక్షణ

విజయవాడ డిసెంబర్ 17

ఎంపీ కేశినేని శివనాథ్ సారథ్యంలో, కేశినేని ఫౌండేషన్ మరియు ఎన్.ఐ.ఆర్.డి సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాదు ఎన్.ఐ.ఆర్.డి లో ఐదు రోజుల నైపుణ్యాభివృద్ధి శిక్షణ కొనసాగుతోంది. మంగళవారం రెండో రోజు, మూడవ బ్యాచ్ కు చెందిన శిక్షణ తరగతులు కొనసాగాయి.. ఎన్టీఆర్ జిల్లాకు చెందిన 45 మంది ఎస్.హెచ్.జి మహిళలు శిక్షణ పొందుతున్నారు. వీరిలో వర్మి కంపోస్టింగ్, నేచురల్ ఫార్మింగ్ లో 30 మందికి , తేనే తయారీ లో 15 మంది మహిళలు శిక్షణ తీసుకుంటున్నారు. ఈ రెండో రోజు శిక్షణలో మహిళలు వేప , తేనె ఉత్పత్తుల ద్వారా ఆదాయ మార్గాలు, పర్యావరణ పరిరక్షణ అంశాలతోపాటు వాటికి సంబంధించిన నైపుణ్యాలు అభివృద్ధి చేసుకున్నారు. డిసెంబర్ 15 నుంచి ప్రారంభమైన ఈ శిక్షణ డిసెంబర్ 19వ వరకు కొనసాగుతోంది.

వర్మి కంపోస్టింగ్, నేచురల్ ఫార్మింగ్ శిక్షణ కి సంబంధించి రెండవ రోజు శిక్షణలో భాగంగా కరువు పీడిత ప్రాంతాల అభివృద్ధి సంఘం (ఎస్.డి.డి.పి.ఎ) ఎమ్.శ్రీనివాస్- వేప చెట్టు ఉత్పత్తుల నుంచి ఆదాయ మార్గం, పర్యావరణ ప్రాధాన్యత, నాణ్యత గల వేప గింజలు గుర్తింపు, వాటి నిల్వ / ఎండబెట్టే పద్ధతులు, మార్కెటింగ్ విధానం, ప్యాకేజింగ్, లేబెలింగ్, చిన్న స్థాయి వ్యవసాయ ప్రాసెసింగ్ కోసం ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై అవగాహన శిక్షణ తరగతులు నిర్వహించారు.

తరువాత వేప గింజల నుంచి నూనె తీసే విధానం పై ప్రాక్టికల్ గా శిక్షణ ఇచ్చారు. వాటిని శుభ్రపరచడం, అవసరమైన వాటికి గుజ్జు తొలగించడం , గ్రైండింగ్ చేయడం నేర్పించారు. చిన్న స్థాయి ఆయిల్ ఎక్స్పెల్లర్ మిషన్ ఎలా పనిచేస్తుందో ప్రత్యక్షంగా చూపించారు. ఇక్కడ వేప నూనె తయారీ, వేప కేక్ (ఎరువులకీటకనాశినిగా ఉపయోగం), వేప పోడి తయారీ ఎలా చేయాలో శిక్షణ ఇచ్చారు. ప్రస్తుత పరిస్థితుల్లో మట్టి ఆరోగ్యం మెరుగుపరచడం కోసం బయోచార్ ఉత్పత్తిని అభివృద్ధి చేయడంపై కూడా శిక్షణ ఇవ్వటం జరిగింది.

ఇక తేనే తయారీకి సంబంధించి అపికల్చర్ టెక్నాలజీ సెంటర్ కి చెందిన అధికారి రవీంద్ర కుమార్, సీతారత్నం నేతృత్వంలో తేనేటీగల సమూహం, వాటి శరీర నిర్మాణం, జీవశాస్త్రం గురించి అవగాహన శిక్షణ తరగతులు నిర్వహించారు. అలాగే తేనేటీగల లింగ పరిశీలన, కాంబ్ (గూడు) నిర్మాణ పరిశీలన, బ్రూడ్ (పిల్ల తేనేటీగలు) పరిశీలన పై స్వయంగా శిక్షణ అందించారు. ఈ మేరకు ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది

# జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేయాలనేదే బి జే పి ప్రభుత్వ ఉద్దేశం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

సికింద్రాబాద్ డిసెంబర్ 17

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (యంజీ నరేగా) పథకాన్ని రద్దు చేసి వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అజీ వికామిషన్ - గ్రామీణ్ ( వీబీ - జీ - రామ్ - జీ) పేరుతో బిల్లును లోక్ సభ లో ప్రవేశపెట్టడాన్ని,ఈ పథకంలో గాంధీజీ పేరును తొలగించడాన్ని నిరసిస్తూ సికింద్రాబాద్ ఆఅఅ అధ్యక్షులు దీపక్ జాన్ గారి ఆధ్వర్యంలో సికింద్రాబాద్ ఓఉ రోడ్ లోని గాంధీజీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు.ఈ ధర్నా లో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ పాల్గొని, కేంద్రంలోని బి జే పి ప్రభుత్వం జాతిపిత మహాత్మాగాంధీ గారి పట్ల చూపిస్తున్న వివక్షను, ద్వేషాన్ని ఖండించారు.అనంతరం మిడియాతో మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేయాలనే దురుద్దేశంతో ఉందని అన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు కనీస పని దినాలు కల్పించాలనే ఉద్దేశంతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టిందని,

ఇంతకుముందు ఈ పథకం రాష్ట్ర ప్రభుత్వాల అధీనంలో ఉందని, నేడు బిజెపి ప్రభుత్వం రాష్ట్రాల హక్కులు హరించి కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోకి తెచ్చుకోవాలనే దురుద్దేశంతో ఈ పథకంలో మార్పులు చేపట్టిందని, అలాగే ఈ దేశానికి స్వాతంత్రం తీసుకు వచ్చిన మహాత్మా గాంధీ గారి పేరు కూడా తొలగించాలని చూస్తుందని, కావున ఈ బిల్లును కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, పీసీసీ ఆదేశాల మేరకు ఈరోజు జిల్లాలలో జరిగిన ధర్నాలు రేపు గ్రామస్థాయి వరకు విస్తరిస్తాయని, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పి పాత పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.

ఈ ధర్నా కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీగణేష్ తో పాటు పాటు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, సికింద్రాబాద్,సనత్ నగర్ ఇంఛార్జ్ లు ఆదం సంతోష్ కుమార్,కోట నీలిమ మరియు కంటోన్మెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# టీటీడీకి రూ.1.20 కోట్లు విలువైన బ్లేడ్లు విరాళం

తిరుమల, డిసెంబర్ 17

హైదరాబాద్ కు చెందిన వర్టీస్ గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ డైరెక్టర్ శ్రీ శ్రీధర్ బోడుపల్లి బుధవారం టీటీడీకి ఏడాదికి సరిపడా రూ.1.20 కోట్లు విలువైన సిల్వర్ మాక్స్ హాఫ్ బ్లేడ్లలను విరాళంగా అందించారు. ఈ మేరకు దాత తిరుమలలోని టీటీడీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో చైర్మన్ బీ.ఆర్.నాయుడుకు బ్లేడ్లను అందజేశారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ భక్తులు తలనీలాలు సమర్పించేందుకు బ్లేడ్ల కోసం టీటీడీ ఏడాదికి రూ.1.16 కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. రోజుకు 40 వేల హాఫ్ బ్లేడ్లను కల్యాణకట్టల్లో వినియోగిస్తున్నామన్నారు. ఒక ఏడాదికి టీటీడీకి సరిపడా బ్లేడ్లను విరాళం ఇచ్చేందుకు ముందుకు రావడం గొప్ప విషయమని దాతను చైర్మన్ అభినందించారు.ఈ సందర్భంగా దాత శ్రీ శ్రీధర్ బోడుపల్లి మాట్లాడుతూ వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా హాఫ్ బ్లేడ్లను అందుబాటులోకి తీసుకువచ్చిన సంస్థ తమదేనని అన్నారు. ఈ హాఫ్ బ్లేడ్ల వల్ల కల్యాణకట్టలో భక్తులకు తలనీలాలు తీసేందుకు క్షురకులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. తమ సంస్థ తయారు చేసిన బ్లేడ్లకు యూరప్, అమెరికాతో సహా 52 దేశాల్లో మంచి డిమాండ్ ఉందన్నారు. 7'ఓ క్లాక్ సంస్థ బ్లేడ్లను కూడా తామే ఉత్పత్తి చేస్తున్నట్లు తెలియజేశారు.

# పాతబస్తీలో మయన్మార్ దేశస్థుడి హత్య

బాలాపూర్ డిసెంబర్ 17

రాచకొండ కమిషనరేట్ పాతబస్తీలో స్థానికులు వరస హత్యలతో భయభ్రాంతులకు గురౌతున్నారు. మొన్న షాహిన్ నగర్ ప్రాంతంలో రౌడిషీటర్ అమేర్ హత్య మరవకముందే తాజాగా ముర్షీద్ అలం అనే వ్యాపారి హత్య జరిగింది. రాచకొండ కమిషనరేట్ పరిధి బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ముర్షీద్ అలం అనే వ్యక్తి దారుణ హత్య కు గురయ్యాడు. రాయల్ కాలనీలో నివాసం ఉండె ముర్షీద్ అలం అనే వ్యక్తి పై కత్తులతో అబ్దుల్లా అనే వ్యక్తి దాడి చేసి హత్య చేసాడు. ముర్షీద్ అలంకు తీవ్ర గాయాలు కావడంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బాలాపూర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు హత్యకు సంబంధించిన అధారాలకోసం క్లూస్ టీం లను రంగంలోకి దింపారు. ముర్షీద్ అలం ఓల్డ్ స్క్రాప్ వ్యాపారం చేస్తుంటాడు. ఏదో విషయంలో అబ్దాల్లా ముర్షీద్ మధ్య గోడవ జరిగింది. గొడవ కాస్త పెద్దది కావడంతో హత్యకు దారి తీసింది . ముర్షీద్ అలం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. మృతుడు భర్మా దేశానికి చెందిన వాడుగా గుర్తించారు.

నింధితుడు అబ్దుల్లా కోసం ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు .

# ఇన్నోవా కారు భీభత్సం ఒకరు మృతి

రంగారెడ్డి

మైలార్ దేవుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఇన్నోవా కారు భీభత్సం సృష్టించింది. ఓవర్ స్పీడ్ తో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న దుప్పట్లు,రగ్గులు అమ్మే దుకాణంలో నిద్రిస్తున్న తండ్రి కుమారుల మీదికి కారు దూసుకెళ్లింది. ప్రమాదంలో కుమారుడు దీపక్ మృతి చెందాడు. తండ్రి ప్రభు మహారాజ్ , సోదరుడు సత్తునాథ్ కు తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. బుధవారం తెల్లవారుజామున 5 గంటలకు ఘటన జరిగింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. బాధితులు త్తరప్రదేశ్ నుంచి వలస వచ్చి వ్యాపారం నిర్వహిస్తున్నారు. కారు శంషాబాద్ నుంచి సంతోష్ నగర్ వెళ్తుంది. ఘటనలో ముగ్గరు పరారీ లో వున్నారు. మరో ముగ్గరిని అదుపులోకి తీసుకున్నారు.

# అందరం కలిసి గ్రామ అభివృద్ధికి కృషి చేద్దాం....

## యువ నాయకులు బొలిశెట్టి రాజేష్....

తాడేపల్లిగూడెం... డిసెంబర్ 17

కూటమి నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసి మీనావల్లూరు గ్రామాభివృద్ధికి కృషి చేయాలని జనసేన యువనేత బొలిశెట్టి రాజేష్ అన్నారు. పెంటపాడు మండలం మీన వల్లూరు గ్రామానికి చెందిన వైసిపి, మరి కొంతమంది తటస్తులు నాయకులు బొలిశెట్టి రాజేష్, తోట రాజా ఆధ్వర్యంలో , గుబ్బల ఆర్లయ్య, లంక గణపతి, నీల నాగ మల్లయ్య, వీరితో పాటు 150 మంది జనసేనలో చేరారు. స్థానిక జనసేన కార్యాలయంలోఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో రాజేష్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రజల సంక్షేమం కోసం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ చేస్తున్న కృషికి మద్దతుగా ఎంతోమంది ఎంతోమంది జనసేనలో చేరుతున్నారని అన్నారు. ముఖ్యంగా జనసేన టిడిపి బిజెపి ఓటమికి చెందిన నాయకులు గాని, కార్యకర్తలు గాని కూటమి నుంచి బయటకు వెళ్లకుండా వారికి అండగా నిలిచే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. జనసేన లో కొత్తగా చేరుతున్న వారితో జనసేన సీనియర్ కార్యకర్తలు,నాయకులు అన్నదమ్ములుగా కలిసి పని చేస్తారని ఆయన తెలియజేశారు.


# నిర్మల్ జిల్లా కుబీర్ మండలంలో ఉత్సాహంగా గ్రామపంచాయతీ ఎన్నికలు.



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 17 (భారత శక్తి) : కుబీర్ మండలంలోని నూతనంగా ఏర్పడిన గ్రామపంచాయతీకి సర్పంచ్ ఎన్నికల సందర్భంగా గ్రామ ప్రజలు ఎంతో ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. ప్రజాస్వామ్య పండుగను తలపించేలా గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొంది.

ఈ సందర్భంగా రంజీనీ తాండకు చెందిన హరిలాల్ తన కుమారుడు తన కుటుంబ సభ్యులతో కలిసి పోలింగ్ కేంద్రానికి చేరుకుని తమ అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీ ఏర్పాటు చేయడంతో గ్రామాభివృద్ధిపై ప్రజల్లో నూతన ఆశలు చిగురించాయి. తండ్రి–కొడుకులు సహా గ్రామ ప్రజలంతా బాధ్యతాయుత తమ అమూల్యమైన ఓటును వినియోగించుకున్నారు.

# రంజిని తాండ నూతన గ్రామపంచాయతీకి సర్పంచ్‌గా జాదవ్ సవితాబాయి.



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 17 (భారత శక్తి): కుబీర్ మండలంలోని రంజిని తాండ నూతనంగా గ్రామపంచాయతీగా ఏర్పడిన నేపథ్యంలో తొలిసారి నిర్వహించిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో జాదవ్ సవితాబాయి బన్సీలాల్ సర్పంచ్‌గా, రంగారావు ఉప సర్పంచ్‌గా ఘన విజయం సాధించారు.గ్రామ ప్రజలు భారీ మెజారిటీతో ఓటు వేసి వీరిని గెలిపించడంతో గ్రామంలో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. నూతనంగా ఏర్పడిన గ్రామపంచాయతీకి తొలి సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన జాదవ్ సవితాబాయి మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి గెలిపించిన గ్రామ ప్రజలందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

అదేవిధంగా ఉప సర్పంచ్ రంగారావు కూడా గ్రామ ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు. గ్రామ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామని, మౌలిక సదుపాయాల కల్పనతో పాటు గ్రామ సంక్షేమానికి కృషి చేస్తామని సర్పంచ్, ఉప సర్పంచ్ తెలిపారు.

నూతన గ్రామపంచాయతీ ఏర్పాటుతో రంజిని తాండ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు – జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి. ప్రావీణ్య

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 17 :

జిల్లాలో నిర్వహించిన గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా పూర్తవ్వడంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి. ప్రావీణ్య హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా అంకితభావంతో పనిచేసిన రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, పోలింగ్ అధికారులు, ఇతర ఎన్నికల సిబ్బంది, పోలీస్ శాఖ, రవాణా శాఖ, విద్యుత్ శాఖ, వైద్య ఆరోగ్య శాఖతో పాటు ఇతర సంబంధిత శాఖల అధికారుల సహకారం అభినందనీయమని

తెలిపారు.అలాగే ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేలా సహకరించిన అభ్యర్థులు, మీడియా ప్రతినిధులకు శాంతియుతంగా ఓటు హక్కు వినియోగించుకున్న ఓటర్లకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు.


ప్రజాస్వామ్య పండుగగా నిలిచిన గ్రామ పంచాయతీ ఎన్నికలనువిజయవంతంగా పూర్తిచేయడంలో అందరి సహకారం కీలకమైందని కలెక్టర్ పేర్కొన్నారు.



# సుడా చైర్మన్ ఆధ్వర్యంలో మంత్రులు దుద్దిళ్ల, పొన్నంలను కలిసిన సర్పంచులు

కరీంనగర్, డిసెంబర్ 17(భారతశక్తి ప్రతినిధి):

కరీంనగర్ అసెంబ్లీ నియోజవర్గానికి మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన చెందిన సర్పంచులు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్ లో రాష్ట్ర ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ లను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రులు గెలిచిన సర్పంచులను అభినందించి ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని అర్హత ఉన్న ప్రతి ఒక్క లబ్ధిదారుడికి పథకాలు అమలయ్యే విధంగా చూడాలని సూచించారు. గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని ఏఏ గ్రామాలకు ఎన్ని నిధులు అవసరమో అంచనాలు రూపొందించి ఇవ్వాలని సూచించారు. సర్పంచుల గెలుపుకు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి చేసిన కృషి అభినందనీయమని పేర్కొన్నారు. మంత్రులను కలిసిన వారిలో



చర్లభూత్కూర్, చామనిపల్లి, దుబ్బపల్లి, బహదూర్ఖాన్ పేట్, జూబ్లీ నగర్, ఎలబోతారం, ఫకీర్ పేట్, చేగుర్తి, నల్లగుంట పల్లె సర్పంచులు, ఉపసర్పంచులు, కాంగ్రెస్ నాయకులు పంజాల స్వామి గౌడ్, పెంచాల లక్ష్మణ్ రావు, బుర్ర నారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం సహకరించాలి



ఖమ్మం బ్యూరో, భారత శక్తి, డిసెంబర్ 17 : ఖమ్మం జిల్లాలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాల్లో పనిచేస్తున్న జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ లక్ష్యంగా పనిచేస్తున్న తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (టిడబ్ల్యూజెఎఫ్ %ఎ%-2843) ఖమ్మం జిల్లా నూతన కమిటీ సభ్యులు బుధవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అవినాష్ దురిశెట్టిని మర్యాద పూర్వకంగా కలిశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన జిల్లా అధ్యక్షులు టి సంతోష్ చక్రవర్తి నేతృత్వంలో ఈ భేటీ జరిగింది. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా కమిటీ నూతనంగా ఎన్నికైన విషయాన్ని తెలియజేస్తూ, జిల్లా కలెక్టర్ కి నియామక పత్రాన్ని అధికారికంగా అందజేశారు. అనంతరం ఖమ్మం జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు మంజూరు చేయడం, ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారం, సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్ పథకం అమలు, మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలకు తగిన ఎక్స్‌గ్రేషియా మంజూరు వంటి అంశాలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు టి సంతోష్ చక్రవర్తి మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమని, ప్రజా సమస్యలను నిర్భయంగా వెలుగులోకి తీసుకురావాలంటే జర్నలిస్టులకు భద్రతతో పాటు సంక్షేమం కూడా అవసరమని తెలిపారు. జర్నలిస్టుల సమస్యలు పరిష్కారమైతే పాలన మరింత పారదర్శకంగా, ప్రజలకు మరింత చేరువగా మారుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

దీనికి స్పందించిన జిల్లా కలెక్టర్ అవినాష్ దురిశెట్టి, జర్నలిస్టులు ప్రజలకు%-%ప్రభుత్వానికి మధ్య వారధులని పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, నిబంధనల మేరకు సాధ్యమైన పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జిల్లా అభివృద్ధి కార్యక్రమాల్లో మీడియా సహకారం ఎల్లప్పుడూ అవసరమని ఆయన తెలిపారు. ఈ భేటీలో టిడబ్ల్యూజెఎఫ్ జిల్లా సెక్రటరీ నానబాల రామకృష్ణ, కోశాధికారి అర్వపల్లి నగేష్, జిల్లా ఉపాధ్యక్షులు అంతోటి శ్రీనివాస్, మందడపు మనోహర్, వేల్పుల నాగేశ్వర రావు, (టీబీజేఏ) జిల్లా అధ్యక్షులు వీ. సామ్రాట్ గుప్తా, కార్యవర్గ సభ్యులు ఉపేంద్ర, శ్రీధర్, మధు, కే. నాగకృష్ణ, ఎం. కిరణ్, సీనియర్ జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేను కలిసిన నూతన సర్పంచ్ లు



సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 17 :

గ్రామ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగాలని తన పూర్తి మద్దతు సహకారం ఉంటుందని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పేర్కొన్నారు.ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన ఇరిగిపల్లి గ్రామ సర్పంచ్ సుప్రియ - సతీష్, గుంతపల్లి సర్పంచ్ అనంత రెడ్డి లు ఎమ్మెల్యే ను మర్యాదపూర్వకంగా సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిశారు.ఎమ్మెల్యే వారికి శాలువాతో సన్మానించి, పుష్ప గుచ్ఛంతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామల అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.బిఆర్ఎస్ పాలనలో గ్రామ పంచాయతీలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని గుర్తు చేశారు... రానున్నది బిఆర్ఎస్ ప్రభుత్వమని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సి డి సి విజేందర్ రెడ్డి ఆర్.వెంకటేశ్వర్లు, పీ.నర్సింలు ,మాజీ జడ్పీటీసీ కొండల్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు చక్రపాణి, సందీప్, జలంధర్ , పంచాయతీ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో పంచాయితి పోరు ప్రశాంతం: జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, డిసెంబర్ 17(భారతశక్తి ప్రతినిధి):

జిల్లాలో మూడు దశల్లో జరిగిన పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయని, మొదటి, రెండవ విడత ఎన్నికల మాదిరిగానే చివరి విడత ఎన్నికల పోలింగ్ సజావుగా పూర్తయిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు.మూడో విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ లో భాగంగా జిల్లాలోని వి. సైదాపూర్ మండలం దుద్దెనపల్లి ఎలబోతారం, హుజురాబాద్ మండలంలోని తుమ్మనపల్లి గ్రామాల్లో పోలింగ్ స్టేషన్లను పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ సందర్శించారు. పోలింగ్ నిర్వహణను, ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. పోలింగ్ స్టేషన్ ఆవరణలో పోటీలో ఉన్న సర్పంచి, వార్డు సభ్యుల అభ్యర్థుల జాబితాను పరిశీలించారు. ఓటరు జాబితాలో ఓటర్ల క్రమ సంఖ్య సరిచూసుకొని ఓటింగ్ ప్రక్రియను నిర్వహించాలని ప్రిసైడింగ్ అధికారులకు సూచించారు. గ్రామ పంచాయతీల పరిధిలో ఓటర్ల సంఖ్య, అప్పటి వరకు నమోదైన పోలింగ్ శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ శాతం ఎప్పటికప్పుడు నిర్దేశిత ఫార్మాట్లో నమోదు చేయాలనీ, ఆన్లైన్లో నివేదికలు సమర్పించాలని రిటర్నింగ్ అధికారిని ఆదేశించారు. మధ్యాహ్నం ఒంటి గంటలోపు పోలింగ్ కేంద్రం ఆవరణలో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న వారందరికీ ఓటు సద్వినియోగం చేసుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. ఒకటి తర్వాత ఎట్టి పరిస్థితుల్లో పోలింగ్ కేంద్రం గేటు లోపలికి అనుమతించకూడదనీ కలెక్టర్ ఎన్నికల అధికారులను ఆదేశించారు.

3వ విడతలో 86.42% పోలింగ్

మూడో విడత పంచాయతీ ఎన్నికల్లో మొత్తంగా 86.42%



ఓట్లు పోలయ్యాయి. మండలాల వారీగా పరిశీలిస్తే ఇల్లందకుంట లో 87.05%, హుజరాబాద్ లో 85.04, జమ్మికుంట లో 85.72 వీణవంక 85.87 సైదాపూర్ 87.85 శాతంగా నమోదయింది.

కౌంటింగ్ ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్×

మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ పూర్తయిన తర్వాత కౌంటింగ్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. జమ్మికుంట మండలం మాచినపల్లి, జగ్గయ్యపల్లి గ్రామాల్లో కౌంటింగ్ ప్రక్రియను పరిశీలించారు. వీణవంక మండలం రెడ్డిపల్లి, చల్లూరు, మామిడాలపల్లి లోను కౌంటింగ్ విధానాన్ని పర్యవేక్షించారు.అధికారులకు పలు సూచనలు చేశారు. అభ్యర్థులు లేదా ఏజెంట్ల సమక్షంలో నిష్పక్షపాతంగా కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించాలని తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయి ఫలితాలు వెల్లడించే వరకు ఎన్నికల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ఎన్నికల సంఘం నియమ నిబంధనల ప్రకారం కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించాలని, ఎలాంటి పొరపాట్లకూ అవకాశం ఇవ్వరాదని కలెక్టర్ ఆదేశించారు.




# 134 కోట్ల మంది ఆధార్ డేటా సేఫ్..

## పార్లమెంట్‌కు తెలిపిన కేంద్రం




దిల్లీ: భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ డేటా బేస్ నుంచి ఆధార్‌కార్డు హోల్డర్ల డేటా దుర్వినియోగం జరగలేదని కేంద్రం స్పష్టంచేసింది. అధునాతన భద్రతా చర్యల కారణంగా పౌరుల ఆధార్ డేటా సురక్షితంగా ఉందని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌కు వెల్లడించింది. ఈ మేరకు కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద లోక్‌సభలో ఓ ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. 'ప్రపంచంలోనే అతిపెద్ద బయోమెట్రిక్ గుర్తింపు వ్యవస్థ అయిన ఉడాయ్‌లో సుమారు 134 కోట్ల మంది ఆధార్ హోల్డర్లు ఉన్నారు. ఇప్పటి వరకు 16వేల కోట్ల అథంటేకేషన్ లావాదేవీలు జరిగాయి'' అని కేంద్రమంత్రి తన సమాధానంలో వెల్లడించారు. బలమైన సాంకేతిక, సంస్థాగత భద్రతా చర్యల కారణంగా ఆధార్ డేటా సురక్షితంగా ఉందని తెలిపారు. ఆధార్ డేటా భద్రతకు ఉడాయ్.. డిఫెన్స్ ఇన్ డెప్త్ విధానాన్ని అనుసరిస్తూ బహుళ అంచెల భద్రతా వ్యవస్థను అమలు చేస్తోందన్నారు. ఇందులో ఒక లేయర్ దెబ్బతిన్నా.. మిగిలినవి డేటాకు రక్షణ కల్పిస్తాయని చెప్పారు. ఆధార్ డేటా బదిలీ, స్టోరేజీ సమయంలో అధునాతన ఎన్‌క్రిప్షన్ టెక్నాలజీని వినియోగిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. నేషనల్ క్రిటికల్ ఇన్ఫర్మేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రొటెక్షన్ సెంటర్ పర్యవేక్షణలో ఆధార్ వ్యవస్థ సురక్షితంగా ఉందని తెలిపారు. ఇది ఎప్పటికప్పుడు ఆధార్ సైబర్ సెక్యూరిటీకి సంబంధించి సూచనలు చేస్తుంటుందని పేర్కొన్నారు. దీనికితోడు స్వతంత్ర ఆడిట్ ఏజెన్సీలు కూడా ఆధార్ ఎకోసిస్టమ్‌ను నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని తెలిపారు.

# దమానీని వెనక్కి నెట్టిన దీపిందర్..

## టాప్3లో ఇండిగో వ్యవస్థాపకులు!



ముంబయి: ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగో వ్యవస్థాపకులు రాహుల్ భాటియా, రాకేశ్ గంగ్వాల్ హురున్ ఇండియా జాబితాలో తొలిసారి చోటు దక్కించుకున్నారు. స్వయంకృషిలో ఎదిగిన వ్యాపారవేత్తల జాబితాలో మూడో స్థానంలో నిలిచారు. వీరు నెలకొల్పిన ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ మార్కెట్ విలువ రూ.2.2 లక్షల కోట్లుగా హురున్ లెక్కగట్టింది. జొమాటో మాతృ సంస్థ ఎటెర్నల్ సీఈఓ దీపిందర్ గోయల్ ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలిచారు. ఆయన స్థాపించిన ఎటర్నల్ రూ.3.2 లక్షల కోట్ల మార్కెట్ విలువను సాధించింది. ఏడాదిలో 27 శాతం వృద్ధిని నమోదు చేసింది. దీంతో డీమార్ట్ అధినేత రాధాకృష్ణ దమానీని దీపిందర్ వెనక్కి నెట్టారు. ఇదే కాలంలో అవెన్యూ సూపర్‌మార్ట్స్ మార్కెట్ విలువ 13 శాతం క్షీణించి రూ.3 లక్షల కోట్లకు పరిమితమైంది. ఈ మేరకు ఐడీఎఫ్‌సీ ఫస్ట్ ప్రైవేట్, హురున్ ఇండియా టాప్200 వ్యాపారవేత్తల జాబితా, 2025ని విడుదల చేసింది.

* ఈ ఏడాది సెప్టెంబర్ 25 వరకు ఉన్న మార్కెట్ విలువలను ప్రామాణికంగా తీసుకుని ఈ జాబితాను రూపొందించారు. ఇటీవల ఇండిగో సంక్షోభం నేపథ్యంలో కంపెనీ షేర్లపై ప్రభావం పడింది. అయినప్పటికీ.. దేశీయ విమానయాన రంగంలో 65 శాతం మార్కెట్ వాటాతో ఇండిగో అగ్రగామిగా ఉందని హురున్ పేర్కొంది. అధునాత పద్ధతులతో అంతర్జాతీయంగానూ విస్తరిస్తోందని తెలిపింది.
* ఈ జాబితాలో దీపిందర్ తొలిసారి స్థానం దక్కించుకున్నారు. ఆయన ప్రారంభించిన జొమాటో దేశవ్యాప్తంగా 800 నగరాల్లో సేవలందిస్తోందని నివేదిక పేర్కొంది. పోటీ కంపెనీ స్విగ్గీ సహ వ్యవస్థాపకుడు శ్రీహర్ష మాజేటి, నందన్ రెడ్డి ఈ జాబితాలో ఐదో స్థానంలో ఉన్నారు. ఈ కంపెనీ మార్కెట్ విలువ రూ.1.06 లక్షల కోట్లుగా ఉంది. గతేడాదితో పోలిస్తే 5 శాతం వృద్ధి చెందింది.
* పేటీఎం వ్యవస్థాపకుడు విజయ్ శేఖర్ శర్మ ఈ జాబితాలో 8వ స్థానంలో నిలిచారు. ఆయన వ్యాపార సంస్థ మార్కెట్ విలువ రూ.72,800 కోట్లుగా లెక్కించింది. గతేడాదితో పోలిస్తే 67 శాతం మేర వృద్ధి చెందింది.
* ఇటీవల మార్కెట్‌లోకి ఎంట్రీ ఇచ్చిన లెన్స్‌కార్ట్ సైతం 60 శాతం వృద్ధితో రూ.67 వేల కోట్ల మార్కెట్ విలువ సాధించింది. ఈ కంపెనీని నెలకొల్పిన పీయూష్ బన్సల్, అమిత్ చౌదరి, నేహా బన్సల్, సుమిత్ కపాహీ ఈ జాబితాలో 10వ స్థానంలో నిలిచారు.
* హురున్ వెలువరించిన కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.42 లక్షల కోట్లుగా ఉంది. అంతకుముందు ఏడాది రూ.36 లక్షల కోట్లుగా నమోదైంది. అంటే ఏడాదిలో 15 శాతం వృద్ధి నమోదైంది.
* బిలియన్ డాలర్ల కంపెనీగా ఏర్పాటు చేసిన స్వయంకృషితో పైకొచ్చిన వ్యాపారవేత్తల సంఖ్య గతేడాది 121గా ఉంటే.. ఈ ఏడాది 128కి పెరిగింది. ఈ జాబితాలో చోటు దక్కించుకున్న వాటిలో 52 కంపెనీలు బెంగళూరు ప్రధాన కేంద్రంగా ఉన్నాయని నివేదిక పేర్కొంది. దీంతో మరోసారి బెంగళూరు తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది.

# టారిఫ్‌లను ఆయుధంగా మార్చేశారు: నిర్మలా సీతారామన్



దిల్లీ: ప్రపంచ వాణిజ్య ప్రస్తుత తీరుతెన్నులపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు చేశారు. టారిఫ్‌లు, ఇతర మార్గాలను ఆయుధంగా మార్చేశారని ఆమె పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో భారత్ ఆచితూచి వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. మన ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసుకుంటే అదే మనల్ని కాపాడుతుందన్నారు. ఈ మేరకు టైమ్స్ నెట్‌వర్క్ నిర్వహించిన ఇండియా కాన్‌క్లేవ్ 2025లో ఆమె మాట్లాడారు. భారత్‌ను టారిఫ్ కింగ్ అన్నవారే వాటిని ఆయుధంగా మలుచుకుంటున్నారని నిర్మలా సీతారామన్ అన్నారు. నేరుగా పేరు ప్రస్తావించనప్పటికీ.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నుద్దేశించి ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. భారత్‌పై అమెరికా పెద్దఎత్తున సుంకాలు విధించింది. ఇటీవల మెక్సికో సైతం భారత్‌పై సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో నిర్మలా సీతారామన్ నుంచి ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. కేవలం భారత్ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా మనకు అదనపు ప్రయోజనం లభిస్తుందని మంత్రి అన్నారు. భారత్ మాత్రం ఏ రోజూ సుంకాలను ఆయుధంగా మలుచుకోవాలని అనుకోలేదని స్పష్టంచేశారు.

# సౌతాఫ్రికాతో చివరి రెండు టీ20లు..

## శుభ్‌మన్ గిల్ దూరం




సౌతాఫ్రికాతో జరుగుతున్న ఐదు టీ20ల సిరీస్‌లో చివరి రెండు మ్యాచ్‌లకు భారత వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ దూరమయ్యాడు. ప్రాక్టీస్ చేస్తుండగా గిల్ కాలి బొటన వేలికి గాయమైంది. దీంతో ఈరోజు (డిసెంబరు 17) లఖ్‌నవూలో జరిగే నాలుగో మ్యాచ్, ఈనెల 19న అహ్మదాబాద్ వేదికగా జరగనున్న ఐదో టీ20కి గిల్ అందుబాటులో ఉండడని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. శుభ్‌మన్ లేకపోవడంతో ఓపెనర్‌గా సంజు శాంసన్‌ను పంపే అవకాశముంది. గిల్ స్థానంలో ఎవరిని జట్టులోకి తీసుకుంటారనే దానిపై ఇంకా సమాచారం లేదు. ప్రస్తుతం ఈ సిరీస్‌లో భారత్ 21తో ఆధిక్యంలో ఉన్న సంగతి తెలిసిందే. అయితే, సఫారీలతో సిరీస్‌లో గిల్ ఆకట్టుకోలేదు. తొలి మ్యాచ్‌లో నాలుగు పరుగులే చేసిన ఇతను.. రెండో మ్యాచ్‌లో డకౌటయ్యాడు. మూడో టీ20లో 28 బంతుల్లో 28 పరుగులే చేశాడు.




# ఐపీఎల్ 2026 వేలం..

## ఎందుకు కామెరూన్ గ్రీన్‌కు అంత ధర?



ఐపీఎల్ 2026 వేలంలో ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ కామెరూన్ గ్రీన్ భారీ ధర పలికాడు. 2023లో రూ.17.50 కోట్లతో జాక్‌పాట్ కొట్టిన ఇతను.. ఈ సారి అంతకుమించి ధరకు అమ్ముడై రికార్డు సృష్టించాడు. కనీస ధర రూ.2 కోట్లతో వేలంలోకి వచ్చిన గ్రీన్‌ను దక్కించుకోవడం కోసం కోల్‌కతా నైట్‌రైడర్స్, రాజస్థాన్ రాయల్స్, చెన్నై సూపర్ కింగ్స్ పోటీపడ్డాయి. చివరకు కోల్‌కతా రూ.25.20 కోట్లు వెచ్చించి సొంతం చేసుకుంది. దీంతో ఐపీఎల్ (IPL)లో చరిత్రలో అత్యధిక ధరకు అమ్ముడైన విదేశీ ప్లేయర్‌గా నిలిచాడు. మరి గ్రీన్‌ను ఇంత ధర పలకడానికి కారణం ఏంటి? అతడి స్పెషాలిటి ఏంటి?

* 26 ఏళ్ల గ్రీన్ అన్ని ఫార్మాట్ల క్రికెట్‌లో అత్యుత్తమ ఆల్‌రౌండర్. అద్భుతమైన బ్యాటింగ్ టెక్నిక్ అతడి సొంతం. పవర్‌పుల్ షాట్లు ఆడుతూ భారీ సిక్సర్లు కొట్టడంలో ఇతను దిట్ట.
* అంతర్జాతీయ టీ20ల్లో గ్రీన్ స్ట్రైక్‌రేట్ 160.31 కాగా.. ఐపీఎల్‌లో 153.70. ఈ గణాంకాలు చాలు ఇతను ఎంత డేంజరస్ ప్లేయరో చెప్పడానికి.
* గ్రీన్ క్రీజులో ఉన్నాడంటే ఏ బౌలర్‌కైనా వణుకే. అలా ఉంటుంది మరి ఈ ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ విధ్వంసం. ఒక్కసారి క్రీజులో సెట్ అయ్యాడంటే బంతిని బౌండరీకి పంపడమే పనిగా పెట్టుకుంటాడు.
* ఈ పవర్ హిట్టర్ క్షణంలోనైనా మ్యాచ్‌ను మలుపు తిప్పగల సమర్థుడు. భారీ షాట్లతో విరుచుకుపడుతూ బౌలర్లను ఒత్తిడిలో నెట్టేస్తాడు. అంతర్జాతీయ టీ20ల్లో 19 బంతుల్లో, ఐపీఎల్‌లో 20 బంతుల్లో హాఫ్ సెంచరీ చేశాడితను.
* బ్యాటర్‌గా చెలరేగుతూనే తన ఫాస్ట్‌బౌలింగ్‌తో బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టగల సమర్థుడు. 6.6 అడుగుల ఎత్తు ఉండే గ్రీన్ బౌన్సర్లతో బ్యాటర్లను బెంబేలెత్తిస్తాడు.
* గ్రీన్ ఫీల్డింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిందే. ఇతని వైపు బంతి వెళ్లిందంటే బ్యాటర్లు ఆశలు వదులుకోవాల్సిందే. టెస్టుల్లో స్లిప్‌లో ఎక్కువగా ఫీల్డింగ్ చేసే కామెరూన్ పాదరసంలా కదులుతూ మెరుపు వేగంతో క్యాచ్‌లు అందుకుంటాడు.
* పరిమిత ఓవర్ల క్రికెట్‌లో మిడాఫ్, లాంగాఫ్‌లో ఎక్కువగా ఫీల్డింగ్ చేసే ఇతను వేగంగా పరిగెత్తుతూ బంతిని దొరకబుచ్చుకుంటాడు. చాలా పొడగరి అయిన గ్రీన్ గాల్లోకి ఎగిరి కష్టతరమైన క్యాచ్‌లను సైతం సునాయసంగా ఒడిసిపడతాడు.
* క్రీజులో కుదురుకుంటే మ్యాచ్ విన్నర్‌గా మారే కామెరూన్ గ్రీన్‌లో ఆటలో నిలకడ ఉండదు. ఒక మ్యాచ్‌లో మెరిస్తే.. మరో మ్యాచ్‌లో నిరాశపరుస్తాడు. ఇదొక్కటి అతడిలో మైనస్ పాయింట్.
* ఏదిఏమైనా కామెరూన్ గ్రీన్ రూ.25.20 కోట్ల ధర పొందడానికి అర్హుడనే చెప్పాలి. మరి పైసా వసూల్ పెర్ఫామెన్స్ ఇస్తాడో లేదో చూడాలి.

# అలెక్స్ కెరీ సెంచరీ..

## తొలి రోజు ఆసీస్ స్కోర్ 326/8



యాషెస్ సిరీస్‌లో భాగంగా అడిలైడ్ వేదికగా మూడో టెస్ట్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ తలపడుతున్నాయి. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన ఆస్ట్రేలియా తొలి రోజు ఆట ముగిసేసరికి 83 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 326 పరుగులు చేసింది. ఆసీస్ వికెట్ కీపర్ అలెక్స్ కెరీ అద్భుతమైన సెంచరీ (106; 143 బంతుల్లో, 8 ఫోర్లు, 1 సిక్స్) నమోదు చేశాడు. స్టీవ్‌స్మిత్ స్థానంలో అనూహ్యంగా జట్టులోకి వచ్చిన ఉస్మాన్ ఖవాజా (82; 126 బంతుల్లో, 10 ఫోర్లు) రాణించాడు. తనకు అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాడు. జోస్ ఇంగ్లిష్ (32) ఫర్వాలేదనిపించాడు. ట్రావిస్ హెడ్ (10), జేక్ వెదర్లాడ్ (18), లబుషేన్ (19), కామెరూన్ గ్రీన్ (0), పాట్ కమిన్స్ (13) బ్యాటింగ్‌లో విఫలమయ్యారు. తొలి రోజు ఆట ముగిసే సమయానికి మిచెల్ స్టార్క్ 33* (63 బంతుల్లో, 4 ఫోర్లు), నాథన్ లైయన్ 0* (18 బంతుల్లో) పరుగులతో క్రీజులో ఉన్నారు. ఇంగ్లాండ్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్ 3, బ్రైడన్ కార్స్, విల్‌జాక్స్ తలో రెండు, జోష్ టంగ్ ఒక వికెట్ తీసుకున్నారు. అయిదు టెస్ట్‌ల ఈ యాషెస్ సిరీస్‌లో మొదటి రెండు మ్యాచ్‌లు గెలిచిన ఆస్ట్రేలియా జట్టు 20తో ముందంజలో ఉంది.

# సినిమా




## ఇంకా ఉందనుకున్నారు

ది ఫ్యామిలీ మ్యాన్ ఇప్పటి వరకు మూడు సీజన్లుగా వచ్చిన విషయం తెలిసిందే. గత నెల 21 నుంచి అమెజాన్ ప్రైమ్‌వీడియోలో సీజన్3 అందుబాటులోకి తెచ్చారు. సీజన్ 1 పది ఎపిసోడ్స్ తో ప్రారంభించగా.. సీజన్ 3 ఎపిసోడ్స్‌ప్రస్తుతం కొనసాగుతున్నాయి. దీని ముగింపుపై దర్శకులు క్లారిటీ ఇచ్చారు. సీజన్ 1 రోజుల్లో అంతసేపు సిరీస్ చూడటానికి ప్రేక్షకుడికి ఓపిక ఉన్నట్లు ఈ రోజుల్లో ఉండదని.. అందుకే క్లైమాక్స్ ను ప్రయోగాత్మకంగా ముగించినట్లు రాజ్ అండ్ డీకే తెలిపారు. కథను ఒక పాయింట్ దగ్గర ఆపాలనుకున్నారట. చాలా మంది ఎనిమిదో ఎపిసోడ్ ఉందేమోనని భావించి, తమకు అప్ డేట్ కాలేదని అనుకోవడంతో.. ఆ ఉత్కంఠను తాము ముందే ఊహించినట్లు చెప్పారు. 'రుక్మా చేతిలో ఉన్న వారిని శ్రీకాంత్‌విడిపించి జాగ్రత్తగా ఇండియా పంపుతాడు. ఆ తర్వాత అతడే క్లిష్ట పరిస్థితుల్లో పడతాడు. తీవ్ర గాయాలపాలైన శ్రీకాంత్ తివారికి ఏమైందన్న ఉత్కంఠ ప్రేక్షకుడిలో ఉండి.. ఈ సిరీజ్ విజయానికి బాట వేసింది' అని వెల్లడించారు.


## షార్ట్‌హెయిర్ అందుకే!



పవన్ కల్యాణ్ ఇటీవల 'ఓజీ' అప్‌డేట్స్‌తో బ్లాక్‌బస్టర్ హైప్ తెచ్చుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు హరీష్‌శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఉస్తాద్ భగత్ సింగ్'పై అంచనాలు మరింత పెరిగాయి. డిసెంబర్ 19 నుంచి కేరళ షెడ్యూల్ ప్రారంభం కానుందని వార్తలు వినిపిస్తున్నాయి. ఇటీవల విడుదలైన 'దేఖ్ లేంగే సాలా' సాంగ్‌కు యూట్యూబ్‌లో వస్తున్న భారీ స్పందన సినిమాపై క్యూరియాసిటీని మరింత పెంచుతోంది. పవన్ కల్యాణ్‌ను తెరపై ఎలా చూపించాలో క్లారిటీ ఉన్న దర్శకుల జాబితాలో ముందుగా వినిపించే పేరు హరీష్‌శంకర్ . ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'గబ్బర్ సింగ్' ఇందుకు చక్కటి ఉదాహరణ. ఇటీవల పవన్ కళ్యాణ్ హెయిర్ స్టైల్ కూడా సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొన్నప్పుడూ, దర్శకుడు సుజిత్‌కు కారు గిఫ్ట్ ఇచ్చిన సమయంలో విడుదలైన ఫొటోలలోనూ ఆయన షార్ట్ హెయిర్ లుక్ కనిపించింది. ఇవన్నీ 'ఉస్తాద్ భగత్ సింగ్' కోసమే అని సినీ వర్గాల్లో టాక్ నడుస్తోంది. ఈ సినిమాలో పవన్ పోలీస్ పాత్రలో కనిపించనున్నాడని టాక్.



## రష్మిక బ్యాచిలరేట్ ట్రిప్?



నటి రష్మిక మందన్నా మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. కారణం ఆమె చేసిన శ్రీలంక గర్ల్స్ ట్రిప్. చిన్న విరామంగా స్నేహితులతో కలిసి శ్రీలంక వెళ్లిన రష్మిక, ఆ ట్రిప్ ఫొటోలు షేర్ చేయడంతో పెళ్లి గాసిప్స్‌కు కొత్త ఊపొచ్చింది. రష్మిక తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ ట్రిప్‌ను "చాలా అవసరమైన గర్ల్స్ ట్రిప్"గా పేర్కొంది. షూటింగ్‌ల మధ్య రెండు రోజుల విరామం దొరకడంతో సన్నిహిత స్నేహితులతో కలిసి వెళ్లినట్టు తెలిపింది. అందమైన రిసార్ట్, బీచ్ వ్యూస్, కొబ్బరి నీళ్లు తాగుతూ నవ్వులు, సూర్యాస్తమయాలు.. ఇలా రిలాక్స్‌డ్ మూమెంట్స్‌ను ఫొటోలుగా షేర్ చేసింది. "సరైన వాళ్లతో ఉంటే చిన్న విరామమే పెద్ద ఆనందం" అంటూ స్నేహితుల్ని "ది బెస్ట్"గా వర్ణించింది. కొన్ని నెలలుగా రష్మిక-విజయ్ దేవరకొండ పెళ్లి వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఫిబ్రవరి 26న ఉదయ్‌పూర్‌లో వివాహం జరిగే అవకాశముందని కథనాలు వస్తున్నాయి. అయితే ఈ విషయంపై ఇప్పటివరకు ఇద్దరూ అధికారికంగా స్పందించలేదు. ఇదిలా ఉండగా 2025వ సంవత్సరం రష్మికకు బాగా కలిసొచ్చిందనే చెప్పాలి. చావా, కుబేరా, థమ్మా, ది గర్ల్‌ఫ్రెండ్ వంటి సినిమాలతో అన్ని ఇండస్ట్రీల్లో తన క్రేజ్‌ను నిలబెట్టుకుందీ అమ్మడు.

## సోషల్‌మీడియా వాడుతున్న వారిని చేతులు జోడించి అభ్యర్థిస్తున్నా.. : శ్రీలీల




టెక్నాలజీతో జీవితాన్ని సరళతరం చేసుకోవాలి కానీ, ఇతరులకు ఇబ్బంది కలిగించేలా దాన్ని దుర్వినియోగం చేయకూడదని నటి శ్రీలీల అన్నారు. ఏఐ జనరేటెడ్ కంటెంట్‌ను ప్రోత్సహించవద్దని సోషల్‌మీడియా వినియోగిస్తున్న వారందరినీ అభ్యర్థించారు. 'నిజం చెప్పాలంటే ఇలా మాట్లాడటం నాకు అసౌకర్యంగా ఉంటుంది. కానీ, దీని వెనుక ఉన్న ఉద్దేశం నెరవేరుతుందని ఆశిస్తున్నా' అంటూ ఎక్స్ వేదిక పోస్ట్ పెట్టారు. ''ప్రతి సోషల్‌మీడియా ఖాతాదారుడికి చేతులు జోడించి అభ్యర్థిస్తున్నా. ఏఐ సహాయంతో సృష్టించే చెత్తకు సపోర్ట్ చేయొద్దు. టెక్నాలజీని మంచి కోసం వినియోగించడం వేరు. అసభ్యత కోసం వాడటం వేరు. రెండింటికి మధ్య తేడా ఉంది. టెక్నాలజీ అభివృద్ధి చెందటం వల్ల జీవనం మరింత సులభమవ్వాలి. అంతేకానీ, క్లిష్టంగా మారకూడదని నా అభిప్రాయం. ప్రతి అమ్మాయి ఎవరో ఒకరికి కూతురు, మనవరాలు, సోదరి, స్నేహితురాలు, సహోద్యోగి అయి ఉంటారు. కళను తమ వృత్తిగా స్వీకరించి ఉండవచ్చు. ఇండస్ట్రీలో భాగస్వామి అయినందుకు సంతోషపడుతూ, రక్షణతో కూడిన వాతావరణం ఉందన్న నమ్మకాన్ని వారికి ఇవ్వాలి''. ''నాకున్న బిజీ షెడ్యూల్స్ కారణంగా ఆన్‌లైన్‌లో ఏం జరుగుతుందో తెలుసుకోలేకపోతున్నా. అలాంటి కొన్నింటిని నా శ్రేయోభిలాషులు నా దృష్టికి తీసుకొచ్చారు. వారికి ధన్యవాదాలు. చాలా విషయాలను పెద్దగా పట్టించుకోను. నాకంటూ ఒక ప్రపంచం ఉంది. అందులో జీవిస్తా. కానీ, నా దృష్టికి వచ్చిన ఈ విషయం మాత్రం నన్ను బాధించింది. నా తోటి నటీమణులు కూడా ఇలాంటి పరిస్థితే ఎదుర్కోవడం చూస్తున్నా. అందుకే నాతో పాటు, వారందరి తరఫున నేను మీ ముందుకు వచ్చా. ప్రేక్షకులపై నాకు గౌరవం, నమ్మకం ఉన్నాయి. అందుకే, మాకు అండగా నిలబడమని అభ్యర్థిస్తున్నా. ఇక్కడి నుంచి సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకుంటారు'' అని శ్రీలీల పోస్ట్‌పెట్టారు. ప్రస్తుతం ఇది సామాజిక మధ్యమాల్లో వైరల్ అవుతోంది. పలువురు నెటిజన్లు ఆమెకు మద్దతుగా నిలుస్తూ కామెంట్లు పెడుతున్నారు. ఏఐ సాయంతో సృష్టిస్తున్న అసభ్య కంటెంట్‌ను ప్రోత్సహించవద్దని కోరుతున్నారు. ఇక సినిమాల విషయానికొస్తే ఇటీవల ఆమె 'మాస్ జాతర'తో ప్రేక్షకులను పలకరించారు. శివ కార్తికేయన్‌తో కలిసి ఆమె నటించిన 'పరాశక్తి' విడుదల కావాల్సి ఉంది. పవన్, హరీశ్ శంకర్ మూవీ 'ఉస్తాద్ భగత్ సింగ్' కూడా విడుదలకు సిద్ధమవుతోంది.

## ఐబొమ్మ రవిపై కామెంట్స్.. నేను పశ్చాత్తాపపడటం లేదు: శివాజీ



టికెట్ ధరలు పెంచడం వల్లే 99 శాతం మంది ప్రేక్షకులు థియేటర్లకు దూరమవుతున్నారని నటుడు శివాజీ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఆయన ప్రధానపాత్రలో నటించిన చిత్రం 'దండోర'. డిసెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. దీని ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన టికెట్ ధరల గురించి మాట్లాడారు. ''నేను ఉద్దేశపూర్వకంగా ఏమీ మాట్లాడను. ఏ విషయంలోనైనా నిజం చెబుతాను. ప్రస్తుతం ఉన్న సందర్భాన్ని ప్రజలకు గుర్తుచేయాలని మాట్లాడతాను. నేను చేసిన వ్యాఖ్యలు తప్పుగా అర్థం చేసుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. ఇటీవల ఐబొమ్మ రవి గురించి మాట్లాడాను. అతడికి ఉన్న తెలివితేటలను మంచి పనులకు ఉపయోగించుకుంటే బాగుంటుందని అన్నానంతే. అతడు చట్టానికి వ్యతిరేకంగా ప్రవర్తించాడు కాబట్టి తప్పు చేసినట్లే అని చెప్పా. ఆ కామెంట్స్ విషయంలో నేను పశ్చాత్తాపడడం లేదు'' ''సంవత్సరానికి ఐదారు సినిమాలకు టికెట్ ధరలు పెంచడం వల్ల మిగతా 290 సినిమాలకు కూడా ప్రేక్షకులు ఆ ధరలే ఉంటాయని ఊహించుకుంటున్నారు. సినీ రంగం ప్రజల సొత్తు. వాళ్లకు దీనిపై విపరీతమైన మమకారం ఉంది. మారుతున్న సమాజాన్ని దృష్టిలో పెట్టుకుని ఇండస్ట్రీలోని వారిలో కూడా మార్పు రావాలి.



## 'రాజా సాబ్' ప్రీమియర్స్ ఎప్పుడంటే?

హైదరాబాద్: ప్రభాస్ అభిమానులకు శుభవార్త. వెండితెరపై తమ డార్లింగ్‌ను ఒకరోజు ముందుగానే వీక్షించనున్నారు. ప్రభాస్ కథానాయకుడిగా మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న హారర్ థ్రిల్లర్ 'ది రాజాసాబ్'. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ సంక్రాంతి కానుకగా జనవరి 9న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ క్రమంలో చిత్ర బృందం ప్రచార కార్యక్రమాలు మొదలు పెట్టింది. 'సహనా.. సహనా..' అంటూ సాగే పాటను బుధవారం విడుదల చేసింది. ఈ సందర్భంగా 'రాజా సాబ్' ప్రీమియర్స్ గురించి నిర్మాత టీజీ విశ్వప్రసాద్ అప్‌డేట్ ఇచ్చారు. జనవరి 8న స్పెషల్ ప్రీమియర్స్ వేయబోతున్నట్లు ప్రకటించారు. త్వరలోనే హైదరాబాద్ ఓపెన్ గ్రౌండ్స్‌లో 'ది రాజాసాబ్' ప్రీ రిలీజ్ ఈవెంట్ ర్వహిస్తామని తెలిపారు. అందుకు సంబంధించిన తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు.

# కునుకు పట్టకుండా చేస్తున్న కూడళ్ల అభివృద్ధి పనులు

* **అవినీతి జరిగిందంటున్న అన్ని రాజకీయ పార్టీల నేతలు**
* **క్రిమినల్ కేసులు నమోదైనా జరగని విచారణ**



(కరీంనగర్ భారతశక్తి ప్రతినిధి) : కరీంనగర్ పట్టణంలో స్మార్ట్ సిటీ నిధులతో నిర్మించిన కూడళ్ల అభివృద్ధి పనులపై అవినీతి ఆరోపణలు కొనసాగుతూనే ఉన్నాయి. టెండర్ల నిబంధనలు ఉల్లంఘించడం నిధుల దుర్వినియోగం, నాణ్యతలేని పనులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంలో స్మార్ట్ సిటీ నిధులు, రాష్ట్ర ప్రభుత్వం పట్టణ ప్రగతి నిధులు వేలకోట్ల రూపాయలు వెచ్చించి నగరంలో కూడళ్ల సుందరీకరణ, పార్కుల అభివృద్ధి, ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు, రహదారులు, డ్రైనేజీలు, కల్వర్టుల నిర్మాణ పనులు చేపట్టారు. ఒక్కో జంక్షన్ అభివృద్ధి పేరిట సుమారు కోటి రూపాయలు, అంతకుమించి బిల్లులు రికార్డు చేయడం గతంలోనే తీవ్ర చర్చనీయాంశం అయింది. వన్ టౌన్ పోలీస్ స్టేషన్, కాపు వాడ, తీగల వంతెన, కాశ్మీరిగడ్డ, ఇందిరా చౌక్, పద్మా నగర్ ఇలా అనేక ప్రాంతాలలో కూడళ్ల సుందరీకరణకు వాస్తవ ఖర్చుకు మించి ఎంతో ఎక్కువ బిల్లులు రికార్డు చేశారని ఫిర్యాదులు వెల్లువెత్తాయి. నగరపాలక సంస్థ పాలకవర్గ పదవీకాలం పూర్తై, అధికారుల పర్యవేక్షణలోకి బాధ్యతలు వచ్చిన తర్వాత ఈ ఫిర్యాదులు అన్నిటిపై విచారణ జరుగుతుందని స్థానికులు ఎదురుచూశారు. అయితే ఇప్పటివరకు ఈ పనులపై వచ్చిన ఆరోపణలపై కనీస విచారణ లేకుండా పోయింది. 40 లక్షల చేపట్టాల్సిన కూడళ్ల సుందరీకరణ పనులకు కోటి రూపాయలు, కోటి 30 లక్షలకు పైగా వెచ్చించారని గతంలో బీఆర్ఎస్ కార్పోరేటర్లే అనేక ఫిర్యాదులు చేశారు. ఈ మొత్తం నిధులు దుర్వినియోగంపై గతంలో మేయర్గా పనిచేసిన సర్దార్ రవీందర్ సింగ్ హైకోర్టును ఆశ్రయించగా కోర్టు ఆదేశాలతో స్థానిక ఒకటవ పట్టణ పోలీసులు వివిధ సెక్షన్ల కింద క్రిమినల్ కేసులు నమోదు చేశారు. తాజా మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు సైతం స్మార్ట్ సిటీ పనుల్లో జరిగిన అవినీతిపై విచారణ జరిపి దోషులు ఎవరో తేల్చాలని జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేశారు. *అంతా అవినీతే,* బండారి వేణు, మాజీ కార్పొరేటర్, నగరపాలక సంస్థ కరీంనగర్న నగరంలో చేపట్టిన కూడళ్ల సుందరీకరణ పనుల్లో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని 41వ డివిజన్ మాజీ కార్పొరేటర్ బండారి వేణు ఆరోపించారు. జరిగిన పనులకు సంబంధించి బిల్లులను ఆపాలని, ఇప్పటివరకు చెల్లించిన బిల్లులను రికవరీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కూడళ్ల అభివృద్ధి పేరిట ఆహ్వానించిన టెండర్లలో భారీ అవినీతి జరిగిందని వేణు అన్నారు. కాంట్రాక్టర్లు ఇంజనీరింగ్ అధికారులు కుమ్మక్కై వాస్తవ జర కన్నా ఎక్కువగా అంచనాలు వేసి పరోక్షంగా కాంట్రాక్టర్లకు మేలు చేకూర్చారని విమర్శించారు. ఇందిరమ్మ జంక్షన్ 60 లక్షలతో పూర్తి చేస్తామని ప్రకటించి, దాని అంచనా వ్యయాన్ని కోటి 20 లక్షలకు పెంచారని చెప్పారు. అక్కడ కనీసం 60 లక్షల విలువ చేసే పని కూడా జరగలేదని ఆయన అన్నారు. జరిగిన పనులు కూడా పూర్తి నాణ్యత లోపంతో ఉన్నాయని చెప్పారు. ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న జంక్షన్ పనుల్లోనూ అనేక అక్రమాలు జరిగాయని, గతంలో అక్కడ ఉన్న తెలంగాణ తల్లి విగ్రహాన్ని పక్కకు తప్పించారని ఆరోపించారు. పద్మా నగర్ జంక్షన్ పూర్తి నిబంధనలకు విరుద్ధంగా చేపట్టారని, ఎస్టిమేషన్లు, అనుమతి పత్రాలు లేకుండానే పనులు చేపట్టారని తెలిపారు. నగరపాలక సంస్థ అధికారులు ఇప్పటికైనా అభివృద్ధి పనుల పేరిట నగరంలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపి దుర్వినియోగం అయిన నిధులను రికవరీ చేయాలని కోరారు.



## ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని వాహనంలో ఆసుపత్రికి తరలించి మానవత్వం చాటిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) డిసెంబర్ 17: నిజాంసాగర్ - మాగి మధ్యలో జరిగిన ఆటో, బైక్ ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మానవత్వంతో స్పందించి వాహనంలో హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా బుధవారం మధ్యాహ్నం 2.00 గంటలకు వివిధ మండలాల్లో కొనసాగుతున్న కౌంటింగ్ ప్రక్రియను పరిశీలించేందుకు జిల్లా కలెక్టర్ వెళ్తుండగా, మార్గమధ్యలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పెద్ద కోడ్పగల్లో ఓటు వేసి తిరిగి వస్తున్న సమయంలో ఆటో, బైక్ ఢీకొనడంతో ఈ ఘటన జరిగింది. ప్రమాదాన్ని గమనించిన జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి గాయపడిన వ్యక్తికి తక్షణ సహాయం అందించి, ఎలాంటి ఆలస్యం చేయకుండా వాహనంలో సమీప ఆసుపత్రికి తరలించి మానవత్వాన్ని చాటుకున్నారు.

## ఉద్యాన సాగులో వై ఎస్ ఆర్ కడప జిల్లా ను అగ్రస్థానంలో నిలిపేలా చర్యలు

: **జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి.**

వై ఎస్ ఆర్ కడప, డిసెంబర్ 17 (భారత శక్తి): వ్యవసాయ, ఉద్యాన పంటల సాగులో వైయస్సార్ కడప జిల్లా రాష్ట్రంలోనే అగ్రస్థానం లో నిలిచేలా సాగుబడి విస్తీర్ణం పెరుగుతోందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి వివరించారు. అమరావతి లో రెండు రోజుల పాటు జరుగుతున్న 5వ జిల్లా కలెక్టర్ల సమావేశం లో భాగంగా మొదటి రోజు బుధవారం జరిగిన సమావేశంలో వైఎస్ఆర్ కడప జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి హాజరై జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన శాఖల అభివృద్ధిపై రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో జిల్లా లోని రైతులు ఉద్యాన, వాణిజ్య పంటల పైన ఎక్కువ మొగ్గు చూపుతూ.. ఉత్పత్తి కూడా గణనీయంగా పెంచుతున్నారన్నారు. వాణిజ్య పంటలైన అరటి, చీనీ, నిమ్మ, దానిమ్మ, పండ్ల తోటలతో పాటు ఉల్లి, పసుపు, పూల తోటలను విస్తారం గా సాగు చేస్తున్నారన్నారు.



జిల్లాలో పండించిన చామంతి పువ్వులను అధికంగా బెంగుళూరు తదితర ప్రాంతాలకు ఎగుమతి చేయడం వల్ల ఆశించిన మేర ఆదాయాన్ని జిల్లా రైతులుపొందుతున్నారన్నారు. వాణిజ్య పంటల విషయం లో ఇక్కడ రైతులు మార్కెటింగ్ పైన కొంత ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉందని, ఏ సీజన్ లో.. ఏయే పంటలకు ఎలాంటి డిమాండ్ ఉంటుందన్న విషయాన్ని దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం స్థానిక, జాతీయ, అంతర్జాతీయ ట్రేడింగ్ పైన రైతులకు అవగాహన పెంపొందించే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. భవిష్యత్తు లో వైయస్సార్ కడప జిల్లా ఉద్యాన పంటలకు ప్రసిద్ధిగాంచేలా, ఉద్యాన హబ్ గా జిల్లాను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని జిల్లా కలెక్టర్ రాష్ట్ర ముఖ్యమంత్రి గారికి వివరించారు.

## ఎస్జిఎఫ్ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ చాంపియన్ పోటీలకు పారమిత

కరీంనగర్, డిసెంబర్ 17 (భారతశక్తి ప్రతినిధి): రాష్ట్ర స్థాయి బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీలకు పారమిత ఉన్నత పాఠశాలకు చెందిన 6వ తరగతి విద్యార్థి ఎం. చాణక్యన్ ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్ తెలిపారు. డిసెంబర్ 15 న కరీంనగర్ పట్టణంలోని అంబేద్కర్ స్టేడియంలో జిల్లా ఎస్.జి.ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా అండర్ 14 బాలుర బాక్సింగ్ చాంపియన్షిప్ పోటీలలో 32 34 కిలోల విభాగంలో బంగారు పథకం సాధించి రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైనాడు. రాష్ట్ర స్థాయి పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో హన్మకొండ పట్టణంలోని జె.ఎన్ స్టేడియంలోని బాక్సింగ్ హాల్ లో డిసెంబర్ 18 నుండి 25 వరకు తేదీలో నిర్వ హించనున్న 69వ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీలలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా



పాఠశాల చైర్మన్ డా. ఇనుగంటి ప్రసాదరావు, పాఠశాల డైరెక్టర్లు . ప్రసూన, రాకేష్, రశ్మిత, అనుకర్ రావు, వినోదరావు, వి.యు. ఎం. ప్రసాద్, హనుమంతరావు. ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్, బాలాజీ, కవిత ప్రసాద్ సమన్వయకర్త శ్రీనాథ్ లు రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనే విద్యార్థని, బాక్సింగ్ కోచ్ ఎ. రామకృష్ణ ను అభినందించారు.

# మూడవ దశలో పోలింగ్ 80. 62 శాతం

- **కౌంటింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించాలి**
- **జిల్లా పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్**

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) : డిసెంబర్ 17: మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా బుధవారం జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలలో బాన్సువాడ నియోజక వర్గంలోనీ 8 మండలాలు అయిన బాన్సువాడ, బిచ్కొండ, బీర్కూర్, డోంగ్లి, జుక్కల్ మద్నూర్, నస్రుల్లాబాద్, పెద్ద కోడ్ పగల్ మండలాల్లో నిర్వహించిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని కలెక్టర్ తెలిపారు . ఈ సందర్భంగా నస్రుల్లాబాద్ మండలం దుర్కి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బీర్కూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, డోంగ్లి మండలం మాదన్ హిప్పార్గ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ,



డోంగ్లి మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పెద్ద కోడ్ పగల్ మండలాల్లో పోలింగ్, కౌంటింగ్ కేంద్రాలను విస్తృతంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న పోలింగ్ సరళిని, పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు. ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ప్రతి పోలింగ్ కేంద్రంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పోలింగ్ ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి ఎటువంటి ఇబ్బందులు రాకుండా పోలింగ్ ప్రక్రియ సజావుగా కొనసాగుతున్నట్లు వివరించారు. దివ్యాంగులు, వృద్ధుల కొరకు వీల్ చైర్ లు, ర్యాంప్స్ ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికల సిబ్బందికి ఎలాంటి అసౌకర్యాలు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో జరిగిన మూడవ విడత లో 80 62 శాతం పోలింగ్ జరిగిందని, కౌంటింగ్ ప్రక్రియ కొనసాగుతున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు విక్టర్, సబ్ కలెక్టర్ కిరణ్మయి, డిప్యూటి ట్రైనీ కలెక్టర్ రవితేజ, ఎన్నికల నిర్వహణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగే తీరును వివిధ గ్రామాల్లో పరిశీలించిన జిల్లా కలెక్టర్

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) డిసెంబర్ 17: బుధవారం మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా వివిధ గ్రామ పంచాయతీలను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, సాధారణ పరిశీలకులు సత్యనారాయణరెడ్డి సందర్శించి పరిశీలించారు. నస్రుల్లాబాద్ మండలం దుర్కి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, బీర్కూర్ మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, డోంగ్లి మండలం మాదన్ హిప్పర్గ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్సాంగ్వాన్, సాధారణ పరిశీలకులు సత్యనారాయణరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వచ్చిన దివ్యాంగులను, వృద్ధులను పలకరించారు. ఓటు హక్కు తమ బాధ్యతని ప్రతీ ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు.

## పెన్షన్ భిక్ష కాదు...ఉద్యోగుల రాజ్యాంగబద్ధమైన హక్కు..

* **ఘనంగా 800 మందితో జాతీయ పెన్షనర్స్ దినోత్సవ వేడుకలు**

కరీంనగర్, డిసెంబర్ 17 (భారతశక్తి ప్రతినిధి): ప్రభుత్వం అందజేస్తున్న పెన్షన్ రిటైర్డ్ ఉద్యోగికి ఇచ్చేది బిక్ష కాదని, రాజ్యాంగ బద్దమైన హక్కనీ ఎంప్లాయిస్ జేఏసి జిల్లా ఛైర్మన్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి ఉద్ఘాటించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోల సంఘ భవనంలో జిల్లా సంఘం ఆధ్వర్యంలో జాతీయ పెన్షనర్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా టీపీసీఏ అసోసియేషన్ అధ్యక్షులు పెండ్యాల కేశవ రెడ్డి అధ్యక్షతన జరిగిన వేడుకల్లో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్ , ఆర్డీవో మహేష్ కుమార్ లు కీర్తిశేషులు నకారా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, జ్యోతి ప్రజ్వలన గావించి ప్రారంభించారు. ఈ సందర్భంగా దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పెన్షన్ ఉద్యోగికి భిక్ష, దయాదాక్షిణ్యం కాదని, 30-35 సంవత్సరాలు ప్రజా సేవ చేసిన ఉద్యోగికి వృద్ధాప్యంలో సామాజిక-ఆర్థిక భద్రత కల్పించే హక్కు అని సుప్రీంకోర్టు తీర్పు స్పష్టం చేసిందని తెలిపారు. పెన్షన్ వ్యవస్థను పునరుద్ధరింపజేసిన నకారా న్యాయపోరాటానికి జిల్లా పెన్షనర్ల సంఘం,



తెలంగాణ ఎన్జీవోల సంఘం తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. నేటి కల్తీ యుగంలో పెన్షనర్లు ఆర్థిక లావాదేవీల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించేందుకు సమిష్టి పోరాటం అవసరమని పిలుపునిచ్చారు. అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, ఆర్డీవో మహేష్ కుమార్ మాట్లాడుతూ, తమ వద్దకు సీనియర్ సిటిజన్లకు సంబంధించిన అనేక కుటుంబ, ఆర్థిక సమస్యలు, మోసాలకు సంబంధించిన కేసులు వస్తున్నాయని, పెన్షనర్లు ఎవరినీ అతిగా నమ్మకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎలదాసరి లింగయ్య, రాష్ట్ర అధ్యక్షులు గాజుల నరసయ్య, జిల్లా కార్యదర్శి సంగెం లక్షణరావు, గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు మడిపెల్లి కాళీచరణ్, కోశాధికారి ముప్పిడి కిరణ్ కుమార్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఏ.ఎం. హమీద్, మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సుద్దాల రాజయ్య గౌడ్, రాష్ట్ర నాయకులు రాగి శ్రీనివాస్, సర్దార్ అర్వీందర్ సింగ్, గూడ ప్రభాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు మారుపాక రాజేష్, హజ్గర్ భరద్వాజ్, చల్ల మోహన్ రెడ్డి, నాగుల రాజారామ్, అమ్మ రాజయ్య, నరసయ్య, మహమ్మద్ అజ్గర్ అలీ తదితర ఉద్యోగ సంఘాల నాయకులు, పెన్షనర్లు 800 మంది పెన్షనర్లు పాల్గొన్నారు.

# ఢిల్లీలో ప్రపంచ ఆరోగ్య సదస్సులో మోగిన ఫైర్ అలారం..

ఢిల్లీ, డిసెంబర్ 17(భారతశక్తి ప్రతినిధి): ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) గ్లోబల్ సమ్మిట్ ఆన్ ట్రెడిషనల్ మెడిసిన్ (సంప్రదాయ ఔషధంపై సదస్సు) రెండో ఎడిషన్ భారతదేశ రాజధాని ఢిల్లీలో నేటి నుండి ప్రారంభమైంది. ఈ అంతర్జాతీయ సదస్సులో ఊహించని పరిణామం చోటు చేసుకుంది. ఫైర్ అలారం మోగడంతో అక్కడున్న వారంతా ఉలిక్కిపడ్డారు. ఏం జరిగిందో తెలియక అందరూ ఆందోళనకు గురయ్యారు. అప్రమత్తమైన నిర్వాహకులు వారందరినీ బయటకు పంపించారు. అయితే సాంకేతిక లోపం కారణంగా అలారం మోగినట్లు గుర్తించారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కాగా, డబ్ల్యూహెచ్ఓ, ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేటి నుంచి మూడు రోజుల పాటు భారత మండపంలో ఈ అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నారు. ఇందుకోసం ప్రపంచవ్యాప్తంగా 100 దేశాల నుంచి పరిశోధకులు, సంబంధిత రంగ నిపుణులు, చట్టసభ సభ్యులు సహా అనేక మంది ప్రముఖులు హాజరవుతున్నారు. దాదాపు 170 మంది నిపుణులు పలు అంశాలపై మాట్లాడనున్నారు.



## షర్మిలకు శుభాకాంక్షలు తెలిపిన చంద్రబాబు, పవన్ కల్యాణ్

విజయవాడ, డిసెంబర్ 17(భారతశక్తి ప్రతినిధి): ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల ఈరోజు తన 51వ జన్మదినాన్ని జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆమెకు రాజకీయ పార్టీలకు అతీతంగా శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు తన అధికారిక 'ఎక్స్' ఖాతా ద్వారా షర్మిలకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. "ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు శ్రీమతి వైఎస్ షర్మిల గారికి జన్మదిన శుభాకాంక్షలు. ఆమెకు మంచి ఆరోగ్యం, దీర్ఘాయుష్షు ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాను" అని చంద్రబాబు తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా షర్మిలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. భగవంతుడు ఆమెకు చిరాయువు, సుఖ సంతోషాలు అందించాలని ఆకాంక్షించారు. అయితే, షర్మిల సోదరుడు, వైసీపీ అధినేత జగన్ మాత్రం ఆమెకు బహిరంగంగా శుభాకాంక్షలు తెలుపలేదు. అన్నాచెల్లెళ్ల మధ్య ఉన్న రాజకీయ విభేదాల నేపథ్యంలో ఈ పరిణామం మరోసారి వారి మధ్య దూరాన్ని స్పష్టం చేస్తోంది.

## మూడు దేశాల పర్యటన... చివరగా ఒమన్ చేరుకున్న ప్రధాని మోదీ

ఒమన్, డిసెంబర్ 17: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తన మూడు దేశాల పర్యటనలో చివరి అంకానికి చేరుకున్నారు. పర్యటనలో భాగంగా బుధవారం ఆయన ఒమన్ రాజధాని మస్కట్‌లో అడుగుపెట్టారు. మస్కట్ విమానాశ్రయంలో ఒమన్ ఉప ప్రధాని (రక్షణ వ్యవహారాలు) సయ్యద్ షిహాబ్ బిన్ తారిఖ్ అల్ సయీద్ ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం ప్రధాని మోదీకి సైనిక వందనంతో గౌరవ స్వాగతం లభించింది. భారత్, ఒమన్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత పటిష్టం చేసే లక్ష్యంతో ఈ పర్యటన సాగుతోంది. ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 70 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ పర్యటనకు ప్రత్యేక ప్రాధాన్యత ఏర్పడింది. పర్యటనలో భాగంగా ఒమన్ సుల్తాన్ హైతామ్ బిన్ తారిఖ్‌తో ప్రధాని మోదీ విస్తృత స్థాయి చర్చలు జరపనున్నారు. వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధన సహకారం, రక్షణ, భద్రత, సాంకేతికత వంటి కీలక అంశాలపై ఇరువురు నేతలు సమీక్షించనున్నారు. 2018 తర్వాత ప్రధాని మోదీ ఒమన్‌లో పర్యటించడం ఇది రెండోసారి. గతేడాది డిసెంబర్‌లో ఒమన్ సుల్తాన్ భారత్‌లో పర్యటించారు. శతాబ్దాల నాటి సముద్ర వాణిజ్యం, ప్రజల మధ్య సంబంధాలతో ఇరు దేశాల బంధం బలపడిందని విదేశాంగ శాఖ కార్యదర్శి అరుణ్ కుమార్ ఛటర్జీ తెలిపారు. ఈ పర్యటనలో ప్రధాని మోదీ ఇరు దేశాల వ్యాపార ప్రముఖులతో సమావేశమవుతారు. అలాగే, ఒమన్‌లో స్థిరపడిన భారత ప్రవాస సంఘంతో కూడా భేటీ కానున్నారు. ఒమన్ పర్యటనకు ముందు ప్రధాని మోదీ ఇథియోపియాలో రెండు రోజుల పాటు పర్యటించారు. ఇథియోపియా ప్రధాని అబే అహ్మద్ అలీ.. స్వయంగా కారు నడుపుతూ మోదీని విమానాశ్రయానికి తీసుకెళ్లి వీడ్కోలు పలకడం విశేషం. ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారం 'గ్రేట్ ఆనర్ నిషాన్ ఆఫ్ ఇథియోపియా'ను కూడా మోదీ అందుకున్నారు.

## తిరుమల శ్రీవారి ఆర్జిత సేవల కోటా టికెట్ల విడుదల రేపే..

తిరుమల, డిసెంబర్ 17(భారతశక్తి ప్రతినిధి): తిరుమల శ్రీవారి భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) 2026 మార్చి నెలకు సంబంధించిన ఆర్జిత సేవా టికెట్ల కోటాను డిసెంబర్ 18వ తేదీ ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన వంటి ఆర్జిత సేవల టికెట్లను ఎలక్ట్రానిక్ డిప్ విధానంలో కేటాయిస్తారు. భక్తులు ఈ సేవల కోసం రేపటి నుంచి డిసెంబర్ 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. డిప్‌లో టికెట్లు పొందిన భక్తులు డిసెంబర్ 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపు రుసుము చెల్లించి ఖరారు చేసుకోవాల్సి ఉంటుంది. ఇతర సేవల టికెట్లను కూడా పలు తేదీల్లో విడుదల చేయనున్నారు. డిసెంబర్ 22న ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ టికెట్లను అందుబాటులో ఉంచుతారు. అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు వర్చువల్ సేవల కోటాను విడుదల చేస్తారు. డిసెంబర్ 23న ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణ టోకెన్లు, ఉదయం 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు దర్శన టికెట్ల కోటాను విడుదల చేయనున్నారు. వయోవృద్ధులు, దివ్యాంగుల కోసం ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతారు. ఇక రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్ల కోటాను డిసెంబర్ 24న ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిలలో వసతి గదుల కోటాను విడుదల చేయనున్నట్లు టీటీడీ తెలిపింది. భక్తులు ఈ తేదీలను గమనించి, టీటీడీ అధికారిక వెబ్‌సైట్ https://ttdevasthanams.ap.gov.in ద్వారానే టికెట్లు బుక్ చేసుకోవాలని అధికారులు సూచించారు.

## 82 వేల ఎకరాలపై సీఎం చంద్రబాబు కీలక ఆదేశం..

విజయవాడ, డిసెంబర్ 17(భారతశక్తి ప్రతినిధి): రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే సంస్థలకు భూముల కొరత రాకుండా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. అమరావతిలో జరుగుతున్న జిల్లా కలెక్టర్ల సమావేశంలో భాగంగా పారిశ్రామిక పెట్టుబడులపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా, ఏపీఐఐసీకి చెందిన సుమారు 82 వేల ఎకరాల భూమి 22ఏ (నిషేధిత జాబితా) పరిధిలో ఉండటం వల్ల పెట్టుబడులకు ఆటంకంగా మారిందని అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై తక్షణం స్పందించిన ముఖ్యమంత్రి, ఆ 82 వేల ఎకరాల భూమికి సంబంధించిన సాంకేతిక అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్లను ఆదేశించారు. ఎలాంటి చట్టపరమైన, సాంకేతిక ఇబ్బందులు లేకపోతే, ఆ భూములను 22ఏ పరిధి నుంచి తప్పించేందుకు కేబినెట్ సమావేశానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. భూ కేటాయింపుల్లో పర్యాటక రంగానికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలని, ఆ తర్వాత ఐటీ కంపెనీలకు కేటాయించాలని చంద్రబాబు సూచించారు. గత 18 నెలల్లో రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ)లో రూ.8.55 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులకు ఆమోదం తెలిపామని, కొన్ని ప్రాజెక్టులు ఇప్పటికే నిర్మాణ పనులు కూడా ప్రారంభించాయని ముఖ్యమంత్రి తెలిపారు. భూ కేటాయింపుల్లో కలెక్టర్లు చొరవ చూపి ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. విజయవాడ, విశాఖపట్నంలలో భూ వివాదాల పరిష్కారానికి ప్రత్యేక ట్రైబ్యునల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సౌర, పవన, పంప్డ్ స్టోరేజీ వంటి పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు భూ కేటాయింపులు త్వరగా పూర్తి చేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు. విశాఖ, తిరుపతి, అమరావతి వంటి ప్రాంతాల్లో ప్రముఖ విద్యా సంస్థల ఏర్పాటుకు కృషి చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా హోటళ్లు, టూరిజం ప్రాజెక్టులను పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని కలెక్టర్లకు సూచించారు.

## హైదరాబాద్‌కు.. చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

హైదరాబాద్, డిసెంబర్ 17(భారతశక్తి ప్రతినిధి): రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శీతాకాలం విడిది కోసం హైదరాబాద్ చేరుకున్నారు. ఆమె ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌లోని హకీంపేట ఎయిర్‌ఫోర్స్ శిక్షణ కేంద్రానికి చేరుకున్నారు. రాష్ట్రపతికి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్క స్వాగతం పలికారు. ఆమె డిసెంబర్ 22 వరకు హైదరాబాద్‌లో ఉంటారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో హైదరాబాద్‌లో పలుచోట్ల ట్రాఫిక్ నిబంధనలు వర్తిస్తాయి. రేపు రాష్ట్రపతి నిలయంలోనే ఆమె విశ్రాంతి తీసుకుంటారు. 19న రామోజీ ఫిల్మ్ సిటీలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాలకు హాజరవుతారు. 20న గచ్చిబౌలిలో బ్రహ్మకుమారీస్ శాంతిసరోవర్ సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాలలో పాల్గొంటారు. 21న రాష్ట్రపతి నిలయంలో నిర్వహించే పౌరుల భేటీ, ఎట్ హోమ్‌లో పాల్గొంటారు. 22న సాయంత్రం ప్రత్యేక విమానంలో ఢిల్లీకి బయలుదేరుతారు.

## సర్పంచ్ గా గెలిచిన కాపాకు సన్మానం చేసిన శెట్టి రంగారావు

ఖమ్మం బ్యూరో, భారత శక్తి, డిసెంబర్ 17: ఖమ్మం వి వెంకటాయపాలెం గ్రామ పంచాయతీ ఎన్నికలలో ఘన విజయం సాధించిన కాపా ఆదినారాయణకు వారి గ్రామం వెళ్లి బుధవారం సత్కరించిన కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకులు శెట్టి రంగారావు. ఈ సందర్భంగా శెట్టి మాట్లాడుతూ కాకలు దీరిన యోధుల మధ్య తిరిగిన ఘనుడిని ఆనాడే పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ఉన్నత విద్యావంతుడు కాపా ఆదినారాయణ అని తను రాజకీయ రంగంలో తను నమ్ముకున్న పార్టీని ప్రజలను వదలకుండా పనిచేయడం వలన గెలుపు తనకు వచ్చిందని అన్నారు. రాజకీయ పదవులు మరియు ప్రజాప్రతినిధి పదవులు తనకు కొత్త కాదని అది అందరికి దక్కదని కాపా ఆదినారాయణ లాంటివారికి ఎప్పుడు దక్కుతాయని నూతన సర్పంచిగా కాంగ్రెస్ పార్టీ



నుండి గెలిచిన ఆదినారాయణకు గెలిపించిన ప్రజలకు అభినందనలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో శెట్టి రంగారావుతో పాటు నాంపల్లి శంకరయ్య, నరసింహారావు, జంగాల శ్రీనివాసరావు మరియు గ్రామ నాయకులు వున్నారు.

## సంక్రాంతి పండుగకు 16 అదనపు రైళ్లు ప్రకటించిన రైల్వే

ఢిల్లీ, డిసెంబర్ 17(భారతశక్తి ప్రతినిధి): సంక్రాంతి పండుగ రద్దీని దృష్టిలో పెట్టుకుని అదనపు రైళ్లను నడపాలని నిర్ణయించినట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. సంక్రాంతి పండుగ సందర్భంగా జనవరి 9 నుంచి 19 మధ్య 16 అదనపు ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు తెలిపింది. ఈ రైళ్లు సికింద్రాబాద్, వికారాబాద్ నుంచి శ్రీకాకుళం రోడ్ వరకు వెళతాయని పేర్కొంది. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ ఓ ప్రకటన జారీ చేశారు.


**Additional Sankranti Special Trains between various Destinations**

In view of extra rush on account of ensuing Sankranti Festival season, South Central Railway to run **16 additional special trains** to various destinations.

| Sl. | Tr. No. | From - To | Departure | Arrival | JCO |
|---|---|---|---|---|---|
| 1 | 07288 | Secunderabad – Srikakulam Rd | 19.00 | 12.30 (next day) | 09.01.2026, 11.01.2026 |
| 2 | 07289 | Srikakulam Rd – Secunderabad | 15.30 | 08.10 (next day) | 10.01.2026, 12.01.2026 |
| 3 | 07290 | Secunderabad – Srikakulam Rd | 19.00 | 12.30 (next day) | 10.01.2026, 12.01.2026, 16.01.2026, 18.01.2026 |
| 4 | 07291 | Srikakulam Rd – Secunderabad | 15.30 | 08.10 (next day) | 11.01.2026, 13.01.2026, 17.01.2026, 19.01.2026 |
| 5 | 07294 | Vikarabad – Srikakulam Rd | 17.15 | 12.30 (next day) | 13.01.2026 |
| 6 | 07295 | Srikakulam Rd – Secunderabad | 15.30 | 08.10 (next day) | 14.01.2026 |
| 7 | 07292 | Secunderabad – Srikakulam Rd | 19.00 | 12.30 (next day) | 17.01.2026 |
| 8 | 07293 | Srikakulam Rd – Secunderabad | 15.30 | 08.10 (next day) | 18.01.2026 |

## క్రీడా ఆణిముత్యాలను గౌరవించడంలో ఏపీ ఎప్పుడూ ముందుంటుంది






అమరావతి, డిసెంబర్ 17(భారతశక్తి ప్రతినిధి): మహిళల వన్డే ప్రపంచకప్‌లో అద్భుతమైన ప్రదర్శనతో రాష్ట్రానికి కీర్తి ప్రతిష్ఠలు తీసుకొచ్చిన క్రికెటర్ శ్రీచరణికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అండగా నిలవడంపై సీఎం చంద్రబాబు అర్ధాంగి నారా భువనేశ్వరి హర్షం వ్యక్తం చేశారు. ఇవాళ మంత్రి నారా లోకేశ్ తెలుగు క్రికెటర్ శ్రీచరణికి రూ.2.5 కోట్ల చెక్ అందించారు. దీనిపై నారా భువనేశ్వరి స్పందించారు. క్రీడల్లో రాణిస్తున్న ప్రతిభావంతులను గుర్తించి, వారికి సరైన ప్రోత్సాహం అందించాలన్న ప్రభుత్వ నిబద్ధతను ఆమె ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆమె, "రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచే క్రీడాకారులను గౌరవించడంలో ఆంధ్రప్రదేశ్ ఎల్లప్పుడూ ముందుంటుంది. శ్రీచరణికి ప్రభుత్వం అందిస్తున్న ఈ గుర్తింపు, మద్దతు హర్షణీయం. ఇలాంటి ప్రోత్సాహకాలు భవిష్యత్ తరాలకు గొప్ప స్ఫూర్తినిస్తాయి" అని పేర్కొన్నారు. కష్టపడి రాణించే క్రీడాకారులకు ప్రభుత్వం అండగా నిలవడం వారిలో ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచుతుందని అభిప్రాయపడ్డారు. శ్రీచరణి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి, గొప్ప విజయాలు సాధించాలని నారా భువనేశ్వరి ఆకాంక్షించారు.

# యువ ఆపద మిత్రులతో ఆపన్నహస్తం..

## వారం రోజుల శిక్షణను ప్రారంభించిన హైడ్రా కమిషనర్





హైదరాబాద్, డిసెంబర్ 17(భారత శక్తి) : నేను.. నా వాళ్లతో పాటు.. చుట్టు పక్కల ఉన్న వాళ్ల గురించి ఆలోచించినప్పుడే మన జీవితానికి సార్ధకత ఉంటుందని హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ అన్నారు. "పరుల కొరకు పాటుపడని నరుడి బతుకు దేనికని" ప్రముఖ కవి సి.నా.రె. గారు తన గజల్స్‌లో చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇది మానవ జీవితం యొక్క పరమార్థాన్ని, ఇతరుల కోసం జీవించడం యొక్క ప్రాముఖ్యతను తెలియజేసే గొప్ప వాక్యమని దీనిని అందరూ ఒంట పట్టించుకోవాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తనతో పాటు చుట్టుపక్కల వారిని కూడా సురక్షితంగా కాపాడాలనే ఉద్దేశంతో 'యువ ఆపద మిత్ర' పథకం వాలంటీర్లకు హైడ్రా ఆధ్వర్యంలో ఫతుల్‌గూడలో వారం రోజుల పాటు ఏర్పాటు చేసిన శిక్షణను హైడ్రా కమిషనర్ ప్రారంభించి ప్రసంగించారు. పరుల కోసం పాటుపడే ఆలోచనతో ఈ శిక్షణకు రావడం ఎంతో ఆనందించదగ్గ విషయమన్నారు. మన రెండు చేతుల్లో ఒకటి పరులకు చేయూతనందించడానికి ఉపయోగపడాలన్నారు. మనం జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవడం వరకే పరిమితమవ్వకుండా ఇతరులకు కూడా చేయూతనందించాలన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తోటివారిని కాపాడడం ఎలా అనేది ఈ శిక్షణలో నేర్పుతారని.. మీకు కూడా మీ చుట్టుపక్కల ఉన్న పరిస్థితులపై అవగాహన ఉండాలన్నారు. అప్పుడే ప్రమాద సమయంలో తోటివారిని కాపాడగలరన్నారు. వారం రోజుల శిక్షణలో.. అన్ని మెలుకువలు నేర్చుకుని.. వాటిని మరింతమందికి మీరు తెలియజేయాలని సూచంచారు. ఈ సందర్భంగా హైడ్రా కార్యకలాపాల గురించి విద్యార్థుల సందేహాలను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గారు నివృత్తి చేయడమే కాకుండా.. వారి నుంచి కూడా ఫీడ్ బ్యాక్ తెలుసుకున్నారు. చెరువులను పునరుద్ధరించడం, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను, పార్కులను పరిరక్షించడంలో హైడ్రా కృషిని విద్యార్థులు అభినందించారు. హైడ్రా అడ్మిన్ ఎస్పి ఆర్. సుదర్శన్ గారు, హైడ్రా అడిషనల్ డైరెక్టర్ శ్రీ వర్ల పాపయ్య గారు, ఎన్‌డీఆర్ ఎఫ్ డిప్యూటీ క మాండెంట్ దామోదర్ సింగ్, మై భారత్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీ గంటా రాజేష్ గారు, హైడ్రా ఆర్ ఎఫ్‌వో జయప్రకాశ్ గారు, డీఎఫ్‌వోలు యజ్ఞ నారాయణ గారు, గౌతమ్ గారు ఈ కార్యక్రమంలో పాల్గొని యువ ఆపద మిత్ర వాలంటీర్లనుద్దేశించి పలు సూచనలు చేశారు. వారం రోజుల శిక్షణ గురించి హైడ్రా ఏడీఆర్ ఎఫ్‌వో డి. మోహనరావు గారు వివరించారు. హైడ్రా కమిషనర్ గారి సూచనల మేరకు క్షేత్రస్థాయి పర్యటనలను కూడా భాగం చేసినట్టు చెప్పారు.



## సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించిన కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి

ఎల్బీనగర్, డిసెంబర్ 17 (భారత శక్తి):: హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి డివిజన్‌లోని బృందావన్ కాలనీలో నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాలనీలో ఉన్న రహదారుల దయనీయ స్థితిని గమనించి ప్రజల అభ్యర్థన మేరకు ఈ సీసీ రోడ్ల పనులను ప్రారంభించామని, డివిజన్‌లో ఎక్కడ సమస్య ఉన్నా అక్కడ వెంటనే పనులు చేపట్టడం మా బాధ్యత. రాబోయే రోజుల్లో మరిన్ని వసతులను కల్పించేలా సంబంధిత అధికారులతో కలిసి సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తామని, ప్రజలు ఎప్పటికప్పుడు సూచనలు ఇవ్వాలని వాటిని పరిష్కరించేందుకు మా వంతు కృషిని చేస్తాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బృందావన్ కాలనీ అధ్యక్షులు రవీందర్ రెడ్డి, మధురానగర్ కాలనీ అధ్యక్షులు అమల్, అయ్యా సంక్షేమ సంఘం సభ్యులు, బీజేపీ నాయకులు సురేష్ రెడ్డి, శ్రీకాంత్, ప్రేమ్, అఖిలేష్, ప్రణవ్ తదితరులు పాల్గొన్నారు.

# బూతులు తిట్టిన సీనియర్ ఎంటమాలజిస్ట్ ను సస్పెండ్ చేయాలి

**: ఉదరి గోపాల్**



ఎల్బీనగర్, డిసెంబర్ 17 (భారత శక్తి) : ఎంటమాలజీ కార్మికులను బూతులు తిట్టిన జిహెచ్ఎంసి 4,5 సర్కిల్స్ సీనియర్ ఎంటమాలజిస్ట్ మాధవరెడ్డిని సస్పెండ్ చేయాలని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు ఉదరి గోపాల్ డిమాండ్ చేశారు. ఎల్బీనగర్ జోనల్ కార్యాలయం ముందు ఎంటమాలజీ కార్మికులతో కలసి బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జీహెచ్ఎంసి 4,5 సర్కిల్స్ సీనియర్ ఎంటమాలజిస్ట్ మాధవ రెడ్డి, ఔట్ సోర్సింగ్ ఏఈ రాంబాబు మరో ఏఈ మనెమ్మలు అవినీతికి పాల్పడుతూ, ఎంటమాలజీ కార్మికులను చెప్పరాని బూతులు తిడుతున్నారని ఇలాంటి అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ అధికారులు అక్రమంగా డీజిల్ కూపన్లను అమ్ముకుని అవినీతికి పాల్పడుతున్నారని జిహెచ్ఎంసి కమిషనర్ కు, విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్ మెంట్ అధికారులకు ఫిర్యాదు చేయ నున్నామని తెలిపారు.

**ఏఈ వివరణ**

ఎంటమాలజీ ఏఈ రాంబాబును ఈ విషయమై వివరణ కోరగా, పోయిన వారం ఒక కార్మికుడు మద్యం సేవించి డ్యూటీకి వచ్చి నానా హంగామా చేయడం, ఆయనకు జరిమానా విధించి, 3 రోజులు డ్యూటీకి రాకుండా పనిష్మెంట్ ఇచ్చా మని, వారి కాంట్రాక్టర్ కు ఫిర్యాదు చేయడం జరిగిందని, అలాగే నలుగురు కార్మికులు డ్యూటీ సమయంలో 4 గంటలు చెప్పకుండా ఎటో వెళ్లి వచ్చారని, వారిని మందలించినందుకు, ఈ రోజు యూనియన్ నాయకులతో కలిసి మా మీద తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఏఈ రాంబాబు తెలిపారు.

# గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం రావాలి

**: కప్పాటి పాండురంగా రెడ్డి**

మహేశ్వరం, డిసెంబర్ 17 (భారత శక్తి): తెలంగాణ మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా కుటుంబసభ్యులతో కలిసి రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం పరిధిలోని తమ సొంత గ్రామం బాచుపల్లిలో తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి కుటుంబ సభ్యులతో కలసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా పాండురంగారెడ్డి మాట్లాడుతూ, నూతనంగా



ఎన్నుకోబడిన గ్రామ సర్పంచ్ లు, వార్డ్ సభ్యులు పదవిని అలంకార ప్రాయంగా భావించకుండా ప్రజాసేవే పరమావధిగా సుస్థిరమైన అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా, సమగ్ర గ్రామీణ అభివృద్ధిపై పంచాయతి పాలక వర్గం దృష్టి పెట్టి స్వయం సమృద్ధికి కృషి చేయాలని అలాగే నేటి సమాజంలో యవత ఆలోచనలు బాగా కలుషితమయ్యాయని, వాటి నుంచి బయటపడడానికి ఆధ్యాత్మిక శిక్షణ, అత్యవసరమని వాటి కోసం కృషిచేయాలని సమృద్ధి గ్రామంగా మారాలంటే ఆర్థిక, సామాజిక, రాజకీయ స్వాతంత్ర్యం సాధించడమే ప్రధాన లక్ష్యంగా మహాత్మా గాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం కొరకు పాటు పడాలని గ్రామ అభివృద్ధిలో ప్రజలను భాగస్వామ్యం చేస్తూ గ్రామ సమగ్ర అభివృద్ధి సాధించాలని సూచించారు.



# ప్రశాంతంగా ఓట్ల పండుగ

- **ఓటు హక్కును వినియోగించుకున్న ఓటర్లు..**
- **కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న రాచకొండ సిపి సుధీర్ బాబు**

రాచకొండ, డిసెంబర్ 17 (భారత శక్తి): మూడో తుది విడత స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా బుధవారం రాచకొండ పరిధిలో మంచాల మండలంలోని అఘపల్లిలో జరుగుతున్న పోలింగ్ సరళిని రాచకొండ సిపి సుధీర్ బాబు పరిశీలించారు. రాచకొండలో భువనగిరి పరిధిలో గుండాల, మోటకొండూరు, చౌటుప్పల్, నారాయణపూర్ మోత్కూర్, అడ్డగూడూరు, కందుకూరు, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, మాడ్గుల్, గ్రీన్ ఫార్మా, మాడ్గుల్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో పోలింగ్ స్టేషన్ ల వద్ద ఎన్నికలు నడుస్తున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఆంక్షలు విధిస్తున్నట్టు రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు తెలిపారు. ఆయా పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో 163 బిఎన్ఎస్ (144 సెక్షన్) విధిస్తున్నట్టు వెల్లడించారు. ఓటింగ్ కేంద్రాలకు 200 మీటర్ల దూరంలో నలుగురికి మించి గుమిగూడరాదని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్లు, భద్రతాపరమైన ఏర్పాట్లను సమీక్షించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ..ఎన్నికలు పూర్తి స్వేచ్ఛాయుతంగా వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలను తీసుకోవాలని, పోలింగ్ ఐపోయి ఫలితాలు వచ్చేవరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిబ్బంది అధికారులు అప్రతంగా ఉండాలని సూచించారు. ఎలాంటి చిన్న సంఘటన చోటు చేసుకున్నా వెంటనే కంట్రోల్ రూమ్ కు సమాచారం అందించాలని సూచించారు.



# నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులను పరిశీలించిన కళ్లెం నవజీవన్ రెడ్డి

ఎల్బీనగర్, డిసెంబర్ 17 (భారత శక్తి): హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి బుధవారం సంబంధిత అధికారులతో కలిసి డివిజన్‌లోని షిరిడి నగర్ కాలనీలో జరుగుతున్న నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాలనీవాసులకు మెరుగైన రవాణా సదుపాయాలు, శుభ్రమైన మౌలిక వసతులు అందించడమే తమ ప్రాధాన్యమని తెలిపారు. పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా, నిర్దేశిత సమయంలో పూర్తిచేయాలని అధికారులు అలాగే కాంట్రాక్టర్లను ఆదేశించారు. కాలనీ అభివృద్ధి కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని, ప్రజల సూచనలు ఎప్పుడూ స్వాగతిస్తామని కూడా కార్పొరేటర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఈ దామోదర్, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు ఉపేందర్, చంద్రశేఖర్, నర్సిములు, ప్రవీణ్ రెడ్డి, రాజా రామ్, షబ్బీర్ రుద్దీన్, యాది రెడ్డి, మహేష్, వర్క్ ఇన్స్పెక్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.